RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 255 మేడ్చల్ మల్కాజ్‌గిరి 8 అక్టోబర్ 2024 మంగళవారం పేజీలు : 4

## కెనడాలో విదేశీ విద్యార్థులపై బహిష్కరణ కత్తి

టొరంటో : కెనడాలో చదువుతున్న విదేశీ విద్యార్థులు ప్రస్తుతం బహిష్కరణ ముప్పును ఎదుర్కొంటున్నారు. ఫెడరల్ ఇమిగ్రేషన్ విధానాల్లో మార్పుల కారణంగా 70వేల మందికి పైగా అంతర్జాతీయ గ్రాడ్యుయేట్ విద్యార్థులు త్వరలో దేశాన్ని వదిలి వెళ్లాల్సి ఉంటుంది. దీనిపై దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. స్టడీ పర్మిట్లను పరిమితం చేస్తూ, శాశ్వత నివాస నామినేషన్లను తగ్గించాలని ట్రూడో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా ఇప్పుడు విద్యార్థులు దేశవ్యాప్తంగా నిరసన వ్యక్తం చేస్తున్నారు. దేశంలో పెరుగుతున్న ఇళ్ల కొరత, నిరుద్యోగ సమస్యకు చెక్ పెట్టడం కోసమే స్టడీ పర్మిట్లలో కోత విధించినట్లు ప్రభుత్వం చెబుతోంది. మరోవైపు తక్కువ వేతనాలకు ఉద్యోగాలు చేస్తున్న తాత్కాలిక విదేశీ కార్మికుల సంఖ్యను కూడా తగ్గిస్తున్నట్లు ప్రధాని ట్రూడో తాజాగా ప్రకటించడం అగ్గి రాజేసింది.

## మీకు కష్టమొస్తే ఆదుకోవడంలో ముందుంటాం..

# మాల్దీవులకు మోదీ అభయం




### ఫలప్రదంగా చర్చలు.. త్వరలో మాల్దీవుల్లో ప్రధాని మోదీ పర్యటన

న్యూఢిల్లీ: ద్వీప దేశమైన మాల్దీవులకు ఏ కష్టం వచ్చినా ఆదుకునేందుకు భారత్ ముందుంటుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. మాల్దీవులతో భారత్‌కు ఉన్న స్నేహం దశాబ్దాల నాటిదని గుర్తు చేశారు. భారతదేశంలో ఐదు రోజుల పర్యటన కోసం వచ్చిన మాల్దీవులు అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జుతో సోమవారం నాడు జరిపిన ద్వైపాక్షిక చర్చల అనంతరం ఇరువురు నేతలు సంయుక్త ప్రకటన చేశారు. నరేంద్ర మోదీ, ముయిజ్జులు హైద్రాబాద్ హౌస్ నుంచి పలు ప్రాజెక్టులను వర్చువల్‌గా ప్రారంభించా రు. ఇరుదేశాలు కలిసి పనిచేసేందుకు నిరయించుకోవడంతో పాటు పలు ఎంఓయూ లపై సంతకాలు చేశారు. మాల్దీవుల్లోని హనిమాధూ అంతర్జాతీయ విమానాశ్రయం రన్‌వేను వర్చువల్‌గా ప్రారంభించడంతో పాటు అధికారికంగా 'రూపీ కార్డ్ 'ను ప్రవేశపెట్టారు. మాల్దీవుల్లో కొద్దిరోజుల క్రి తం రూపీ కార్డ్‌ను లాంచ్ చేశామని, యూపీఐ ద్వారా ఇరుదేశాలు అనుసంధానం కావడానికి ఇప్పుడు సమయం వచ్చిందని ప్రధాని తెలిపారు.

**మేము ముందుంటాం..** మాల్దీవులకు ఎప్పుడు కష్టమొచ్చినా ఆదుకునేందుకు ముందుడే దేశం భారత్ అని సంయుక్త సమావేశంలో మోదీ పేర్కొన్నారు. కోవిడ్ వ్యాక్సిన్ సరఫరా, మౌలిక సదుపాయల ప్రాజెక్టులకు తాము చేసిన సహాయాన్ని ఈ సందరరేగా గుర్తు చేశారు. మాల్దీవులు అధ్యక్షుడు, ఆయన ప్రతినిధి బృందానికి సాదర స్వాగతం చెబుతున్నానని, ఇరుదేశాల మధ్య సంబంధాలు దశాబ్దాల నాటివని అన్నారు. ఇండియాకు అతి సమీప దేశం, సన్నిహిత స్నేహతుడు మాల్దీవులని, సరిహద్దు దేశాలతో భారత్ విధానంలోనూ, సాగర్ విజన్‌లోనూ మాల్దీవులకు కీలక భూమిక ఉందన్నారు. మాల్దీవులకు ఏ కష్టమొచ్చినా తొలుత స్పందించడంలో భారత్ ఎప్పుడూ కీలకంగా నిలుస్తుందని చెప్పారు.

పొరుగుదేశాల పట్ల భారత్ ఎప్పుడూ బాధ్యతాయుతంగా ఉంటుందని, సమగ్ర ఆర్థిక, తీర ప్రాంత భద్రతా భాగస్వామ్యం విషయంలో ఇరుదేశాల మధ్య పరస్పర సహకారం వ్యూహాత్మక దిశలో ముందుకు తీసుకువెళ్లేందుకు ఉభయదేశాలు నిరయించినట్టు చెప్పారు.

**భారత్‌కు ముయిజ్జు కృతజ్ఞతలు..** పలు ప్రాజెక్టులను ప్రారంభించడం ద్వారా మాలే, మాలే ప్రజలకు న్యూఢిల్లీ ఎప్పుడూ చేయూతనిస్తుండటం పట్ల ముయిజ్జు కృతజ్ఞతలు తెలిపారు. మాల్దీవుల అవసరాలకు అనుగుణంగా 400 మిలియన్ డాలర్లు, రూ.300 కోట్ల కరెన్సీ స్వాప్ అగ్రిమెంట్‌పై సంతకాలు చేసినట్టు చెప్పారు. తమ దేశం సంక్షోభంలో ఉన్నప్పుడల్లా భారత్ స్నేహహస్తం అందిస్తూనే ఉందన్నారు. అందుకు తాము కృతజ్ఞతలు చెప్పుకుంటున్నామని అన్నారు. మాల్దీవుల్లో సామిజక-ఆర్థిక, మౌలిక వసతుల అభివృద్ధిలో భారత్ కీలక భాగస్వామి అని చెప్పారు. ఏళ్ల తరబడి భారత్ అందిస్తున్న ఉదార సాయం, సహకారానికి గాను ప్రధాని మోదీ, భారత ప్రభుత్వం, దేశ ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నానని అన్నారు.

**ఫలప్రదంగా చర్చలు.. త్వరలో మాల్దీవుల్లో ప్రధాని మోదీ పర్యటన**
మాల్దీవుల అధ్యక్షుడు మహమ్మద్ ముయిజ్జుతో చర్చలు ఫలప్రదంగా కొనసాగుతున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం తెలిపారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో ఓ పోస్ట్ చేశారు. "మాల్దీవుల అధ్యక్షుడు మహమ్మద్ ముయిజ్జును భారత్‌కు రావడాన్ని నేను స్వాగతిస్తున్నా. వాతావరణ మార్పు, నీటి వనరులు, వ్యవసాయం, మత్స్య పరిశ్రమ, ఇరు దేశాలకు చెందిన కొన్ని రంగాలలో ఆర్థిక సంబంధాలు, కనెక్టివిటీ, సాంస్కృతిక అనుసంధానం, సహకారాన్ని మెరుగుపరచడానికి గల మార్గాలను ఈ సమావేశంలో చర్చించాం"అని మోదీ పేర్కొన్నారు. మాల్దీవుల్లో పర్యటించాల్సిందిగా మహమ్మద్ ముయిజ్జు ఆహ్వానాన్ని ప్రధాని నరేంద్ర మోదీ అంగీకరించినట్లు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ ఈ విషయాన్ని ధ్రువీకరించారు.

**5 రోజుల పర్యటన..** మాల్దీవుల అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జు ద్వైపాక్షిక చర్చల కోసం తొలిసారి భారత్‌లోకి అడుగుపెట్టారు. సుమారు 12 మంది మంత్రులు, సీనియర్ అధికారులతో ఆదివారం న్యూఢిల్లీ చేరుకున్న ముయిజ్జును కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి కీర్తివర్ధన్ సింగ్ స్వాగతించారు. ఇంతకు ముందు జూన్‌లో ప్రధాని నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకారోత్సవానికి ముయిజ్జు హాజరయ్యారు. ఈసారి భారత్‌లో ఐదు రోజులు పర్యటించనున్న ముయిజ్జు.. రాష్ట్రపతి ద్రౌపదిముర్ము, ప్రధాని మోదీతో సమావేశమయ్యారు. ముంబయి, బెంగళూరులో జరిగే పలు కార్యక్రమాల్లోనూ పాల్గొంటారు. ఈ క్రమంలోనే ప్రధానిమోదీతో ముయిజ్జు సోమవారం సమావేశమయ్యారు. గతేడాది నవంబరులో ముయిజ్జు మాల్దీవుల అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి భారత్‌తో ఆ దేశ సంబంధాలు దెబ్బతిన్నాయి. చైనా మద్దతుదారుగా పేరొందిన ముయిజ్జు.. తమ దేశంలోని భారత సైనికులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా ఢిల్లీ బయలుదేరే ముందు బీబీసీతో మాట్లాడిన ముయిజ్జు.. ఆర్థిక సంక్షోభంలో ఉన్న మాల్దీవులకు భారత్ అండగా ఉంటుందన్న ఆశాభావం వ్యక్తంచేశారు.

## ఫలితాలపై ఉత్కంఠ! హరియాణా, జమ్మూకశ్మీర్‌లో ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం

చండీగఢ్/శ్రీనగర్: జమ్మూకశ్మీర్, హరియాణా అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధమైంది. మంగళవారం ఉదయం 8గంటల నుంచి లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానుంది. ఇందుకోసం లెక్కింపు కేంద్రాల వద్ద మూడంచెల భద్రతను ఏర్పాటు చేసినట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు.

లోక్‌సభ ఎన్నికల అనంతరం భాజపా, కాంగ్రెస్‌ల మధ్య ఇదే తొలి ప్రత్యక్ష పోరు కావడం, మరికొన్ని నెలల్లో మహారాష్ట్ర, ఝూర?ండ్, దిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ ఈ ఫలితాలు ఆసక్తికరంగా మారాయి. హరియాణా, జమ్మూకశ్మీర్‌లలో 'హస్తం' జోరు కొనసాగే అవకాశాలు ఉన్నాయని పలు ఎగ్జిట్ పోల్స్ అంచనాలు వెలువడినప్పటికీ.. గెలుపుపై ఎవరికి వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు.



**హ్యాట్రిక్ ఖాయమంటున్న సీఎం నయాబ్ సింగ్...** హరియాణాలో భాజపా, కాంగ్రెస్, ఆప్, ఐఎన్ఎల్‌డీ-బీఎస్పీ, జేజేపీ-ఆజాద్ సమాజ్ పార్టీలు ప్రధానంగా తలపడ్డాయి. అత్యధిక స్థానాల్లో భాజపా, కాంగ్రెస్‌ల మధ్యే ప్రధానంగా పోటీ ఉండే అవకాశం కనబడుతోంది. మొత్తం 90 స్థానాల్లో 1031 మంది అభ్యర్థులు పోటీలో నిలవగా.. వీరిలో 464 మంది స్వతంత్ర అభ్యర్థులే. అక్టోబరు 5న ఒకే విడతలో ఎన్నికలు జరగ్గా.. 67.90శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఎగ్జిట్ పోల్స్ అంచనాలను భాజపా సీనియర్ నేత, హరియాణా సీఎం నయాబ్ సింగ్ కొట్టిపారేశారు. హరియాణాలో పూర్తిస్థాయి మెజార్టీతో మూడోసారి తామే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. ఫలితాలు వెలువడ్డాక కాంగ్రెస్ ఈవీఎంలను నిందించడం ఖాయమంటూ ఎద్దేవా చేశారు.

**మేం లేనిదే లౌకిక ప్రభుత్వం అసాధ్యం.. ముఫ్తీ...** జమ్మూకశ్మీర్‌లో ప్రధాన రాజకీయ పక్షాల నేతలు తమ విజయావకాశాలపై ధీమాతో ఉన్నారు. కాంగ్రెస్-ఎన్‌సీ కూటమి నేతలు జమ్మూకశ్మీర్‌లో ఏర్పడే ప్రభుత్వం తమదేనని విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. మొత్తం 90 సీట్లలో 873 మంది బరిలో నిలిచారు. మూడు విడతల్లో ఎన్నికలు జరగ్గా.. 63.45 శాతం పోలింగ్ నమోదైంది. ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మ్యాజిక్ ఫిగర్ 46. ఎన్నికలకు ముందే కూటమిగా ఏర్పడి పోటీలో నిలిచిన నేషనల్ కాన్ఫరెన్స్, కాంగ్రెస్‌లు తాము సొంతంగానే ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని చెబుతుండగా.. భాజపా స్వతంత్ర అభ్యర్థులపై నమ్మకం పెట్టుకుంది.

ఇంకోవైపు తమ మద్దతు లేకుండా జమ్మూకశ్మీర్‌లో సెక్యులర్ ప్రభుత్వం ఏర్పాటు సాధ్యం కాదని పీడీపీ చెబుతోంది. జమ్మూకశ్మీర్ భాజపా చీఫ్ రవీందర్ రైనా మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో 35 సీట్లు గెలుచుకుని, తమ పార్టీయే అతిపెద్ద పార్టీగా అవతరిస్తుందన్నారు. స్వతంత్రులు, భావసారూప్యత కలిగిన గ్రూపులతో కలిసి భాజపా మెజార్టీ మార్కు సాధిస్తుందన్నారు.

తమ విజన్, అభివృద్ధి, జమ్మూకశ్మీర్‌లో శాంతియుత పరిస్థితులను చూసిన ప్రజలు భాజపాకే ఓటు వేశారని తెలిపారు.



## అమిత్ షాతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ.. కారణం ఇదే!

ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరుసగా కేంద్ర పెద్దలతో సమావేశమవుతున్నారు. తాజాగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాతో భేటీ అయ్యారు. తెలంగాణకు వరద సాయం పెంచాలని రిక్వెస్ట్ చేశారు. విభజన చట్టంలోని పెండింగ్ అంశాలపైనా సుదీర్ఘంగా చర్చించారు. మూసీ ప్రక్షాళన చేపట్టిన నేపథ్యంలో నమామీ గంగ తరహాలో నిధులు కేటాయించాలని కోరినట్లు సమాచారం.

కాగా, భారీ వర్షాలు, వరదలతో అతలాకుతలమైన రాష్ట్రాలను ఆర్థికంగా ఆదుకునేందుకు ఎట్టకేలకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల సాయం అందించిన విషయం తెలిసిందే. తెలంగాణకు రూ.416.80 కోట్లు విడుదల చేసింది. ఏపీకి రూ.1,036 కోట్లను ఎన్డీఆర్ఎఫ్ కింద సాయం అందించింది. రాష్ట్రంలో జరిగిన నష్టాన్ని అమిత్ షాకు వివరించి మరిన్ని నిధులు కేటాయించాలని రిక్వెస్ట్ చేసినట్లు తెలుస్తున్నది.







## స్థానిక సంస్థల ఎన్నికల వేళ తెలంగాణ పాలిటిక్స్‌లో

# టీడీపీ సంచలనం

### పార్టీలో చేరుతున్నానంటూ తీగల ప్రకటన

### మాజీ మంత్రి మల్లారెడ్డి చంద్రబాబుతో భేటీ!

### ఇంకా మరికొందరు సీనియర్ నేతలు టిడిపిలో చేరుతారంటూ ఊహాగానాలు!!

హైదరాబాద్ : తెలంగాణ రాజకీయాల్లో మరో సంచలన పరిణామం చోటు చేసుకుంది. బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి తిరిగి టీడీపీలో చేరబోతున్నట్లు ప్రకటించారు. సోమవారం హైదరాబాద్ లో టీడీపీ అధినేత, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుతో తీగల కృష్ణారెడ్డి, ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డి భేటీ అయ్యారు. ఈ భేటీ అనంతరం మీడియాతో మాట్లాడిన తీగల.. తాను నూటికి నూరు శాతం టీడీపీలో చేరబోతున్నట్లు స్పష్టం చేశారు. తెలంగాణలో తెలుగుదేశం పార్టీకి పూర్వవైభం తీసుకువచ్చేందుకు చంద్రబాబును కలిశామని చెప్పారు. మరోసారి పిలిచి మాతో మాట్లాడుతానని చంద్రబాబు చెప్పారన్నారు. నాతో పాటు చాలా మంది నాయకులు టీడీపీలో చేరుతారని ప్రకటించారు. టీడీపీ వల్లే హైదరాబాద్ అభివృద్ధి చెందిందని, రాష్ట్రంలో చాలా మంది ఎన్టీఆర్, టీడీపీ అభిమానులు ఉన్నారని వారందరిని ఏకతాటిపైకి తీసుకువస్తామన్నారు. దీంతో తీగల బాటలో ఎవరెరు టీడీపీ గూటికి చేరబోతున్నారనేది సర్వత్రా సస్పెన్స్ గా మారింది.

**మల్లారెడ్డిపై ఊహాగానాలు:** నిజానికి గత కొంత కాలంగా మల్లారెడ్డి టీడీపీలో చేరుతానే ఊహాగానాలు జోరుగా వినిపిస్తున్నాయి. రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారం కోల్పోయాక మల్లారెడ్డి కాంగ్రెస్ లో చేరేందుకు ప్రయత్నాలు చేశారని ఇందులో భాగంగానే గతంలో కర్నాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ను సైతం కలిశారనే ప్రచారం జరిగింది. ఇక బీజేపీతోనూ మంతనాలు జరిపినా ఆ పార్టీ నుంచి రూట్ క్లియర్ కాకపోవడంతో ఆయన ఆగిపోయారనే టాక్ వినిపించింది. ఈ నేపథ్యంలో ఏపీలో చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం, తాను గతంలో టీడీపీ నుంచే ఎంపీగా గెలవడంతో చంద్రబాబుతో ఉన్న పరిచయం కారణంగా ఆయన పార్టీలో చేరేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నట్లు ప్రచారం చాలా రోజులుగా జరుగుతోంది. ఈ వాదనకు బలం చేకూరేలా ఇవాళ తన అల్లుడితో పాటు చంద్రబాబుతో భేటీ కావడం, మల్లారెడ్డి సమక్షంలోనే తీగల తాను పార్టీ మారబోతున్నట్లు ప్రకటించడం సంచలనంగా మారింది. అయితే మూడు రోజుల క్రితమే మల్లారెడ్డి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తో భేటీ అయ్యారు. తాజాగా తన అల్లుడితో కలిసి టీడీపీ అధినేతను కలిసి తన మనవరాలి వివాహానికి ఆహ్వానించారు.
ఈ క్రమంలోనే తాను వెడ్డింగ్ కార్డు ఇచ్చేందుకే చంద్రబాబుతో భేటీ అయ్యానని మల్లారెడ్డి క్లారిటీ ఇచ్చారు. అయితే రాష్ట్రంలో ఉన్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ఇంట్లో జరగబోయే శుభకార్యం అనంతం మల్లారెడ్డి రాజకీయంగా ఏదైనా సంచలన నిర్ణయం తీసుకోబోతున్నారా? అనేది పొలిటికల్ కారిడార్ లో చర్చగా మారింది.

**'స్థానిక' ఎన్నికల వేళ సంచలన పరిణామం:** గత కొంత కాలంగా తెలంగాణ రాజకీయాల్లో ట్రయాంగిల్ ఫైట్ నడుస్తోంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు నువ్వా నేనా అన్నట్లుగా వ్యూహాలు రచిస్తున్నాయి. ఈ క్రమంలో తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ పోటీ చేయబోతున్నదని ఇందుకు శ్రేణులంతా సిద్ధంగా ఉండాలని గత జూన్ లోనే పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు క్లారిటీ ఇచ్చారు. తెలంగాణలోని పార్టీ నేతలతో సమావేశమైన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. త్వరలోనే టీ టీడీపీకి అధ్యక్షుడిని నియమిస్తానని పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు.

ఈ నేపథ్యంలో పలువురు కీలక నేతలు టీడీపీ వైపు చూస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. ఇంతలో గత కొంత కాలంగా బీఆర్ఎస్ లో అసంతృప్త రాగం ఆలపిస్తున్న తీగల కృష్ణారెడ్డి తాను టీడీపీలో చేరుతానని ప్రకటించడం, మల్లారెడ్డి వంటి నేతలు సైతం పార్టీ మారుతారనే ప్రచారం జరుగుతుండటంతో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల వేళ తెలంగాణ రాజకీయాల్లో అనేక సంచలనాలు నమోదు కాబోతున్నాయనే చర్చ జోరందుకుంది.

# సంపాదకీయం

## ఇప్పటికి రెండు నెలు... మరి హసీనా.. కబ్ జాయేగీ?

అతిథి దేవోభవ.. భారత కల్చర్ లో అణువణువు నిండిన పద్ధతి ఇది.. అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో ఇంటికి వచ్చిన వారిని దేవుడిగా చూసే పద్ధతి మిగతా దేశాల్లో ఉందో లేదో కానీ.. మన దేశం మాత్రం అక్కున చేర్చుకుంటుంది. దీనికి పలుసార్లు మూల్యం కూడా చెల్లించుకుంది. తాజాగా చూస్తే ఆగస్టు 5న తమ దేశంలో అలజడి రేగడంతో బంగ్లాదేశ్ ప్రధాని పదవికి రాజీనామా చేసి హుటాహుటిన బయల్దేరి భారత్ కు చేరుకున్నారు షేక్ హసీనా. తనతో పాటు ఆమె చెల్లెలు రెహానా కూడా ఉన్నారు. అత్యంత సంక్షోభ కాలంలో శరణు కోరి వచ్చిన ఆడబిడ్డలకు భారత దేశం ఆశ్రయం ఇచ్చింది.

**అప్పట్లో దలైలామా..** 1950ల్లో టిబెట్ పై చైనా దమనకాండతో భారత్ కు వచ్చారు బౌద్ధ మత గురువు దలైలామా. ఆయన శిష్య గణంతో పాటు భారత్ కు చేరుకోగా అతిథిగా గౌరవించి ఆతిథ్యం ఇచ్చింది మన దేశం. కానీ, ఇది చైనాకు కన్నెర్ర అయింది. దలైలామాను అప్పగించనందుకు భారత్ పై ఆక్రమణకు దిగింది. చివరకు కొంత భూభాగాన్ని చైనాకు కోల్పోయింది. ఇక దలైలామా హిమాచల్ ప్రదేశ్ లోని ధర్మశాలను తన కార్యక్షేత్రంగా మార్చుకుని ఇక్కడే జీవిస్తున్నారు. ఆయన ఇక్కడినుంచే వివిధ దేశాల పర్యటనలకు వెళ్తుంటారు. చైనా ఎన్ని అభ్యంతరాలు వ్యక్తం చేసినా దలైలామాను భారత్ వెళ్లిపోమని చెప్పలేదు. అతిథి వారంతట వారే వెళ్లాలనేది తమ సంప్రదాయంగా చెబుతోంది.

**హసీనా ఎన్నాళ్లో?** లెక్కపెట్టి చెప్పడం సరికాదు కానీ.. భారత్ లో రెండు నెలులగా ఉంటున్నారు షేక్ హసీనా. ఆగస్టు 5న ఘజియాబాద్ చేరుకున్న హసీనాను భారత ప్రభుత్వం ఆదరించింది. తొలుత బ్రిటన్ వెళ్లాలనుకున్న హసీనాకు ఆ దేశం నుంచి అభ్యంతరాలు వ్యక్తం కావడంతో భారత్ ను శరణు కోరారు. సరిహద్దుల నుంచి యుద్ధ విమానాలు పంపి మరీ హసీనా సురక్షితంగా భారత్ చేరేలా చేసింది కేంద్ర ప్రభుత్వం. కాగా, హసీనాను అప్పగించాలని బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం కోరింది. దీనిని భారత్ ఏమాత్రం పట్టించుకోలేదని వాపోయింది కూడా.

**వెళ్లడం కష్టమే..** ఇక హసీనా తిరిగి స్వదేశం వెళ్లడం కష్టమే అని స్పష్టమవుతోంది. ఎందుకంటే బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం ఆమెపై వందల కేసులు బనాయించింది. ఇప్పుడు 75 ఏళ్ల హసీనా బంగ్లాకు వెళ్తే వెంటనే అరెస్టు చేసి జైల్లో వేస్తుంది. అందుకనే ఆమె భారత్ లోనే సాధ్యమైనన్ని రోజులు ఉంటారని భావించాల్సి వస్తోంది.

# క్రీడల్లో రాణించగలిగితే మంచి భవిష్యత్తు ఉంటుంది : ఈటల

## జిఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ ను ప్రారంభించిన ఎంపీ ఈటల



శామీర్ పేట, (గరుడ వార్త) : యువకులు తమకు మక్కువైన క్రీడల పై దృష్టి సారిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని మల్కాజ్ గిరి పార్లమెంట్ సభ్యుడు ఈటెల రాజేందర్ అన్నారు. ఆదివారం శామీర్ పేట మండలం తుర్కపల్లిలో జీఎస్ఆర్ ఫౌండేషన్ క్రికెట్ టోర్నమెంట్ ను తుర్కపల్లి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ క్రీడా పోటీలకు ఎంపీ ఈటల రాజేందర్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటల మాట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని చెప్పారు. యువకులు క్రీడలపై దృష్టి సారిస్తే ఉన్నత శిఖరాలకు ఎదుగుతారని తెలిపారు. కాగా ఈ క్రీడలను మాజీ సర్పంచ్ రవీందర్ రెడ్డి తన తండ్రి జ్ఞాపకార్థం జీఎస్ఆర్ ఫౌండేషన్ ఏర్పాటు చేసి ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం జీఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, తుర్కపల్లి మాజీ సర్పంచ్ జీడిపల్లి రవీందర్రెడ్డి మాట్లాడుతూ తన తండ్రి జీడిపల్లి నరసింహారెడ్డి జ్ఞాపకార్థం స్మారక క్రికెట్ టోర్నమెంట్ క్రీడా పోటీలను నిర్వహిస్తు యువతను ప్రోత్సహిస్తు న్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జి వేణుగోపాల్ రెడ్డి, జి సుజిత్ రెడ్డి, చంద్రారెడ్డి, డి మహేష్, డి బిక్షపతి, వి శివ, జి ప్రవీణ్ కుమార్, జె సత్యనారాయణ, శామీర్ పేట మాజీ ఎంపీపీ చంద్రశేఖర్ యాదవ్, బిజెపి నాయకులు బుద్ధి శ్రీనివాస్, యాదగిరి, మైసయ్య, గ్రామ యువకులు పాల్గొన్నారు.

# ఘనంగా శరన్నవరాత్రోత్సవ పూజలు...

## అలియాబాద్ గ్రామంలో ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన గ్రామస్తులు



శామీర్ పేట, (గరుడ వార్త) : పూర్వ ఉమ్మడి శామీర్ పేట మండలంలో ఘనంగా శరన్నవరాత్రోత్సవాలు కొనసాగుతున్నాయి. పూర్వ ఉమ్మడి శామీర్ పేట మండలం లోని వివిధ గ్రామాలలో దేవి నవరాత్రులలో భాగంగా అమ్మవారి మండపాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. మండల కేంద్రం శామీర్ పేట శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు మురళీధర్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారిని లలితాంబికా దేవి గా అలంకరించి దర్శనం కల్పించారు. అలాగే శామీర్ పేట శ్రీ దుర్గా విఘ్నేష్ యూత్ మండపం వద్ద శ్రీ అన్నపూర్ణదేవిగా అలంకరించి అమ్మవారిని దర్శనం కల్పించారు. ఉమ్మడి శామీర్ పేట మండలం లోని వివిధ గ్రామాలలో అమ్మవారి ఆలయాలు, అమ్మవారి మండపాల వద్ద నిర్వాహకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# 47 ప్రాజెక్టులు.. రూ.934.35 కోట్లు



కరీంనగర్ : దేశవ్యాప్తంగా వంద నగరాలను అత్యాధునికంగా అభివృద్ధి చేసే లక్ష్యంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన కరీంనగర్ స్మార్ట్‌సిటీ మిషన్ పనులు తుది దశలో నత్తనడకన సాగుతున్నాయి. ఈ ఏడాది జూన్ 30తో గడువు ముగియగా.. కేంద్ర పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వచ్చే ఏడాది మార్చి నెలాఖరు వరకు మరోసారి గడువు పెంచింది. ప్రారంభించిన పనులు, మిగిలిన పెండింగ్ పనులు పూర్తి చేసుకునే వీలు కలిగింది. రోడ్లు, డ్రైనేజీలు, ఫుట్‌పాత్‌లు, పార్కులు, అంబేడ్కర్ స్టేడియంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్, వీధి దీపాలు, కూడళ్లు, సీసీ కెమెరాలు, ట్రాఫిక్ సిగ్నల్స్, స్మార్ట్ క్లాసులు, కమాండ్ కంట్రోల్, డిజిటల్ తెరలు, ఉచిత వైఫై తదితర పనులు అందుబాటులోకి వచ్చాయి. మిగతా ప్రాజెక్టులు కొనసాగుతుండగా.. ఎప్పటిలోగా ఇవి పూర్తవుతాయనే విషయాన్ని మాత్రం అధికారులు సైతం చెప్పలేకపోతున్నారు.

**చేసిన పనులు 25.. చేయాల్సినవి 20**

కరీంనగర్ స్మార్ట్‌సిటీ పరిధిలో అయిదేళ్లలో నిర్దేశించిన పనులన్నీ పూర్తికావాల్సి ఉంటుంది. మొత్తం 47 ప్రాజెక్టులను ఎంపిక చేసుకోగా రూ.934.35 కోట్లు కేటాయించారు. ఇందులో 25 ప్రాజెక్టులను రూ.647.66 కోట్లతో పూర్తి చేశారు. మిగతా 20 ప్రాజెక్టులను రూ.259.69 కోట్లతో చేపడుతున్నారు. రూ.27 కోట్లలో మిగతా రెండు ప్రాజెక్టుల్లో భాగంగా మున్సిపల్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌కు టెండర్ పిలవాల్సి ఉంది. బాలసదనం భవన నిర్మాణానికి రీ టెండర్ నిర్వహించాల్సి ఉంది. పనులు వేగంగా జరిగేలా పర్యవేక్షణ చేస్తామని ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు.

**తప్పని అవస్థలు** వరద కాలువ నిర్మాణ సమయంలో పనులు కొన్ని చోట్ల వదిలేశారు. శ్రీనగర్‌కాలనీ నుంచి గోదాంగడ్డ ఎస్‌బీహెచ్ ఫంక్షన్‌హాల్ వరకు వరదకాలువ నిర్మించాల్సి ఉండగా 400 మీటర్లు ఆపేశారు. పది మీటర్ల వెడల్పు, ఎనిమిది మీటర్ల లోతులో ఉండటంతో నిలిపి వేసిన చోట నుంచి వరదనీరు వెనక్కి మళ్లీ ఇళ్లలోకి వస్తోంది. కట్టరాంపూర్‌లో ట్యాంకు వెళ్లే దారిలో రెండేళ్ల క్రితం డ్రైనేజీ కోసం తవ్వి వదిలేశారు. బెడ్, సలాక అల్లీ వదిలేయడంతో నీరంతా ఒక ఇంటి దగ్గర నిలిచి ప్రమాదకరంగా తయారైంది.

గణేశ్‌నగర్ బైపాసు రోడ్డులో మాజీ ఎమ్మెల్సీ ఇంటికి ఎదురుగా వరద కాలువ ఆపేశారు. కొంతదూరం పనులు చేయకపోవడంతో పాత గోడ కూలుతోంది.కశ్మీర్‌గడ్డ సమీకృత మార్కెట్ పనులు మొదటి దశలో ఉన్నాయి. కందకం తవ్వి వదిలేశారు. పలుచోట్ల కూడళ్ల నిర్మాణం పూర్తిగా నిలిపి వేశారు.టవర్ సర్కిల్‌లో ఆధునికీకరణ పనులు కొనసా..గుతున్నాయి. ఇంతకంటే అధ్వానమైన పనులు ఎక్కడా జరగలేదని స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు. లైటింగ్స్ కోసం తవ్వుతున్నారు.. పూడ్చుతున్నారు.నడకదారి కోసం వేసిన టైల్స్, రెయిలింగ్ ఊడిపోతున్నా కనీసం పట్టింపు లేదు. వీటి నిర్వహణ ఎవరు చూడాలనే విషయాన్ని గుర్తించడం లేదు.స్మార్ట్ వీధి దీపాలు బిగించిన వాటిని వేయకపోవడంతో పలు చోట్ల అంధకారం ఉంటుంది. ఉస్మాన్‌పుర, అహ్మద్‌పుర, అశోక్‌నగర్ ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీలు ఆగిపోయాయి.

# రక్షణ మాటల్లో.. ప్రాణాలు గాలిలో

హైదరాబాద్ : పరిశ్రమల యాజమాన్యాలు, అధికారుల నిర్లక్ష్యం అమాయకుల ప్రాణాలను బలిగొంటోంది. అనుమతుల్లేని, ప్రమాణాలు పాటించని పరిశ్రమల్లో జరిగే ప్రమాదాల్లో వలస కార్మికులు మరణిస్తున్నారు. ప్రమాదాలు జరిగితే కొన్ని యాజమాన్యాలు అవి బయటకు పొక్కకుండా రాజీ కుదురుస్తున్నాయి.

ఉదంతాలు...2024 జూన్ 28న రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లోని సౌత్‌గ్లాస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో జరిగిన కంప్రెషర్ పేలుడు ఘటనలో ఐదుగురు కార్మికులు అక్కడికక్కడే మృతి చెందగా.. 13 మందికి తీవ్ర గాయాలయ్యాయి. 2022 జులైలో జీడిమెట్ల పారిశ్రామికవాడలోని వశిష్ట లైఫ్‌సైన్సెస్ కెమికల్ కంపెనీలో రియాక్టర్ పేలింది. ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. అందులో సురేశ్ మృతి చెందాడు. 2022 ఆగస్టులో జీడిమెట్ల పరిధిలోని ఫార్మా కంపెనీలో రసాయన ప్రక్రియ సక్రమంగా లేకపోవడంతో మంటలంటుకున్నాయి. ఏడుగురు గాయపడ్డారు.ఏడాది క్రితం జీడిమెట్లలోని పారిశ్రామికవాడలోని ఫార్మా కంపెనీలో రియాక్టర్ పేలిన ఘటనలో ఉద్యోగి మృతి చెందాడు.

నిఘా కొరవడటంతో... డైరెక్టరేట్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారులు తనిఖీలు చేయకపోవడం, పీసీబీ అధికారులు కేవలం సీఎఫ్ఈ, సీఎఫ్‌వో అనుమతుల వరకే పరిమితం కావడంతో అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారు.

మొత్తం పెట్టుబడిలో 2 శాతం 'పబ్లిక్ లయబులిటీ ఇన్సూరెన్స్' చేయించాలి. దీనికి సంబంధించిన వివరాలను కలెక్టరేట్‌కు సమర్పించాలి.

2కేఎల్, 3కేఎల్‌కు బదులుగా 500ఎంఎల్ సామర్థ్యం ఉన్న రియాక్టర్లను, తక్కువ ఖర్చులో వస్తాయని సెకండ్ హ్యాండ్, నాసిరకం రియాక్టర్లను వినియోగిస్తున్నారు. అవి పేలిపోతున్నాయి. అక్కడే ఉన్న కార్మికులకు తీవ్రగాయాలై మరణిస్తున్నారు.

రెడ్, ఆరెంజ్ కేటగిరీ పరిశ్రమల్లో ఈహెచ్ఎస్ (ఎన్విరాన్‌మెంట్ హెల్త్ సేఫ్టీ) డివిజన్ ఏర్పాటు చేయాలి. మాస్కులు, గాగుల్స్, గ్లౌజులు, బూట్లు, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్స్ సేఫ్టీ అనుమతులే తీసుకోరు. డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్‌కు వెళ్లి ప్లాన్ అప్రూవల్ తీసుకెళ్లి సేఫ్టీ అనుమతులు తీసుకోవాలి. నిబంధనల ప్రకారం పరిశ్రమల్లో 'హజార్డస్ వేస్ట్ ఆపరేషన్ అండ్ మెయింటనెన్స్, హ్యాండ్లింగ్, స్టోరేజ్' స్టడీ తప్పనిసరిగా నిర్వహించాలి. రసాయనాల నిల్వలో భద్రతా ప్రమాణాలుపాటిస్తున్నారో లేదో పరిశీలించాలి.

# కాబోయే అమ్మకు ఆపద

సంగారెడ్డి : కాబోయే అమ్మల్లో కొందరు పేదరికం కారణంగా సరైన పోషకాహారం తీసుకోకపోవడం, ఆరోగ్య సమస్యలు తదితర కారణాలతో అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో ఉంటున్నారు. వీరి విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించినా ప్రాణాలకే ముప్పు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం గర్భిణుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారిస్తోంది. అత్యంత ప్రమాదకరంగా ఉన్న వారిని గుర్తించి వైద్య, ఆరోగ్య, సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో జాగ్రత్తలు తీసుకుంటోంది.

**ఏం చేస్తున్నారంటే..**

గర్భిణులకు నెలనెలా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఆరోగ్యపరంగా ఇబ్బందుల్లో ఉన్నవారిని గుర్తిస్తున్నారు. వీరిలో అత్యంతం ప్రమాదకరంగా ఉన్న వారిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. వైద్య శాఖ ఆధ్వర్యంలో ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆరోగ్య జాగ్రత్తలు సూచిస్తున్నారు. ఎలాంటి ఆహారం తీసుకోవాలనే అంశంపై అవగాహన కల్పిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రంలోనూ గర్భిణులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గర్భస్థ శిశువు స్థితిగతులను తెలుసుకునే పరీక్షలు సమయానికి చేయించుకోవాలని తెలియజేస్తున్నారు. ఆరోగ్యపరంగా ఇబ్బంది ఉంటే వెంటనే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కాల్షియం, ఐరన్ మాత్రలు



పంపిణీ చేస్తున్నారు. అంగన్‌వాడీ ఉపాధ్యాయులు గర్భిణుల గృహ సందర్శనలు చేసి ఆరోగ్యం విషయంలో ఏదైనా ఇబ్బంది ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచిస్తున్నారు.

జిల్లాలో ఐసీడీఎస్ ప్రాజెక్టులు: 5

అంగన్‌వాడీ కేంద్రాలు: 1,504

నమోదైన గర్భిణులు(ఏప్రిల్ నుంచి ఆగస్టు 21వరకు): 12,158

వీరిలో హైరిస్క్ గర్భిణులు: 3,508

**ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం**

గర్భిణులకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. ప్రతినెలా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నాం. అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న వారిని గుర్తించి వారి ఆరోగ్యం మెరుగయ్యేలా ప్రాధాన్యం ఇస్తున్నాం. క్షేత్రస్థాయిలో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు సమన్వయంతో గర్భిణులకు మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇందుకు అనుగుణంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాట్లు చేశాం. డా.గాయత్రీదేవి, జిల్లా ఇన్‌ఛార్జి వైద్యాధికారిణి.

**గృహ సందర్శనలతో అప్రమత్తం చేస్తున్నాం**

పౌష్టికాహారం తీసుకుంటేనే గర్భిణులు ఆరోగ్యంగా ఉండేందుకు వీలుంటుంది. ఇదే విషయాన్ని అంగన్‌వాడీ ఉపాధ్యాయులు గృహ సందర్శన సమయంలో కుటుంబ సభ్యులకు తెలియజేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఒక పూట సంపూర్ణ భోజనంతో పాటు ఇంట్లోనూ పౌష్టికాహారం ఎలా తయారు చేసుకోవాలో వివరిస్తున్నారు. లలితకుమారి, జిల్లా సంక్షేమాధికారిణి.

# ఎన్నికలొస్తున్నాయ్

సిద్దిపేట: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీచేసేందుకు ఆసక్తి ఉన్నవారు యువతను ఆకట్టుకునేందుకు ఇప్పటినుంచే ప్రయత్నాలు షురూ చేశారు. గత ఫిబ్రవరి 1 నుంచి గ్రామ పంచాయతీల పాలకమండలి పదవీకాలం ముగిసిన విషయం తెలిసిందే. పల్లెల్లో ప్రత్యేక పాలన కొనసాగుతోంది. ఓటరు జాబితా పూర్తయితే పోలింగ్ తేదీలను విడుదల చేసే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఎన్నికలకు సంబంధించి ఇటీవల ఎంపీడీఓలు, ఎంపీఓలు, కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణ పూర్తయింది. ప్రత్యేక బుక్‌లెట్స్ అందుబాటులోకి తెచ్చారు. సెప్టెంబరు 6న ఓటర్ల ముసాయిదా జాబితా విడుదల చేయనున్నారు.

**రిజర్వేషన్లపై ఉత్కంఠ**

ఏ గ్రామంలో ఏ సామాజిక వర్గానికి రిజర్వేషన్ కేటాయిస్తారనే దానిపై ఇప్పటినుంచే అందరూ ఉత్కంఠగా చర్చించుకుంటున్నారు. గత ప్రభుత్వం స్థానిక సంస్థల రిజర్వేషన్లను ఐదేళ్ల నుంచి పదేళ్లకు పెంచిన నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తుందా? కొత్తగా నిర్ణయం తీసుకుంటారా.. అనేది తేలాల్సి ఉంది. స్థానాలను మహిళలకు కేటాయిస్తే పురుషులకు అవకాశం రానిచోట భార్య, ఇతర మహిళ కుటుంబ సభ్యులను ఎన్నికల బరిలోకి దించేందుకూ నాయకులు సిద్ధమవుతున్నారు. ఇటీవల కొత్తగా 15 పంచాయతీలను ఏర్పాటు చేస్తూ గెజిట్ విడుదల చేశారు. వాటికి ఎన్నికలు నిర్వహిస్తారా లేదా అనే విషయం అధికారులు నిర్ణయించాల్సి ఉంది.

**బల్దియాలో కలుపుతారా?**

మల్లన్న సాగర్ ప్రాజెక్టు నిర్మాణం సందర్భంగా తొగుట, కొండపాక మండలాల్లో ముంపునకు గురైన దాదాపు 8 గ్రామపంచాయతీలను ప్రస్తుతం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో నిర్మించారు. ఆ గ్రామాల పేరుతోనే పంచాయతీలుగా కొనసాగుతున్నాయి. వాటిని అలాగే కొనసాగిస్తారా లేక బల్దియాలో విలీనం చేస్తారా? అనేది తేల్చలేదు. గ్రామ పంచాయతీలుగానే కొనసాగించాలని కోరుతూ ముంపు గ్రామాల వారు ఆర్డీఓకు, ఎమ్మెల్సీ యాదవరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. గ్రామ పంచాయతీల ఎన్నికలు పార్టీల రహితమైనా వెనుక ఉండి నడిపించేదంతా వారే కనుక పల్లెల్లో పట్టు సాధించేందుకు తీవ్రస్థాయిలో పోటీ పడతారు. అందుకోసం అన్ని పార్టీల ప్రధాన నాయకులు రాజకీయ సందడికి తెరలేపుతారు.

సిద్ధం చేస్తున్నాం: దేవకీదేవి, డీపీఓ

పంచాయతీ ఎన్నికలకు జిల్లాలో ఏర్పాట్లు చేస్తున్నాం. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు జాబితా సిద్ధం చేస్తున్నాం. ముంపు గ్రామాల విలీన ప్రక్రియకు సంబంధించి ఇప్పటివరకు ఎలాంటి ఆదేశాలు రాలేదు.

మండలాలు 26

గ్రామ పంచాయతీలు 499

కొత్త పంచాయతీలు కలిస్తే మొత్తం 514

పాతవి వార్డులు 4,470

కొత్త వార్డులు కలిస్తే మొత్తం 4,566

2011 గణాంకాల ప్రకారం.. మొత్తం జనాభా 10,12,066

గ్రామీణ జనాభా 7,95,690

# ముగిసిన కాలం.. ఉబికిన జలం

పెద్దపల్లి : సెప్టెంబరు నెలాఖరుతో వానాకాలం ముగిసింది. ఈ ఏడాది జిల్లావ్యాప్తంగా వర్షపాతం ఆశాజనకంగా ఉంది. జూన్ నుంచి సెప్టెంబరు వరకు నాలుగు నెలల్లో ఒక్క ఆగస్టులో మాత్రమే లోటు ఏర్పడింది. మూడు నెలల్లో విస్తారంగా వర్షాలు కురవడంతో సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదైంది. ఈ వానాకాలంలో జిల్లాలో 14 శాతం అధికంగా వర్షం కురిసింది. దీంతో భూగర్భ జలాలు పైపైకి ఉబికి వస్తున్నాయి. గత నెలతో పోలిస్తే స్వల్పంగా నీటి మట్టం తగ్గినప్పటికీ యాసంగి సాగు అవసరాలకు భరోసా ఏర్పడింది.

2.60 లక్షల ఎకరాల్లో పంటలు

ఈ ఏడాది తొలకరి ముందుగానే పలకరించినా జులై రెండో వారం ఆరంభంలో భారీ వర్షాలు కురిశాయి. జలాశయాలు, చెరువులు,



కుంటల్లోకి నీరు సమృద్ధిగా చేరడంతో మానేరు, హుస్సేన్‌మియా వాగులు, గోదావరి ఉప్పొంగి ప్రవహించాయి. ఆగస్టులో మాత్రం వరుణుడు ముఖం చాటేయడంతో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైంది. నాలుగు నెలల్లో సాధారణం 886 మి.మీ. కాగా 1,013.9 మి.మీ నమోదైంది. ఈ వానాకాలంలో దాదాపు 2.60 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగయ్యాయి.

3.89 మీటర్ల లోతులో నీరు

గోదావరి, మానేరు, ఎస్సారెస్పీ ఆయకట్టు ప్రాంతమైన జిల్లాలో భూగర్భ జలాలు పైకి వచ్చాయి. జిల్లాలో ప్రతి నెలా 33 ఫిజోమీటర్ల ద్వారా నీటి లెక్కలు తీస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 3.89 మీటర్ల లోతులో నీటి మట్టం ఉబికివస్తోంది. అత్యల్పంగా అంతర్గాం మండలం మొఘల్‌పహాడ్‌లో 1.03 మీటర్ల లోతులో ఉండగా, అత్యధికంగా మంథని మండలం వెక్లాస్‌పూర్‌లో 18.70 మీటర్ల లోతులోకి వెళ్లింది. గత నాలుగు నెలల గణాంకాలు పరిశీలిస్తే భూగర్భ జల మట్టం రెట్టింపు స్థాయికి ఎగిసింది.

# స్కీంల పేరుతో మోసం!

సిరిసిల్ల: జిల్లాలో మధ్య తరగతి కుటుంబాలే లక్ష్యంగా దసరా, దీపావళి పండగల పేరున స్కీంలకు రూపకల్పన చేశారు. కష్టపడి కూడబెట్టుకున్న సొమ్మును కొట్టేసేందుకు కేటుగాళ్లు పన్నాగం పన్నుతున్నారు.వేములవాడ పోలీసు సబ్ డివిజన్‌లో దసరా ధమాక పేరుతో 'రూ.100 కొట్టు మేకను పట్టు' అంటూ జిల్లా ప్రజలకు బంపర్ ఆఫర్ స్కీంను రూపొందించామని ప్రచారం చేసుకున్నారు. మరొకరు రూ.100లతో ఒక కూపన్ కొంటే మద్యం, కోడి, మేకలను లక్కీ డ్రాలో గెలుచుకోవచ్చంటూ పథకాన్ని తీసుకొచ్చారు. వీటిని సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేశారు.

సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లోని వ్యాపార కేంద్రాల్లో విస్తృత ప్రచారం కల్పిస్తున్నారు. నెల రోజుల క్రితం వేములవాడ పట్టణంలో వాహన, గృహోపకరణాల కొనుగోలుకు నెల వారీ వాయిదాలతో భాగస్వాములు కావాలని బ్రోచర్ ద్వారా ప్రచారం చేశారు. చేరిన వారికి ఏడాదిలో లక్కీ డ్రా తీసి వారి పేరు తగిలితే నగదు, పలు రకాల వస్తువులు అందిస్తామని అందులో పేర్కొన్నారు.

ఇలాంటి ప్రచారాలు ఎక్కువ కావడంతో పోలీసులు దృష్టి సారించారు. వేములవాడ పోలీసు సబ్ డివిజన్‌లో కొడుముంజ, వేములవాడ



పట్టణాల్లో స్కీంలు, లక్కీ డ్రాల ప్రచారంతో మోసాలకు పాల్పడుతున్న పది మందిపై బుధవారం కేసులు నమోదు చేశారు.

జిల్లాలో మూడేళ్ల క్రితం ఒక సంస్థ ఒకేసారి రూ.30 వేలు చెల్లిస్తే ఆరు నెలల తర్వాత నుంచి రూ.10 వేల చొప్పున మొత్తం లక్ష రూపాయలు మీ సొంతం చేసుకోవచ్చని భారీగా డబ్బులు వసూలు చేసింది. గంభీరావుపేట, ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట మండలాల్లోని చాలా గ్రామాల్లో చాప కింద నీరులా వ్యాపించింది. డబ్బులు చెల్లించే సమయానికి రేపుమాపు అంటూ కాలం వెళ్లదీశారు. చివరికి తాము మోసపోయామని గ్రహించి పోలీసులను ఆశ్రయించారు. వారిపై కేసులు నమోదైనా కట్టిన డబ్బులు మాత్రం రాలేదు.

రూ.5 లక్షలకు రెండు పడక గదుల ఇల్లు నిర్మించి ఇస్తామని ఓ స్వచ్ఛంద సంస్థ గ్రామాల్లో ప్రచారం చేసింది. ముస్తాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేశారు. వీరి మాటలు నమ్మి చాలా మంది డబ్బులు కట్టారు. కొన్ని చోట్ల నిర్మాణాలు కూడా ప్రారంభించారు. దీంతో కొందరైతే పాత ఇళ్లను కూల్చివేసుకుని కొత్త ఇంటి నిర్మాణానికి సిద్ధమయ్యారు. కొన్ని నెలలకు సంస్థ నిర్వాహకులు, వారి కింద పని చేసేవారు గ్రామం విడిచి వెళ్లారు. రూ.లక్షల్లో డబ్బులు చెల్లించిన వారు లబోదిబోమంటూ మధ్యవర్తులను ఆశ్రయించారు. వారు కూడా చేతులెత్తేయడంతో పలువురు ఆత్మహత్యకు యత్నించారు. దీనిపై పోలీసులు విచారణ జరిపి సంస్థ నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు.

అప్రమత్తంగా ఉండాలి

లాటరీలు, స్కీంలు నడిపేవారు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. జిల్లాలో అలాంటివేమీ లేవు. ప్రజలను మోసం చేస్తూ ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రజలు కూడా ఇలాంటి వాటిపై అప్రమత్తంగా ఉండాలి.

అఖిల్ మహాజన్, ఎస్పీ

# ఇల్లు అద్దెకిస్తున్నారా.. జరభద్రం!




హైదరాబాద్: అద్దె ఎంతైనా పర్వాలేదు.. అడ్వాన్స్ ఎంతైనా ఇస్తాం.. మా సొంతిల్లులా భద్రంగా చూసుకుంటాం. కిరాయికి చేరే ముందు తీయటి మాటలు చెవికి తాకగానే చాలామంది ఇప్పుడే చేరిపోమంటూ బంపర్ ఆఫర్ ఇస్తారు. గేటుకు వేలాడే టులెట్ బోర్డును ఎప్పుడెప్పుడు తీసేయాలా! అనే తొందరలో.. వచ్చిన వారి గురించి పూర్తి వివరాలు తెలుసుకోకుండానే తాళాలు అప్పగిస్తున్నారు. అకస్మాత్తుగా పోలీసుల నుంచి ఫోన్ కాల్ వచ్చినప్పుడు తాము చేసిన పొరపాటు గుర్తిస్తున్నారు. ఠాణా చుట్టూ తిరగలేక తలపట్టుకుంటున్నారు. మరికొందరు ఒక అడుగు ముందుకేసి, యజమానులను బెదిరిస్తూ నెలల తరబడి సొమ్ములు చెల్లించకుండా తిరుగుతున్నారు.

బాబోయ్ ఇప్పుడేం చేద్దాం..'

: దిల్లీ, పుణె పోలీసుల కన్నుగప్పిన కరడుగట్టిన ఉగ్రవాది రిజ్వాన్ సైదాబాద్‌లోని అపార్ట్‌మెంట్‌లో ఆరు నెలలు మకాం వేశాడు. ఫ్లాట్ అద్దెకిచ్చే సమయంలో నిర్వాహకులు అతడి నుంచి ఆధారాలు తీసుకోలేదు. కిరాయి కేవలం రూ.5 వేలే కదా అని ఒప్పంద పత్రం రాయించుకోలేదు.

: టోలిచౌకిలో ఒక ఇంట్లో అద్దెకు దిగిన ఇద్దరు మహిళలు.. రెండు నెలల కిరాయి అడ్వాన్స్ చెల్లించి ఏడాదిపాటు ఇంటి యజమానికి నరకం చూపారు. ఖాళీ చేయమంటే తమ పట్ల అసభ్యంగా ప్రవర్తించారంటూ పోలీసులకు ఫిర్యాదు చేస్తామంటూ బెదిరించారు. మాదాపూర్‌లో ఒక విశ్రాంత ఉద్యోగి తన ఫ్లాట్‌ను అద్దెకిచ్చారు. కుటుంబంతో ఉన్నట్టు చెబుతూనే అతడు ఆ ఇంటిని వ్యభిచార గృహంగా మార్చాడు. పోలీసుల తనిఖీల్లో బండారం బయటపడటంతో ఇంటి యజమానికి పోలీసులు నోటీసులు జారీ చేశారు.

రూటు మార్చిన కేటుగాళ్లు..

నగరంలో కొందరు యజమానులు జాగ్రత్తలు పాటిస్తే.. మరికొందరు వచ్చే కిరాయి సొమ్ములు లెక్కలేసుకుంటున్నారు. దీన్ని అవకాశం చేసుకున్న కేటుగాళ్లు.. దర్జాగా ఇళ్లలోకి చేరి చీకటి కార్యకలాపాలు సాగిస్తున్నట్టు పోలీసుల దాడుల్లో బయటపడుతున్నాయి. సికింద్రాబాద్‌లో విశ్రాంత ఉద్యోగి ఇంట్లోకి బార్యభర్తలమంటూ జంట అద్దెకు చేరారు. తామిద్దరం పోలీసు శాఖలో పనిచేస్తున్నట్టు నమ్మించారు. కొద్దిరోజుల తరువాత రాత్రివేళల్లో కొత్త వ్యక్తుల రాకపోకలు పెరగటంతో యజమాని నిలదీశాడు. పోలీసుల తనిఖీ సమయంలో అసలు విషయం బయటపడింది. వారి వద్ద స్వాధీనం చేసుకున్న మొబైల్ ఫోన్లలో వేలాది మంది యువతుల ఫొటోలు బయటపడ్డాయి. గచ్చిబౌలిలోని ఖరీదైన అపార్ట్‌మెంట్‌కి ఐటీ ఉద్యోగినంటూ చేరాడు. ఉప్పల్‌లో సొంతిల్లున్నా.. కార్యాలయానికి దగ్గర అనే ఉద్దేశంతో ఫ్లాట్ తీసుకున్నట్టు నమ్మించాడు. వారాంతపు సమయంలో మిత్రులను రప్పించి డ్రగ్స్ తీసుకుంటూ రేవ్ పార్టీలు ఏర్పాటు చేస్తున్నట్టు గుర్తించి ఖాళీ చేయించినట్లు సమాచారం.

# జలమండలిలో 'కేటగిరి' కహానీ



హైదరాబాద్: గ్రేటర్‌లోని జలమండలి పరిధిలో నల్లా కనెక్షన్లల్లో కేటగిరి పేరుతో అక్రమాల దందా నడుస్తోంది. క్షేత్రస్థాయిలో సరైన పర్యవేక్షణ లేకపోవడం.. అధికారులు, సిబ్బంది కుమ్మక్కై బోర్డు ఆదాయానికి టోకరా వేస్తున్నారు. ఏయేటికాయేడు నల్లాల సంఖ్య పెరుగుతున్నప్పటికీ వాణిజ్య కేటగిరిలో వినియోగదారుల సంఖ్య అంతంతమాత్రంగా ఉంది. గ్రేటర్‌లో 13 లక్షలపైనే నల్లాలుండగా ఇందులో వాణిజ్య కేటగిరిలో కేవలం 40 వేల వరకు చూపిస్తుండటం అనుమానాలకు తావిస్తోంది. దీంతో వాణిజ్య భవనాలు, సముదాయాలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలను ఎంచుకొని సర్వేకు జలమండలి సిద్ధమవుతోంది. తద్వారా వాణిజ్య నల్లాల కచ్చితమైన సంఖ్య తెలుస్తుంది. జలమండలికి ఏటా కొత్త నల్లాల జారీ, నీటి బిల్లులు ఇతరత్రా ఏటా రూ.1000-1300 కోట్ల ఆదాయం సమకూరుతోంది. ఇందులో సింహభాగం నీటి బిల్లుల నుంచే వసూలవుతోంది. ఈ ఆదాయంలో 70 శాతం వాణిజ్య నల్లాలదే. మొత్తం నల్లాల్లో ఇవి 3 శాతమే. దీంతో వాణిజ్య నల్లాల శాతాన్ని పెంచేందుకు జలమండలి దృష్టి సారించింది. ప్రస్తుతం గృహ నల్లాలకు ఒక్కో కుటుంబానికి నెలకు 20 వేల లీటర్ల నీటిని ఉచితంగా ఇస్తున్నారు. ఆపైన వాడుకుంటే దానికి బిల్లు చెల్లించాలి. ఇలా ఏటా రూ.350 కోట్లు వరకు ఆదాయం కోల్పోతోంది. క్రాస్ సబ్సిడీ ద్వారా ఆ ఆదాయాన్ని వాణిజ్య నల్లాల నుంచి భర్తీ చేసుకునేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తోంది.

కేటగిరి మార్చేసి...

గృహ, వాణిజ్య కేటగిరి బిల్లింగ్‌లో చాలా వ్యత్యాసం ఉంది. గృహ నల్లాకు 1000 లీటర్లు రూ.10కి ఇస్తున్నారు. అదే వాణిజ్య నల్లాకు 1000 లీటర్లకు రూ.40 నుంచి మొదలై నీటి వాడకాన్నిబట్టి బిల్లింగ్ పెరుగుతుంది.

కొందరు ఈ బిల్లులను తప్పించుకోవడానికి సిబ్బందితో కుమ్మక్కై కేటగిరిలో మార్పులు చేస్తున్నారు. వాణిజ్య నల్లాలకు గృహ కేటగిరిలో బిల్లులు వచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

జలమండలి నిబంధనల ప్రకారం.. ఇంటి కిందిభాగంలో షాపు, హోటల్ లేదా ఇతర వాణిజ్య కార్యకలాపాల కోసం నిర్వహిస్తూ.. ఇంటి పైభాగంలో నివసిస్తుంటే అది వాణిజ్య కేటగిరి కిందే చూపాలి. అయితే చాలాచోట్ల ఇలాంటి వాటిని గృహ కేటగిరితో సరిపెడుతున్నారు. దీంతో జలమండలి పెద్దఎత్తున ఆదాయం కోల్పోతోంది.

చాలా వాణిజ్య నల్లాలకు అమర్చిన ఆటోమేటిక్ మీటర్లు ఎప్పుడో పాడయ్యాయి. దీంతో నెలానెలా సక్రమంగా బిల్లులు రావడం లేదు. భారీగా నీటిని వాడుతున్నప్పటికీ సాధారణ బిల్లులతో ఆదాయానికి గండి పడుతోంది. తాజా అధ్యయనంలో ఈ అంశాలన్నిటిపైనా జలమండలి దృష్టి సారించనుంది. ప్రతి వాణిజ్య, వ్యాపార సముదాయాన్ని సందర్శించి అక్కడ నల్లా కనెక్షన్ ఉందా.. ఏ సైజులో ఉంది.. నెలవారీ బిల్లులు పరిశీలించి ఆదాయం పెంపు దిశగా దృష్టి సారించనుంది.

# బియ్యం కుతకుత.. నూనె సలసల



పరిగి : నూనె ధర చేజారుతోంది.. బియ్యం ఉడకనంటోంది.. పప్పు బద్దకిస్తోంది. కొన్నాళ్లుగా పెరుగుతున్న నిత్యావసర ధరలతో పేద, మధ్య తరగతి కుటుంబాలు బేజారవుతున్నాయి. ప్రతి నెలా నిర్వహణ ఖర్చులు భారంగా మారుతున్నాయి. ఇంటి సారథి.. కుటుంబాన్ని వెళ్లదీసేందుకు ఆపసోపాలు పడాల్సి వస్తోంది. కొన్నాళ్లుగా పెరుగుతున్న ధరలతో షాక్‌కు గురవుతున్నారు. పెద్ద పండగలైన దసరా, దీపావళి వచ్చేశాయి. పండగల వేళ జనమంతా ఇబ్బందులకు గురవుతున్నారు.

దడ పుట్టిస్తోంది..

పెరుగుతున్న బియ్యం ధరలు దడ పుట్టిస్తున్నాయి. క్వింటాకు రూ.500 నుంచి రూ.వేయి వరకు పెరిగింది. నెల వ్యవధిలో పెరుగుదల ప్రభావం చూపింది. ఐదుగురు ఉండే ఇంట్లో నెలకు కనీసం 40 నుంచి 50 కిలోల బియ్యం వాడుతారు. పాత సన్నబియ్యం ధరలు భారీగా పెరగడంతో దొడ్డురకం వైపు మళ్లుతున్నారు.

20 శాతం పెరిగి..

వంటనూనె ధరలకు రెక్కలొచ్చాయి. 15 రోజుల్లోనే 20 శాతానికి పైగా పెరిగింది. ఈ మార్పు స్పష్టమైంది. సన్ ఫ్లవర్, రైస్ బ్రాన్, పల్లీ నూనె కొనలేని పరిస్థితి. ప్రతి నెలా సగటున 5 కిలోలు వినియోగించగా.. ఇప్పుడు 3 కిలోలకు తగ్గించేందుకు చూస్తున్నామని గజ్వేల్‌కు చెందిన మారుతి చెప్పుకొచ్చారు. పండుగ సీజన్‌లో పిండి వంటలకు నూనె వినియోగం తప్పనిసరి కావడంతో ఏం చేయాలన్న మీమాంసలో పడిపోతున్నారు.

కొనలేక..ఎండు కొబ్బరి వంటకాల్లో రుచిని పెంచుతుంది. చిక్కదనాన్ని, పోషకాలను అందిస్తుంది. పది రోజుల్లో ధర అమాంతం పెరిగింది. ఆరు నెలల్లో పప్పుల ధరలు పెరిగాయి. మరోవైపు కిలో నువ్వులు రూ.180కు చేరింది. చక్కెర రూ.41, గోధుమపిండి రూ.40, రవ్వ-రూ.42 పలుకుతోంది. గతంతో పోలిస్తే రూ.5 పెరిగినట్లు స్పష్టమవుతోంది. కూరగాయల ధరలూ భగ్గుమంటున్నాయి.

ధరలతో భయమేస్తోంది: గూడెపు మంజుల, కూలి, పాలేపల్లి, దోమ

గతంలో ఊళ్లలో పండించే కూరగాయలు, పప్పులూ, ఉప్పులూ అందరికీ అందుబాటు ధరలకు దొరికేవి. అలాంటిది పరిస్థితులు పూర్తిగా తారుమారయ్యాయి. రెండు రోజుల కష్టంతో చేతికి వచ్చిన డబ్బులు తీసుకుని అంగడి వెళ్తే కనీసం కూరగాయలు రావడం లేదు.

కట్టడి చేయాలి..: స్వాతి, గృహణి, దౌల్తాబాద్

మార్కెట్‌కు వెళ్తే నూనెలు, పప్పుల ధరలు చూసి బెంబేలెత్తిపోతున్నాం. కూరగాయలను సైతం కొనలేకపోతున్నాం. చేతిలో ఉన్న డబ్బుతోనే ధరలు కాస్త తక్కువగా ఉన్నవాటిని తీసుకుని సరిపెట్టుకోవాల్సి వస్తోంది. ప్రభుత్వం ధరలను కట్టడి చేయాలి.

# వరి కోతలు షురూ!

ఎల్లారెడ్డిపేట : వానాకాలం సీజన్‌లో ఆటుపోట్లను తట్టుకుంటూ వ్యవసాయం చేసిన అన్నదాతలు వరి కోతలకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే కొన్నిచోట్ల ప్రారంభించారు. పంట ఏపుగా పెరగడం, ఆరోగ్యంగా ఉండటంతో దిగుబడిపై భారీ ఆశలు పెట్టుకున్నారు. సాగునీరు అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో వరి పంటను రైతులు సీజన్ ప్రారంభంలోనే సాగు చేశారు. వరి పంట చేతికందుతుండగా వర్షాలు విరామమివ్వడంతో కోతలను ఆరంభించారు. జిల్లాలోని ఎల్లారెడ్డిపేట మండలం పదిర, హరిదాస్‌నగర్, వెంకటాపూర్, ముస్తాబాద్ మండలం ఆవునూరు, గూడెం తదితర గ్రామాలతోపాటు గంభీరావుపేట, ముస్తాబాద్, తంగళ్లపల్లి, చందుర్తి, రుద్రంగి తదితర మండలాల్లో వరికోతలు ఇప్పుడిప్పుడే ప్రారంభమయ్యాయి. జిల్లాలో సుమారు 4.43 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు.

కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ సంబంధిత శాఖల అధికారులతో ఇటీవల సమీక్షాసమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు.

జిల్లాలోని 13 మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అధికార యంత్రాంగం సన్నద్ధమవుతుంది.

258 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

వరి పంట కాలం పూర్తవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ధాన్యం సేకరణకు జిల్లాలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో 202, ఐకేపీ పరిధిలో 44, మిగతా శాఖల కింద 12 కలుపుకొని మొత్తం 258 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు.జిల్లా మొత్తంగా ధాన్యం దిగుబడిలో 3 లక్షల మెట్రిక్ టన్నుల వరకు కొనుగోలు కేంద్రాలకు రానుందని అంచనా వేశారు. అవసరమైతే కొనుగోలు కేంద్రాల సంఖ్యను పెంచాలని భావిస్తున్నారు. కేంద్రాల ఏర్పాటుతోపాటు వాటిలో కనీస సౌకర్యాల కల్పనపై కూడా ప్రత్యేక దృష్టి సారించారు. 7,777 టార్పాలిన్లు, 766 తూకం వేసే యంత్రాలు, 634 ప్యాడీ క్లీనర్లు, 603 తేమశాతం చూసే యంత్రాలు ప్రస్తుతానికి అందుబాటులో ఉన్నాయి.

తాలు, తప్ప లేకుండా ధాన్యాన్ని శుద్ధి చేసి, తేమశాతం 17 ఉండేలా



చూసుకొని కేంద్రాలకు తరలించాలని రైతులకు సూచిస్తున్నారు.

13,552 ఎకరాల్లో సన్నరకం సాగు

జిల్లాలో రైతుబంధు లెక్కల ప్రకారం 1,34,725 మంది రైతులున్నారు. వానాకాలం సీజన్‌లో ప్రధాన పంటగా వరిని 1,79,672 ఎకరాల్లో సాగు చేశారు. అందులో 13,552 ఎకరాల్లో సన్నరకం, 1,66,123 ఎకరాల్లో దొడ్డు రకాలున్నాయి.

సన్నరకం వరికి రూ. 500 బోనస్‌ను ప్రభుత్వం ప్రకటించడంతో రైతులకు కొంతమేర ఊరట లభించనుంది.

సన్న రకాలు ఎకరానికి 18 నుంచి 22 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని భావిస్తుండగా, జిల్లాలో మొత్తం దాదాపు 28,457 క్వింటాళు వస్తుందని అంచనా వేశారు.దొడ్డు రకం ఎకరానికి 25 క్వింటాళ్ల చొప్పున లెక్కిస్తే సుమారు 4,15,307 మెట్రిక్ టన్నులు దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.జిల్లాలోని పలు మండలాల్లో వరి పంట కోత దశకు చేరుకోగా, కొన్ని మండలాల్లో ఈనే దశలో ఉంది. మరికొద్ది రోజుల్లో వరి కోతలు ముమ్మరం కానున్నాయి. ప్రస్తుతం కోతలను ప్రారంభించిన కర్షకులు కొంత మంది అకాల వర్షాల భయంతో ధాన్యాన్ని నేరుగా రైస్‌మిల్లులకు తరలిస్తుండగా మరికొందరు కొనుగోలు కేంద్రాలకు చేరవేస్తున్నారు.

# తూతూమంత్రం.. ప్రమాదాలకు మార్గం

హైదరాబాద్: గ్రేటర్‌లో ఆటోమేటిక్ వాహన ఫిట్‌నెస్ కేంద్రాలు ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. గతంలో చౌటుప్పల్ ప్రాంతంలో ఆటోమేటిక్ ఫిట్‌నెస్ కేంద్రం పనులు ప్రారంభమైనప్పటికీ వివిధ కారణాలతో ఆ పనులు మధ్యలోనే ఆగిపోయాయి. ప్రస్తుతం తూతూమంత్రంగా చేస్తున్న ఫిట్‌నెస్‌తో స్కూల్ బస్సులు, ఆటోలు, స్కూల్ వ్యాన్లు, మినీ బస్సులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నాయి. గ్రేటర్‌లో 3 కమిషరేట్ల పరిధిలో ఏటా 5-6 వేల ప్రమాదాలు



జరుగుతున్నాయి. నిబంధనల ప్రకారం ప్రజారవాణాకు సంబంధించి ప్రతి వాహనానికి ఏటా ఆర్టీవో నుంచి ఫిట్‌నెస్ ధ్రువపత్రం తీసుకోవాలి. కొన్నిసార్లు అధికారులకు కొంత ముట్టజెప్పి ఫిట్‌నెస్ లేని వాహనాలకూ ధ్రువపత్రాలు తీసుకుంటున్నారు కొందరు. ఆటోమేటిక్ ఫిట్‌నెస్ కేంద్రాలకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినప్పటికీ ఇక్కడ అందుబాటులోకి తేవడంలో జాప్యం జరుగుతోంది. ఆటోమేటిక్‌తో ఇలా..ఆటోమొబైల్ రీసెర్చ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(ఏఆర్ఏఐ) నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా వాహనానికి సంబంధించి 40 అంశాలను ఈ కేంద్రాల్లో పరిశీలించి వాహన సామర్థ్యాన్ని అంచనా వేస్తాయి.టైర్లు, బ్రేకులు, స్టీరింగ్, ఇంజిను సామర్థ్యం, వాహన బాడీ ఇలా ప్రతి అంశాన్ని తనిఖీ చేసి సదరు వాహనం రోడ్లపై తిరిగేందుకు అర్హమైనదా.. కాదా.. గుర్తించి స్కోరు అందిస్తుంది. ఆ స్కోరునుబట్టి ఫిట్‌నెస్ ధ్రువీకరణ జారీ చేస్తారు. ఇందులో మానవ ప్రమేయం లేకపోవడం వల్ల అసలైన వాహన సామర్థ్యం ఏంటో తెలుస్తుంది. ప్రస్తుతం సరైన ఫిట్‌నెస్ లేకుండానే వాహనాలు బయట తిరుగుతున్నాయి. ఈ కేంద్రాలతో ఆ పరిస్థితి ఉండదు.

# ఎక్కడి పనులు అక్కడే..!

ఖమ్మం: ఖమ్మం జిల్లాలోని జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల శాశ్వత భవన నిర్మాణ పనుల్లో కదలిక కనిపించటం లేదు. అరకొర సౌకర్యాల మధ్యే ఇంజినీరింగ్ విద్యనభ్యసించాల్సి వస్తోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ.300 కోట్ల అంచనాతో కళాశాల భవనం నిర్మించాల్సి ఉండగా.. ఇప్పటికే తొలి విడతగా రూ.100 కోట్ల పనులపై అధికారులు సర్కారుకు ప్రతిపాదనలు పంపించారు. ప్రభుత్వం పచ్చజెండా ఊపకపోవటంతో పనులు ప్రారంభమవలేదు. పరిస్థితి ఇలాగే కొనసాగితే వచ్చే ఏడాదైనా శాశ్వత భవనంలోనే తరగతులు నిర్వహించాలన్న సర్కారు లక్ష్యం నెరవేరేలా కనిపించటం లేదు. ప్రభుత్వానికి రూ.100 కోట్లతో ప్రతిపాదనలు

కళాశాల శాశ్వత భవన నిర్మాణానికి మద్దులపల్లి రెవెన్యూ పరిధిలో 30 ఎకరాల భూమిని అధికారులు కేటాయించారు. భవన నిర్మాణానికి జేఎన్‌టీయూ అధికారులు కాంటూరు సర్వే చేపట్టారు. తొలి విడతగా తరగతులు, అకడమిక్ భవనం, పరిపాలన భవనం, వసతిగృహాలు, ప్రయోగశాలల నిర్మాణానికి రూ.100 కోట్లతో సర్కారుకు ప్రతిపాదనలు పంపించారు. ప్రభుత్వ అనుమతి రాగానే మొదటి విడత పనులు మొదలవుతాయి. తదనంతరం కళాశాల అవసరాలకు అనుగుణంగా




మరికొన్ని భవనాల నిర్మాణానికి రూ.200 కోట్లు కావాలని అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు.

మంత్రి పొంగులేటి చొరవ చూపాలని..

కళాశాల శాశ్వత భవన నిర్మాణానికి కేటాయించిన స్థలం గ్రానైట్ వ్యర్థాలు, బండరాళ్లతో నిండిపోయింది. ఇప్పటివరకు చదును చేసే పనులు మొదలుకాలేదు. ఈ పనులకే నెలల తరబడి సమయం పట్టే అవకాశముంది. ప్రభుత్వం అనుమతులు జారీ చేస్తే టెండర్ ప్రక్రియకు ముందడుగు పడనుంది. శాశ్వత భవనం వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి అందుబాటులోకి రావాలంటే స్థానిక ఎమ్మెల్యే, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చొరవ చూపాలని విద్యార్థులు కోరుతున్నారు.

కొత్త భవనం నిర్మాణం పూర్తయ్యే వరకు అద్దె భవనంలోనే జేఎన్‌టీయూ కళాశాల తరగతులు నిర్వహిస్తాం. వైటీసీలో కొనసాగుతున్న కళాశాలను జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ కె.వెంకటేశ్వర్లు ఇటీవల పరిశీలించారు. శాశ్వత భవన నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని సందర్శించారు. త్వరలోనే ప్రభుత్వం నుంచి నిధులు విడుదలవుతాయని ఆశిస్తున్నాం.

– రమేశ్, ప్రిన్సిపల్, జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల

అరకొర వసతులతో అవస్థలు

గత ప్రభుత్వ హయాంలో కౌన్సెలింగ్ సమయంలో జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల మంజూరైంది. ఖమ్మం గ్రామీణ మండలం మద్దులపల్లిలోని యువజన శిక్షణ కేంద్రం (వైటీసీ) భవనంలో తాత్కాలికంగా కళాశాలను నిర్వహిస్తున్నారు. ఇంజినీరింగ్ రెండో సంవత్సరంలో 79 (సీఎస్‌ఈ–61, డేటా సైన్స్–18) మంది అభ్యసిస్తున్నారు. ఈఏడాది ప్రథమ సంవత్సరంలో 144 (డేటా సైన్స్–35, సీఎస్‌ఈ–63, ఈసీఈ–27, ఈఈఈ–14, మెకానికల్–05) మంది ప్రవేశాలు పొందారు. మొత్తమ్మీద 223 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇక్కడే తరగతులతో పాటు ప్రయోగశాలను నిర్వహిస్తున్నారు. బాలురకు వసతి సౌకర్యం కల్పిస్తున్నారు. బాలికల వసతి కోసం ప్రైవేటు భవన సముదాయాన్ని అద్దెకు తీసుకున్నారు.

# కళ్ల ముందే దర్జాగా కబ్జా!

ఆసిఫాబాద్: సర్కారీ భూములను కళ్ల ముందే కొల్లగొడుతున్నా.. ఏ అధికారికీ కనిపించదు. నిబంధనలకు విరుద్ధంగా ఏజెన్సీ భూముల్లో వెంచర్లు వెలుస్తున్నా.. వారికి పట్టదు. కాలువలను పూడ్చి ఏకంగా నిర్మాణాలు చేపడుతున్నా.. నిలువరించే ప్రయత్నాలు కానరాదు. ఈ తతంగమంతా జిల్లా ఆవిర్భావం నుంచి కొనసాగుతూనే ఉంది. బాండ్ పేపర్ల మీద రాసుకుంటూ ఈ భూములను క్రయ విక్రయా లు జరుపుతున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా భవనాలు నిర్మిస్తున్నా పుర అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. అక్రమ కట్టడాల గురించి తనిఖీల ఊసే లేకపోవడంతో ప్రజలు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఆసిఫాబాద్ పట్టణం 2024న ఫిబ్రవరి 1న పురపాలికగా మారింది. ఇటీవలే కొలతలు పూర్తికాగా 20 వార్డులతో ఆసిఫాబాద్ పురపాలిక, షెడ్యూల్ ప్రాంతాన్ని రాజంపేట పంచాయతీగా ఏర్పాటు చేశారు. పుర, పంచాయతీ విస్తరించి ఉన్న ప్రాంతాల్లో డీటీసీపీ (డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్) అనుమతులు లేకుండానే వెంచర్లు వేస్తూ ప్లాట్లు విక్రయిస్తున్నారు. ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదని బీడీపీపీ (బిలా దాఖల పోరంబోకు) భూములను సైతం బాండ్ పేపర్ల మీద రాసిస్తూ పలువురికి అంటగడుతున్నారు. పదుల సంఖ్యలో భవనాలు బీడీపీపీ భూముల్లో పూర్తవుతుండగా, కాగజ్‌నగర్, ఆసిఫాబాద్‌లలో పట్టణ ప్రణాళిక అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. కాలువ పూడ్చి చదును చేశారిలా.. ఆసిఫాబాద్‌లోని అటవీ చెక్‌పోస్టు ఎదురుగా 215 ఎకరాల బీడీపీపీ ఉంది. సర్వే నంబర్ 39/ఏ, 39/బీ నాలుగు ఎకరాలు రహదారిని ఆనుకుని ఉంటాయి. ఈ భూముల మధ్య నుంచి పెద్దవాగుకు వెళ్లే ఓ కాలువ ఉంది. దీనికి సుమారు 100 అడుగుల మేర అడ్డంగా, మొరంతో పూడ్చి ఆ స్థలాన్ని మొత్తం చదును చేశారు. కాలువ ఒడ్డున ఉన్న ప్రభుత్వ స్థలం చుట్టూ సైతం ప్రహరీ నిర్మించారు. ఈ స్థలం విలువ సుమారు రూ.4 కోట్ల వరకు ఉంటుందని అంచనా.

ఇవిగో అక్రమాలు..ఆసిఫాబాద్ మండలంలోని గుండి వెళ్లే మార్గంలో ఏజెన్సీ భూముల్లో ఓ వ్యక్తి వెంచర్ వేశాడు. ఇప్పటికే ప్లాట్ల వరకు అమ్ముడు కాగా, ఎలాంటి అనుమతులు లేకుండానే పదుల సంఖ్యలో భవన నిర్మాణాలు ఈ ప్రాంతంలో వెలుస్తున్నాయి. జన్కాపూర్ శివారులో పెట్రోల్‌బంక్ వెనుక ఓ నేత వెంచర్ వేశాడు. డీటీసీపీ అనుమతులు లేకుండానే ప్లాట్లు విక్రయించాడు. భూములు కొనుగోలు చేసిన వ్యక్తులు రిజిస్ట్రేషన్ చేయాలని అనడంతో.. సబ్ రిజిస్ట్రార్ వద్దకు రెండు రోజుల కిందట వచ్చాడు. అనుమతులు లేవని రిజిస్ట్రేషన్ చేయనని రిజిస్ట్రార్ చెప్పడంతో.. సదరు నేత రాష్ట్ర స్థాయిలో పైరవీలు తెస్తున్నట్లుగా సమాచారం. ఆసిఫాబాద్‌లోని పాత ఆర్టీఓ కార్యాలయాన్ని ఆనుకుని ఉన్న భూమి సైతం అనధికారికంగా ప్లాట్లు చేసి అమ్ముతున్నారు. బెలూన్ థియేటర్‌ను ఆనుకుని పది ఎకరాల వరకు ఆబాదీ భూమి ఉంది. అది నేడు పూర్తిగా కబ్జాలమయం కాగా, మిగిలిన కొద్దిపాటి స్థలాన్ని రక్షించడంలో రెవెన్యూ అధికారులు విఫలమవుతున్నారు. అటువైపు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది. కాగజ్‌నగర్ పట్టణంలో పై భాగం నుంచి 30 ఫీట్ల వెడల్పుతో ప్రవహించే ప్రధాన కాలువ.. ఎన్టీఆర్ చౌక్, నవ్‌గాం బస్తీ, ద్వారకా నగర్, రైల్వేగేటు నుంచి పెద్దవాగులో కలుస్తుంది. ఈ కాలువలోకే అన్ని చిన్నపాటి కాలువలను అనుసంధానించారు. పలు ప్రాంతాల్లో ప్రధాన కాలువ కబ్జాకావడంతో ఏటా వానకాలంలో ఇళ్లలోకి నీళ్లు చేరుతున్నాయి. కాగా కబ్జాలు పట్టించుకోక రూ.లక్షలు ఖర్చు చేసి ప్రధాన కాలువలో పూడికను తొలగిస్తుండటం గమనార్హం.

# మూసీ మూసి



హైదరాబాద్: మూసీ పరీవాహక ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలు, క్రికెట్ గ్రౌండ్ల ఏర్పాటుతో కొంతమంది పెద్దలు రూ.కోట్లలో వ్యాపారం చేస్తున్నారు. ఈ నిర్మాణాలకు ఏ సంస్థ నుంచి అనుమతులు లేకపోయినా బల్దియా అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. మంచిరేవుల నుంచి నాగోలు వరకు 55 కిలో మీటర్ల పొడవున మూసీ నదిని సుందరీకరణ చేపట్టాలని సర్కార్ నిర్ణయించింది. ఇందుకు గత కొద్ది రోజులుగా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పూర్తిస్థాయిలో సర్వే చేసి దాదాపు పదిహేను వేల నిర్మాణాలున్నాయని తేల్చారు. ఇందులో దాదాపు 5 వేలకుపైగా నిర్మాణాలకు ఎటువంటి అనుమతులు లేవు. మరికొన్నింటికి తప్పుడు అనుమతి పత్రాలను సృష్టించినట్లు తెలిసింది. దాదాపు మూడు వేల వరకు నిర్మాణాలకు బల్దియా అనుమతి ఇచ్చినట్లు సమాచారం. అనధికార నిర్మాణాలు పరిశీలించగా.. చాలా వరకు మూసీని ఆక్రమించి ఇళ్లను నిర్మించిన అద్దెలు ఇచ్చినట్లు తెలిసింది. సంబంధిత భవనాల్లో ఎటువంటి సౌకర్యాలు లేకపోయినా అద్దెలు భారీగా వసూలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారని అక్కడి వారు చెబుతున్నారు. మూసీ గర్భంలోనూ 1600లకుపైగా నిర్మాణాల్లోనూ ఎక్కువగా అద్దెలకు ఇచ్చినట్లు గుర్తించారు. వీరు తమకు రెండు పడక గదుల ఇళ్లను ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

క్రికెట్ గ్రౌండ్ల నిర్మాణంతో వ్యాపారం

మూసీ నదీ పరీవాహకంలో పెద్దత్తున చిన్నపాటి క్రికెట్ గ్రౌండ్లను నిర్మించి రూ.లక్షల్లోనే వసూళ్లు చేస్తున్నారు. చైతన్యపురి దగ్గర ఒక ప్రధాన పార్టీ అనుచరుడు మూసీ నదికి ఆనుకునే ఏకంగా రెండు క్రికెట్ గ్రౌండ్లను నిర్మించారు. వ్యాపారాలకు అనువుగా మూసీ పరివాహక ప్రదేశాన్ని మార్చి అక్రమంగా వినియోగిస్తున్నారు. ఎలాంటి అనుమతుల్లేకుండా నడుస్తున్న సదరు క్రికెట్ గ్రౌండ్ నదీ గర్భంలో ఉందంటూ రెవెన్యూ అధికారులు ఎరుపురంగు మార్కు వేసి వెళ్లారు. సదరు ఆట స్థలాన్ని దాటిన తరువాత మరింత స్థలాన్ని చదును చేసేందుకు కొందరు మట్టికుప్పలు పోస్తుండటం గమనార్హం. ఇలా మూసీ పరివాహక ప్రాంతాల్లో అక్రమంగా ఇలా రూ.కోట్లలోనే వ్యాపారం జరుగుతోంది.

రూ.లక్షల్లో వసూలు

అత్తాపూర్ నుంచి మొదలు పెడితే కిషన్‌బాగ్, చాదర్‌ఘాట్, శంకర్‌నగర్, చైతన్యపురి, నాగోలు ఇలా అనేక ప్రాంతాల్లో మూసీలోనే దాదాపు మూడువేలకు పైగా భారీ షెడ్లను నిర్మించారు. కొన్ని పెద్ద షెడ్లకు రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు నెలవారీ వసూళ్లు చేస్తున్నారని క్షేత్రస్థాయిలో పరిశీలన చేసిన అధికారులు చెబుతున్నారు. అత్తాపూర్ నుంచి బాపూఘాట్ వెళ్లే దారిలో రెండు మూడు మెకానిక్ షెడ్లను మూసీని పూడ్చి నిర్మించారు.

# నత్తనడకన జీఐఎస్ సర్వే



హైదరాబాద్: పూర్తయితే బహుళ ప్రయోజనాలు.. జీఐఎస్ సర్వే రెండు దశల్లో జరగనుంది. మొదటిదశలో డ్రోన్లు నగరం మొత్తాన్ని 2డీ రూపంలో చిత్రీకరిస్తాయి. రెండో దశలో ఇంటింటి సర్వే, క్షేత్రస్థాయిలో మౌలిక సౌకర్యాల మ్యాపింగ్ ఉంటుంది. డిజిటల్ ఇంటి నంబర్లు, ప్రతి ఇల్లు, వీధి, పార్కులు, విద్యుత్తు స్తంబాలు, చెరువులు, ప్రభుత్వ భవనాలు, ఖాళీ స్థలాలు, క్రీడా మైదానాలు, ఇతరత్రా వసతుల స్పష్టమైన చిత్రాలతో నగరానికి విస్తృతస్థాయి 3డీ పటం రూపుదిద్దుకుంటుంది. స్విగ్గి, జొమాటో, ఇతర ఈ–కామర్స్ సంస్థలు నగర పటాన్ని ఉపయోగించుకుంటాయని, జీఐఎస్ సర్వే పటాలు భవిష్యత్తు సమస్యలకు పరిష్కారం చూపుతాయి.

రాజధానిలో జీఐఎస్(జియోగ్రాఫిక్ ఇన్‌ఫర్మేషన్ సిస్టమ్) సర్వే నత్తనడకన సాగుతోంది. ఆరు నెలల్లో పూర్తవుతుందని ఆగస్టు 8, 2024న విలేకరుల సమావేశంలో కమిషనర్ ఆమ్రపాలి ధీమా వ్యక్తం చేయగా.. 2 నెలల పురోగతి ఆ స్థాయిలో లేదు. సర్వే చేపట్టిన సంస్థ నిర్లక్ష్యమే అందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. అరకొర ఉద్యోగులతో సర్వే చేపడుతోంది. కొత్తగా విధుల్లో చేరుతోన్న కొందరు సర్వేయర్లు.. జీతాలు, ఇతరత్రా సమస్యలతో రోజుల వ్యవధిలోనే ఉద్యోగం వదిలేస్తున్నారు. దాంతో సర్వే నెమ్మదించింది. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఆ సంస్థపై చర్యలు తీసుకుంటామని జీహెచ్‌ఎంసీ స్పష్టం చేస్తోంది. నగరానికి 3డీ పటం తయారు చేయాలన్న లక్ష్యంతో చేపట్టిన ప్రతిష్ఠాత్మక జీఐఎస్ సర్వే ఆదిలోనే ప్రశ్నార్థకంగా మారింది.

పూర్తయితే బహుళ ప్రయోజనాలు.. జీఐఎస్ సర్వే రెండు దశల్లో జరగనుంది. మొదటిదశలో డ్రోన్లు నగరం మొత్తాన్ని 2డీ రూపంలో చిత్రీకరిస్తాయి. రెండో దశలో ఇంటింటి సర్వే, క్షేత్రస్థాయిలో మౌలిక సౌకర్యాల మ్యాపింగ్ ఉంటుంది. డిజిటల్ ఇంటి నంబర్లు, ప్రతి ఇల్లు, వీధి, పార్కులు, విద్యుత్తు స్తంబాలు, చెరువులు, ప్రభుత్వ భవనాలు, ఖాళీ స్థలాలు, క్రీడా మైదానాలు, ఇతరత్రా వసతుల స్పష్టమైన చిత్రాలతో నగరానికి విస్తృతస్థాయి 3డీ పటం రూపుదిద్దుకుంటుంది. స్విగ్గి, జొమాటో, ఇతర ఈ–కామర్స్ సంస్థలు నగర పటాన్ని ఉపయోగించుకుంటాయని, జీఐఎస్ సర్వే పటాలు భవిష్యత్తు సమస్యలకు పరిష్కారం చూపుతాయి.

సర్వేలో నమోదు చేసుకునే వివరాలు..

నిర్మాణానికి సంబంధించిన ఆస్తిపన్ను వివరాలతోపాటు దానిని వ్యాపారానికా, నివాసానికా అనే వివరాలను సర్వేలో జీహెచ్‌ఎంసీ సేకరిస్తోంది. నిర్మాణంలోని పచ్చదనం, విద్యుత్తు సదుపాయాలు, సౌర ఫలకలు, ఇంకుడు గుంత, లిఫ్టు, ఎదురుగా ఉన్న రోడ్డు వెడల్పు వంటి వివరాలను.. యజమానికి సమ్మతమైతేనే తీసుకుంటున్నట్లు అధికారులు చెబుతున్నారు. అదనపు వివరాలను నగర భవిష్యత్తు ప్రణాళిక కోసం సేకరిస్తున్నామంటున్నారు. భవన నిర్మాణ అనుమతి, నీటి, విద్యుత్తు కనెక్షన్ల వివరాలు ఇవ్వడం తప్పనిసరి కాదంటున్నారు.

# బాధ్యత మరిచి.. మామూళ్లకు తెగించి..




వికారాబాద్ : సమాజంలో శాంతిభద్రతలను పరిరక్షిస్తూ అందరికీ అండగా నిలవాల్సిన పోలీస్ శాఖ ఉద్యోగులు పలువురు బాధ్యతను విస్మరిస్తూ శాఖకు చెడ్డపేరు తెస్తున్నారు. జిల్లాలో ఓ సీఐపై సస్పెన్షన్ వేటు, ఇద్దరు సీఐలు, మరో ఇద్దరు ఎస్‌ఐలను ఎస్పీ కార్యాలయానికి అనుసంధానం చేస్తూ పోలీసు ఉన్నతాధికారులు తీసుకున్న చర్యలు కలకలం రేపాయి. ఒకేసారి ముగ్గురు సీఐలు, ఇద్దరు ఎస్‌ఐలపై చర్యలు తీసుకోవడం జిల్లాలో ఇదే ప్రథమం.

అవినీతి మరక..వికారాబాద్ పట్టణ సీఐగా నాగరాజు బాధ్యతలు స్వీకరించక ముందు జోగిపేట సీఐగా పని చేశారు. ఆ సమయంలో ఓ బాలిక అత్యాచారం కేసులో అవినీతికి, అక్రమాలకు పాల్పడ్డాడని విచారణలో తేలింది. దీంతో అతనిపై సస్పెన్షన్ వేటు పడింది. ఇసుక అక్రమ రవాణాను అరికట్టడంలో విఫలమవడంతో పాటు ప్రోత్సహిస్తున్నారని విచారణలో తేలడంతో తాండూర్ సీఐ సంతోష్‌కుమార్, రూరల్ సీఐ అశోక్, పెద్దేముల్ ఎస్‌ఐ గిరెన్న, యాలాల్ ఎస్‌ఐ శంకర్‌లను ఎస్పీ కార్యాలయానికి అనుసంధానం చేశారు. రాత్రికి రాత్రే తోడేస్తున్నారు

జిల్లా వ్యాప్తంగా ఇసుక అక్రమ రవాణా విషయంలో పోలీసులు చూసీ చూడనట్లు పోతున్నారనే విమర్శలున్నాయి. సమీప వాగుల్లోని ఇసుకను రాత్రికి రాత్రే తోడేస్తున్నారు. యాలాల్ మండల పరిధిలోని కాగ్నా, కాక్రవేణి వాగుల నుంచి తాండూర్, పెద్దేముల్, బషీరాబాద్, ధారూర్ మండలాలకు అక్రమంగా ఇసుక తరలిపోతోంది. ధారూర్ మండల పరిధిలో ఉన్న చిన్నచిన్న వాగుల నుంచి, నవాబుపేట మండల పరిధిలో ఉన్న మూసీ నది నుంచి ఇసుక రవాణా జరుగుతోంది.

గతంలో యాలాల్ ఎస్‌ఐ ఇంటి ఎదుట ఇద్దరు ఇసుక వ్యాపారులు ఇసుక రవాణా విషయంలో ఎస్‌ఐ సమక్షంలోనే గొడవకు దిగి పరస్పరం దాడి చేసుకున్నారు. ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన జిల్లా ఎస్పీ సదరు ఎస్‌ఐని విధుల నుంచి తప్పించి ఎస్పీ కార్యాలయానికి అనుసంధానం చేశారు.

ఓ ప్రజాప్రతినిధి తాండూర్ పట్టణ సీఐని ఇసుక అక్రమ రవాణాకు సహకరించి భారీగా ముడుపులు తీసుకుంటున్నావంటూ ఫోన్‌లో దుర్భాషలాడిన సంభాషణ సామాజిక మాధ్యమాల్లో గతంలో వైరల్‌గా మారిన విషయం తెలిసిందే.

# క్లస్టర్లు పెంచితేనే.. కష్టాలు తొలిగేది..!

భద్రాద్రి : జిల్లా ఇల్లెందు మండలం కొమురారంలోని రైతు వేదిక ఇది. ఈ క్లస్టర్ పరిధిలో 8,756 మంది రైతులు 29,234 ఎకరాల్లో పంటలు పండిస్తున్నారు. సాధారణంగా ఒక క్లస్టర్‌లో 5వేల ఎకరాల సాగుభూమికి ఒక ఏఈఓ విధులు నిర్వర్తించాలి. అయితే ఈ క్లస్టర్‌లో సాగవుతున్న పంటల విస్తీర్ణానికి నిబంధనల ప్రకారం ఆరుగురు ఏఈఓలు పనిచేయాల్సి ఉన్నా.. ఒక్కరే విధులు నిర్వర్తిస్తున్నారు. క్లస్టర్ పరిధి విస్తృతంగా ఉండటంతో కొమురారం రైతు వేదికకు సుమారు 25కి.మీ. దూరంలోని ధర్మాపురం, పూసపల్లి, మిట్టపల్లి రైతులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

క్షేత్రస్థాయిలో వ్యవసాయరంగ సేవలు అన్నదాతలకు దూరమవుతున్నాయి. సాగురంగాన్ని బలోపేతం చేసేందుకు గత ప్రభుత్వం క్లస్టర్ల వారీగా రైతు వేదికలను నిర్మించి వ్యవసాయ విస్తరణాధికారుల (ఏఈఓ)ను నియమించింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 67 క్లస్టర్లకు 67 మంది ఏఈఓలు విధులు నిర్వర్తిస్తున్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న పథకాలను క్షేత్రస్థాయిలో అన్నదాతలకు చేరవేయటంలో ఏఈఓలదే కీలక పాత్ర. అయితే భద్రాద్రి జిల్లాలో సాగవుతున్న పంటల విస్తీర్ణానికి సరిపడా క్లస్టర్లు లేకపోవటంతో అటు అన్నదాతలు, ఇటు ఏఈఓలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం స్పందించి సాగుభూమికి అనుగుణంగా క్లస్టర్లు ఏర్పాటుచేయాలని అన్నదాతలు కోరుతున్నారు.




5.80 లక్షల ఎకరాలు.. 67 క్లస్టర్లు

ఈఏడాది ఖరీఫ్ సీజన్‌లో భద్రాద్రి జిల్లాలోని 67 క్లస్టర్ల పరిధిలో సుమారు 5.80లక్షల ఎకరాల్లో పంటలు సాగైనట్లు వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. సగటున ఒక్కో క్లస్టర్ పరిధిలో దాదాపు 9వేల ఎకరాల్లో రైతులు పంటలు సాగుచేశారు. సాధారణంగా 5వేల ఎకరాలకే ఒక క్లస్టర్ ఉండాలి. జిల్లాలో 9వేల ఎకరాలకు ఒక క్లస్టర్ ఉండటంతో ఆశించిన స్థాయిలో అన్నదాతలకు సేవలందటం లేదు. వానాకాలంలో పచ్చిరొట్ట ఎరువుల పంపిణీ మొదలు పంటలు చేతికందే వరకు 49 రకాల విధులను నిర్వర్తించే ఏఈఓలకు పనిభారం ఎక్కువవుతోంది.

పట్టాలెక్కని పంటల డిజిటల్ సర్వే

పంటల డిజిటల్ సర్వే పట్టాలెక్కటం లేదు. గత ఐదు రోజులుగా ఏఈఓలు విధులకు హాజరవుతున్నా.. గైర్హాజరైనట్లు అధికారులు నమోదుచేస్తున్నారని భద్రాద్రి జిల్లా ఏఈఓల సంఘం అధ్యక్షుడు నర్సింహారావు తెలిపారు. ఒక్కో ఏఈఓ సుమారు 10వేల ఎకరాల సాగుభూమిని సర్వే చేయటం సాధ్యం కాదన్నారు. ప్రభుత్వం గ్రామస్థాయిలో వ్యవసాయ సహాయకులను నియమిస్తే సర్వే చేస్తామని తెలిపారు.

ఖమ్మం జిల్లాలో అలా.. భద్రాద్రిలో ఇలా..

ఖమ్మం జిల్లాలో ఈఏడాది వర్షాకాలం 129 క్లస్టర్ల పరిధిలో సుమారు 6లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. సగటున ఒక్కో క్లస్టర్ పరిధిలో 5వేల ఎకరాల్లోపే పంటలు పండిస్తున్నారు. భద్రాద్రి జల్లాలో మాత్రం ఇందుకు భిన్నంగా ఒక్కో క్లస్టర్ పరిధిలో 9వేల ఎకరాల సాగు భూమి ఉండటం గమనార్హం. గతంలో క్లస్టర్లను ఏర్పాటుచేసే సందర్భంలో అధికారులు కేవలం రెవెన్యూ భూమిని ప్రామాణికంగా తీసుకోవటం వల్లే ఉభయ జిల్లాల్లో ఈ వ్యత్యాసం కనిపిస్తోంది. ఖమ్మం జిల్లాలో ప్రతి 5వేల ఎకరాల సాగు భూమికి ఒక క్లస్టర్ ఏర్పాటుచేసి దాని పరిధిలో రైతు వేదిక నిర్మించారు. భద్రాద్రి జల్లాలో రెవెన్యూ భూమి కంటే ఆర్ఓఎఫ్ఆర్, పోడు భూములు ఎక్కువగా ఉండటంతో క్లస్టర్ల సంఖ్య తగ్గింది. దీనికితోడు గత ప్రభుత్వం పోడు భూములకు పట్టాలివ్వటం, వాటికి ప్రభుత్వ పథకాలు వర్తింపజేయటంతో భద్రాద్రి జిల్లాలో క్లస్టర్ల సంఖ్య కంటే సాగుభూమి ఎక్కువైంది.

# భూత దయ చూపుదామయ!

ఖమ్మం : భూమ్మీద మనుషులకు జీవించే హక్కు ఉన్నట్లే జంతువులకూ కొన్ని హక్కులు ఉన్నాయని వాటిని రక్షించాల్సిన బాధ్యత మనదేనని చాటుతోంది ప్రపంచ జంతు దినోత్సవం. ఏటా అక్టోబరు 4న దీన్ని నిర్వహిస్తారు. జిల్లాలోనూ జంతు ప్రేమికులు వాటి హక్కుల పరిరక్షణకు పాటుపడుతున్నారు. మూగజీవులపై భూతదయ చాటుతున్నారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని మైదాన ప్రాంతాల్లో వ్యవసాయం, పాడి పరిశ్రమ కోసం జంతువులు, కోళ్లు వంటివి పెంచుతున్నారు. శునకాలు, పిల్లులు, వీధి కుక్కలు మనుషులతో కలిసి జీవిస్తున్నాయి. ఇటీవల శునకాల బెడద ఎక్కువైన నేపథ్యంలో ఖమ్మం నగరంలో కొంతమంది వీటిని విషం పెట్టి చంపుతున్నారన్న ఆరోపణలు వచ్చాయి. దీనిపై జంతు ప్రేమికులు కొండబోలు లక్ష్మణ్, బెజ్జంకి శ్రీనివాస్, విక్రమ్‌శర్మ తదితరులు కమిషనర్ అభిషేక్ అగస్త్యకు ఫిర్యాదు చేశారు. రక్షణకు చట్టాలు


రాజ్యాంగంలోని ఆర్టికల్ 51ఎ, జి ప్రకారం పౌరులు సాటి జీవులపై కరుణ కలిగి ఉండాలి. జంతువులు, పక్షులను ఇతర ప్రాంతాలకు తరలించేటప్పుడు రైలు, సముద్ర మార్గాల్లో తగిన సదుపాయాలు కల్పించాలి. గోసంరక్షణ చట్టం గోవధను, జంతు బలిని నిషేధించింది. ఆవులను ఇతర ప్రాంతాల నుంచి హైదరాబాద్ కబేళాలకు తరలిస్తుండగా జిల్లాలో పలుమార్లు పట్టుకున్నారు. లారీలు, డీసీఎం వాహనాల్లో కుక్కి ఊపిరి ఆడకుండా తరలిస్తున్నారు. ఇవన్నీ చట్టప్రకారం నేరమే. జంతువులను ప్రేమిద్దాంజిల్లావ్యాప్తంగా జంతు ప్రేమికులు పశువులు, శునకాలు, కోతులకు ఆహారం పెడుతున్నారు. ప్రభుత్వం కోతుల కోసం ప్రత్యేక ఫుడ్ పార్కులు నిర్మించింది. వీధి కుక్కల నియంత్రణకు మున్సిపాల్టీల్లో సంతాన నియంత్రణ శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నారు. జంతువులపై జాలి చూపించాలని, వాటిని హింసించడం, చంపడం సరికాదని జిల్లా పశు సంవర్ధకశాఖ జేడీ బి.వేణుమనోహర్‌రావు పేర్కొన్నారు. ప్రపంచ జంతు దినోత్సవాన మన బాధ్యతలు మరోసారి గుర్తు చేసుకోవాలని కోరారు.నేడు అవగాహన సదస్సులుప్రపంచ జంతు దినోత్సవం సందర్భంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అటవీశాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహించనున్నారు.

# బకాయిలు చెల్లిస్తేనే గృహజ్యోతి వర్తింపు

ధర్మపురి : ఇలా సాంకేతిక కారణాలతో జీరోబిల్లు రాని వారు, విద్యుత్తు ఛార్జీలు బకాయిలు పడ్డవారు బిల్లులు చెల్లించాల్సి ఒదేనని ఆ శాఖాధికారులు చెప్తున్నారు. ఆ బిల్లులు కడితేనే ప్రస్తుతం గృహజ్యోతి పథకం వర్తించేందుకు అవకాశం ఉందని పేర్కొన్నారు. పలు కారణాలతో గృహజ్యోతి వర్తించకపోతే విద్యుత్తు బిల్లులను రద్దు చేస్తామని ప్రభుత్వం చెప్పడంతో జిల్లాలో వేలాది మంది బిల్లులు కట్టకుండా ఉన్నారు. అయితే విద్యుత్తు సిబ్బంది బిల్లులు చెల్లించాల్సి ఒదేనని చెప్పడంతో వినియోగదారులు వాపోతున్నారు. రూ.నాలుగు నుంచి రూ.అయిదు వేల వరకు బిల్లుల బకాయిలు ఉన్నాయి.

**సరి చేసుకునే అవకాశం**

తెల్లరేషన్ కార్డు ఉండి గృహజ్యోతికి దరఖాస్తు చేసుకుని సాంకేతిక కారణాల వల్ల లబ్ధి పొందలేని వినియోగదారులు.. వివరాలను సరి చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. మీటర్‌కు సంబంధించి యూఎస్‌సీ నెంబర్ తప్పుగా నమోదైనా, ప్రజాపాలన దరఖాస్తుకు సంబంధించి ఆన్‌లైన్‌లో నాట్ అప్లైడ్ అని ఉన్నా, అద్దె ఉన్నవారు వేరే ఇంటికి మారిన వారు సరి చేసుకోవచ్చు. రేషన్ లేదా ఆధార్, ఆధార్ లింకు ఫోన్ నెంబర్, విద్యుత్తు మీటర్‌కు సంబంధించిన వివరాలతో స్థానిక మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లి సరి చేసుకోవచ్చు.నేరెల్లకు చెందిన పాదం మీనయ్య తెల్లరేషన్ కార్డు ఉ




ండటంతో గృహజ్యోతికి దరఖాస్తు చేసుకున్నాడు. సాంకేతిక కారణాల వల్ల జీరోబిల్లు రాని వారికి ప్రభుత్వం బిల్లు రద్దు చేస్తామని చెప్పింది. దీంతో మీనయ్య మిన్నకుండటంతో ఆరు నెలల బిల్లు రూ.1300 వచ్చింది. ప్రస్తుతం బకాయి బిల్లు చెల్లిస్తేనే గృహజ్యోతి వర్తిస్తుందని విద్యుత్తు సిబ్బంది చెప్పడంతో మీనయ్య అవాకయ్యాడు.

బిల్లులు చెల్లించాలి: మనోజ్, విద్యుత్తు అసిస్టెంట్ అకౌంట్స్ అధికారి, జగిత్యాల రూరల్ గృహజ్యోతి వర్తించినప్పటి నుంచే జీరో బిల్లు ఉంటోంది. సాంకేతిక కారణాల వల్ల లబ్ధి పొందని వారు వర్తించే వరకు వచ్చిన బిల్లు కట్టాల్సిందే. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారు గృహజ్యోతిలో తప్పులు దొర్లినట్లయితే ప్రభుత్వం సవరించుకునే అవకాశం కల్పించింది.

# డిజిటల్ మాయ

రంగారెడ్డి : సర్కారు భూములను పరిరక్షించేందుకు అక్రమార్కులు హద్దు మీరకుండా వాటిని కాపాడేందుకు భూములు.. స్థలాలకు గూగుల్ మ్యాపింగ్ చేస్తాం... డిజిటల్ సర్వేలు నిర్వహిస్తామంటూ రెవెన్యూ అధికారులు ఘనంగా ప్రకటించినా డిజిటల్ సర్వే, గూగుల్ మ్యాప్‌లపై ఉదాసీనంగా ఉంటున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో 42 వేల ఎకరాల ప్రభుత్వ భూములకు సరిహద్దుల్లేవు. హైదరాబాద్‌కు సమీపంలో 300కుపైగా గ్రామాలు రంగారెడ్డి, మేడ్చల్ జిల్లా సరిహద్దులో ఉన్నాయి. ఆయా గ్రామాల్లో ప్రైవేటు పట్టా, ప్రభుత్వ, అసైన్డ్, సీలింగ్ భూములున్నాయి. ప్రైవేటు పట్టాభూముల పక్కనే ఈ భూములను కొందరు ఆక్రమార్కులు ఆక్రమించుకుని బోర్డులను ఏర్పాటు చేసుకున్నారు. ధరణిలో ప్రభుత్వ భూము



లుగా ఉన్నా వాటికి సరిహద్దులు నిర్మించాలంటే సర్వే నిర్వహించాలి. అక్రమార్కులు ప్రహరీలు, ఇనుపకంచెలు నిర్మించారు.

తూతూమంత్రంగా సర్వేలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలతో రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూములను డిజిటల్ సర్వే నిర్వహించాలంటూ కొద్దిరోజుల క్రితం నిర్ణయించారు. డిజిటల్ సర్వే నిర్వహించేందుకు అవసరమైన సర్వేయర్లు మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లోని చాలా మండల కార్యాలయాల్లో అందుబాటులో లేరు. డిజిటల్ సర్వేకు హడావుడిగా కొనుగోలు చేసిన పరికరాలు ఆర్డీవో కార్యాలయాల్లో మూలనపడున్నాయి. ప్రభుత్వ భూముల సర్వేపై ప్రశ్నిస్తే సమాధానం రావడం లేదు. కానీ ప్రభుత్వ భూములను ప్రైవేటు సంస్థల ప్రతినిధులతో డిజిటల్ సర్వేలు చేయిస్తున్నారు.

# చిన్న షావల్స్ వైపే సింగరేణి మొగ్గు

కొత్తగూడెం : సింగరేణి ఉపరితల గనుల్లో ఓబీ(మట్టి) వెలికితీయడం, బొగ్గును ఉత్పత్తి చేయడంలో కీలకపాత్ర పోషిస్తున్న షావల్స్‌పై యాజమాన్యం ప్రత్యేక దృష్టి పెట్టింది. సంస్థలోని 22 ఉపరితల గనుల్లో 11, 12క్యూబిక్ మీటర్ల భారీ షావల్స్ కంటే.. 5క్యూబిక్ మీటర్లున్న షావల్స్‌తోనే చురుగ్గా పనులు జరుగుతుండడంతో భవిష్యత్తులో వాటికే ప్రాధాన్యం ఇవ్వాలని ఆపరేషన్, ఈఅండ్‌ఎం విభాగం భావిస్తోంది. ఇటీవల కొత్తగూడెంలో జరిగిన సమీక్ష సమావేశం లో షావల్స్ పనితీరుపై ఏరియా జీఎంలు, ప్రాజెక్టు అధికారులు, ఇంజినీర్ల అభిప్రాయాలను తీసుకున్న ఉన్నతాధికారులు.. వాటి పనితీరు పై సుదీర్ఘంగా చర్చించారు.తక్కువ ఖర్చుతో ఎక్కువ పని..రూ.14కోట్ల వ్యయంతో కొనుగోలు చేస్తున్న షావల్స్‌కు సమానంగా రూ.6కోట్ల వ్యయాన్ని వెచ్చించిన చిన్న షావల్స్ పనిచేస్తున్నాయి. దీనికితోడు సంస్థలోని ప్రైవేటుగా ఓబీ వెలికితీసే గుత్తేదార్లు వినియోగిస్తున్న షావల్స్ అన్ని చిన్నవి కావడం కూడా ఓ కారణమే. దీంతో తక్కువ ఖర్చుతో ఎక్కువ పని జరిగేలా చిన్న షావల్స్‌కే ప్రాధాన్యం ఇవ్వాలన్న నిర్ణయానికి వచ్చారు. సంస్థలోని ఉపరితల గనుల్లో ప్రస్తుతం రెండు అతి భారీ యంత్రాలు దీనిలో ఓసీపీ-1 డ్రాగ్‌లైన్‌ను ఇప్పటికే యాజమాన్యం అమ్మకానికి పెట్టింది. అలాగే ఆర్జీ-2 డివిజన్ ఓసీపీ-3 ప్రాజెక్టులోని డ్రాగ్‌లైన్‌కు దాదాపు 6 నుంచి 8 నెలలకు సరిపడా పని స్థలాలు మాత్రమే ఉన్నాయి.

# రక్షిత తాగునీరు అందేనా?



గోదావరిఖని: సింగరేణి కార్మిక కుటుంబాలకు రానున్న తొమ్మిది నెలల్లో రక్షిత మంచినీరు సరఫరా కానుంది. ఇందు కోసం గోదావరి నీటిని శుద్ధి చేసే ర్యాపిడ్ గ్రావిటీ ఫిల్టర్ బెడ్ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. రూ.20 కోట్ల వ్యయంతో చేపడుతున్న ఈ పనులతో ఆర్జీ-1, 2, 3 ప్రాంతంలోని 13 వేల కార్మిక కుటుంబాలకు స్వచ్ఛమైన తాగునీరు అందనుంది. మరో తొమ్మిది నెలల్లో పనులు పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గోదావరిఖనిలోని గంగానగర్ వద్ద నిర్మిస్తున్న ర్యాపిడ్ గ్రావిటీ ఫిల్టర్ బెడ్ మే 2025 నాటికి పూర్తి కానుందని అధికారులు వెల్లడించారు.

ఇన్‌ఫిల్ట్రేషన్ గ్యాలరీతో ఇబ్బందులే

ప్రస్తుతం సింగరేణి గోదావరిలో వేసిన ఇన్‌ఫిల్ట్రేషన్ గ్యాలరీ ద్వారా కార్మికుల కుటుంబాలకు తాగునీరు అందిస్తుంది. ఇసుక రేణువుల ద్వారా నీరు శుద్ధి అయి ఇన్‌ఫిల్ట్రేషన్ బావులోకి చేరుతాయి. అక్కడి నుంచి గ్రావిటీ ద్వారా ఇన్‌టేక్ వెల్‌లోకి చేరుకుంటాయి. మోటార్ల ద్వారా కార్మిక కుటుంబాలకు సరఫరా అవుతాయి. అయితే ఇన్‌ఫిల్ట్రేషన్ విధానం ద్వారా నదీ ప్రవాహ సమయంలో ఇబ్బంది లేదు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో గోదావరిలో వెనక జలాల వల్ల ఇన్‌ఫిల్ట్రేషన్ గ్యాలరీలు మునిగిపోయి బావుల్లోకి మురికినీరు చేరుతుంది. వర్షాకాలంలో అవి పూర్తిగా మునిగి పోవడంతో బావుల పైకప్పులు లేచి అందులోకి నది నీరు చేరుతుంది. దీంతో నీరు మురికిగా రావడంతో కార్మిక కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయి. వీటిని నాగ్‌పూర్‌కు చెందిన ఓ సంస్థతో యజమాన్యం మరమ్మతులు చేయించింది. నీటిలో పనిచేసే అనుభవం ఉన్న వారిని నదిలో దించి పనులు చేయించినా ఫలితం లేకుండా పోయింది.

**రోజుకు 35 మిలియన్ లీటర్ల నీరు శుద్ధి**

ఇన్‌ఫిల్ట్రేషన్ గ్యాలరీ విధానంతో కార్మిక కుటుంబాలకు సురక్షితమైన తాగునీరు అందకపోవడంతో ర్యాపిడ్ గ్రావిటీ ఫిల్టర్ విధానం అమలు చేయాలని సింగరేణి నిర్ణయించింది. మిషన్ భగీరథ తరహాలోనే తాగునీరు శుద్ధి చేయాలని ప్రణాళికలు వేసింది. దీని కోసం రూ.20 కోట్లు కేటాయించింది. గోదావరి నీటిని మోటార్ల ద్వారా గ్రావిటీ ఫిల్టర్ బెడ్‌కు తరలించి అక్కడ శుద్ధి చేయనున్నారు. దీని వల్ల నీటిలో ఎలాంటి మలినాలు, మురుగు నీరు చేరే అవకాశం ఉండదు. రోజుకు 35 మిలియన్ లీటర్ల నీటిని శుద్ధి చేసే సామర్థ్యంతో ఈ ఫిల్టర్ బెడ్‌లు నిర్మిస్తున్నారు. రామగుండం-1 ప్రాంతానికి 20 మిలియన్ లీటర్లు, ఆర్జీ-2, 3 డివిజన్‌లకు 15 మిలియన్ లీటర్ల నీటిని సరఫరా చేసే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. రామగుండం రీజియన్‌లో 13 వేల మంది ఉద్యోగులు పనిచేస్తుండగా వారి కుటుంబాలు మరో 40 వేల మంది ఉంటారు. వీరికి రోజునకు 35 మిలియన్ లీటర్ల నీరు అవసరం పడుతుంది. దానికి అనుగుణంగానే సింగరేణి ఏర్పాట్లు చేస్తుంది.

**మే నాటికి పనులు పూర్తి** సురక్షితమైన తాగునీరు అందించేందుకు ర్యాపిడ్ గ్రావిటీ ఫిల్టర్ బెడ్ నిర్మాణం పనులు వేగంగా సాగుతున్నాయి. 2025 మే నాటికి కార్మిక కుటుంబాలకు స్వచ్ఛమైన నీరు సరఫరా చేస్తాం. దీనివల్ల భవిష్యత్తులో తాగునీటి సమస్య రాదు. మురికినీరు వచ్చే అవకాశం ఉండదు. నిర్మాణం పనులు వేగంగా చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం.లలిత్‌కుమార్, ఆర్జీ-1 జీఎం

# ఆపద వేళ.. మేమున్నామని భరోసా



కరీంనగర్ : ఆర్టీసీలో మహాలక్ష్మి పథకం రావడంతో మహిళా ప్రయాణికుల సంఖ్య మరింత పెరిగింది. ప్రయాణికులకు ఆపత్కాలంలో 'మేమున్నాం అంటూ' భరోసానిస్తున్నారు సంస్థ సిబ్బంది. ఒక వైపు విధి నిర్వహణ బాధ్యత చూస్తూనే.. మరో వైపు సేవా కార్యక్రమాల్లో తరిస్తున్నారు. గర్భిణులు పురిటి నొప్పులతో బాధపడుతుంటే వైద్య సిబ్బంది అవతారమెత్తి అండగా నిలుస్తున్నారు. ఎవరైనా వస్తువు మరిచిపోతే మంచి మనసుతో వారి చెంతకు చేరుస్తున్నారు. ఆర్టీసీ సిబ్బంది ఔదార్యంపై కథనం.

**నిత్యం లక్ష మంది రాకపోకలు..**

కరీంనగర్ బస్టాండ్‌లో 45 ప్లాట్‌ఫాంలు ఉండగా నిత్యం లక్ష మందికిపైగా రాకపోకలు సాగిస్తుంటారు. ఆర్టీసీ ఉద్యోగులు, పొరుగుసేవల సిబ్బంది విధులు నిర్వర్తిస్తూనే ఆపద వేళ ప్రయాణికులకు అండగా ఉంటున్నారు. ప్రయాణికులు అనారోగ్యంగా ఉన్నట్లు తెలిస్తే ఆసుపత్రికి పంపిస్తున్నారు. గర్భిణులు నొప్పులతో బాధపడటంలాంటి సందర్భాల్లో 108కు సమాచారం ఇస్తున్నారు. ప్రయాణికులు పోగొట్టుకుంటున్న విలువైన వస్తువులు తిరిగి అప్పగిస్తున్నారు.వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటే మేలు

రాష్ట్రంలోనే రెండో అతి పెద్ద ప్రయాణ ప్రాంగణం ఇది. ఇక్కడ రోజూ వేలాదిమంది ప్రయాణిస్తుంటారు. మహాలక్ష్మి పథకం వచ్చిన తర్వాత మహిళల సంఖ్య మరింత పెరిగింది. రోజూ ఎవరో ఒకరు అస్వస్థతకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు ఆలోచించి.. ఇక్కడ ఒక వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంటే ప్రయాణికులు మేలు చేసినవారవుతారు.

**కొన్ని ఘటనలు ఇలా..**

మే 6న ఓ వృద్ధురాలు బస్టాండ్‌కు వచ్చి.. అస్వస్థతకు గురికాగా స్పందించిన సిబ్బంది 108కు సమాచారం ఇచ్చి ఆసుపత్రికి తరలించారు. ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేశారు.

జూన్ 16న ఒడిశాకు చెందిన గర్భిణి కుంట (చత్తీస్‌గఢ్) వెళ్లడానికి కరీంనగర్ బస్టాండ్‌కు రాగా, ఆమెకు నొప్పులు రావడంతో.. ఆర్టీసీ సిబ్బంది సైదమ్మ, స్రవంతి, లావణ్య, భవానీ, రేణుకలు సమయస్ఫూర్తిగా వ్యవహరించి ప్రసవం చేశారు. ఆమె పండటి పాపకు జన్మనిచ్చింది. అనంతరం 108 వాహనంలో తల్లి, శిశువును ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. సిబ్బందిని మంత్రి పొన్నం ప్రభాకర్‌తోపాటు సంస్థ ఎండీ సజ్జనార్, కలెక్టర్, ఇతర అధికారులు ప్రశంసించారు.జూన్ 20 మంచిర్యాల నుంచి హైదరాబాద్ వెళ్లే ఓ ప్రయాణికుడు రూ.3 లక్షల బ్యాగ్‌ను బస్సులో ఉంచి.. పెద్దపల్లిలో దిగగా.. అతడు వచ్చే లోపు బస్సు వెళ్లిపోయింది. ఆయన వెంటనే కరీంనగర్ బస్టాండ్ భద్రతా సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఏటీఎం రజనీకృష్ణ, ఎస్‌ఎం అంజయ్య బ్యాగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆర్‌ఎం సుచరిత ఆధ్వర్యంలో ఆయనకు అందజేశారు.

ఆగస్టు 18న లక్ష్మి అనే గర్భిణి హుస్నాబాద్ నుంచి మందమర్రి వెళ్లడానికి కరీంనగర్ బస్టాండ్‌కు వచ్చింది. ఆమెకు నొప్పులు రావడంతో ఎస్‌ఎం అంజయ్య 108కు సమాచారం అందించారు. ఆమె వెంట మంగ అనే పొరుగు సేవల సిబ్బంది ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి ప్రసవమయ్యే వరకు (రాత్రి 11 గంటల) అక్కడే ఉంది.

**అధికారుల ప్రశంసలు..**

ఆర్టీసీ సిబ్బంది విధులు నిర్వర్తిస్తూనే మరో వైపు అదనంగా సేవా కార్యక్రమాలు చేయడంపై ప్రయాణికులు అభినందిస్తున్నారు. మహిళకు బస్టాండ్‌లో ప్రసవం చేసిన సిబ్బందికి మంత్రి పొన్నం ప్రభాకర్ రూ.5 వేల నగదు పురస్కారం అందజేయగా, సంస్థ ఎండీ సజ్జనార్ హైదరాబాద్‌లో సత్కరించారు. ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్టేషన్ మేనేజర్ అంజయ్య మంత్రి శ్రీధర్‌బాబు చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు.

# సొంత నైపుణ్యం.. వస్త్రాల్లో వైవిధ్యం



సిరిసిల్ల: ఒక ఆలోచన.. ఆ వృత్తిలో పని చేసేవారందరికీ ఉపయోగపడితే స్ఫూర్తిగా నిలుస్తుంది. బతుకమ్మ చీరల డిజైన్లపై పని చేసిన అనుభవంతో కాటన్ చీరలు నేస్తున్నారు. నెల రోజుల క్రితం సిరిసిల్లలో ఒకటి, రెండు మగ్గాలపై ప్రారంభమైన ఉత్పత్తులు, పలు రకాల డిజైన్లతో వంద మగ్గాలకు చేరుకున్నాయి. మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా నేతన్నలు తమ నైపుణ్యాలకు పదును పెడుతున్నారు. సొంత ఉత్పత్తులతో మార్కెట్‌ను ఆకర్షించే ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లాలోని 30 వేల మరమగ్గాల్లో 14 వేల మగ్గాలకు డాబీ, జకార్డు పరికరాలు ఉన్నాయి. వీటికి కొద్దిపాటి మార్పులు చేసుకుంటే చాలు. పాలిస్టర్ నుంచి పట్టువస్త్రాల వరకు చాలా రకాలు ఉత్పత్తి చేయొచ్చు. సిరిసిల్లలో అలాంటి నైపుణ్యాలున్న నేతన్నలకు కొదువలేదు. ఏడాది క్రితం పాలిస్టర్ నూలుతో బతుకమ్మ చీరలు నేసిన మరమగ్గాలపై ప్రస్తుతం కాటన్ చీరలు నేస్తున్నారు. మార్కెట్‌లో వీటికి మంచి డిమాండ్ ఉంది. అందులోనూ వందశాతం కాటన్, సిల్కు నూలు, జరీ అంచులో డిజైన్లు ఉన్నవి మగువలను ఇట్టే ఆకర్షిస్తుంటాయి.

గద్వాల, పోచంపల్లి, ధర్మవరం వంటి ప్రాంతాలు కాటన్ చీరల ఉత్పత్తులకు ప్రసిద్ధి. సిరిసిల్ల, తంగళ్లపల్లిలోని నేతన్నలు హైదరాబాద్, కర్ణాటక, చెన్నై, చీరాల, చిలకలూరిపేటలోని వస్త్ర వ్యాపార సంస్థల నుంచి ప్రత్యేకంగా చీరల ఆర్డర్లు తెచ్చుకుంటున్నారు. సుమారు 50 నుంచి 100 మగ్గాలపై వివిధ రకాల డిజైన్లతో వీటిని ఉత్పత్తి చేస్తున్నారు. డిజైన్ల కోసం డాబీ, జకార్డు అమర్చిన మరమగ్గాలకు కొద్దిపాటి మార్పులు చేసుకుంటున్నారు.

ఎప్పుడూ ఒకే రకమైన వస్త్రోత్పత్తులతో మార్కెట్‌లో డిమాండ్ తగ్గి పరిశ్రమ సంక్షోభంలోకి వెళ్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఉత్పత్తిలో వైవిధ్యాన్ని చూపాలి. జిల్లా పరిశ్రమలో తొలుత బతుకమ్మ చీరలకు జరీ అంచులు, డిజైన్లు వచ్చినపుడు ఆసాములు, కార్మికులు ఉత్పత్తిలో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇది పూర్తిగా కాటన్, సిల్కు నూలు కాబట్టి కార్మికుడు రెండు మగ్గాలపై మించి పని చేసే పరిస్థితి ఉండదు.

కార్మికుడు ఒక షిఫ్టులో మూడు చీరలు ఉత్పత్తి చేయగలడు. ఒక చీరకు రూ.250 చెల్లించేలా ధర నిర్ణయించారు. ఇలా రెండు మగ్గాలపై ఆరు చీరలు నేయగలడు. అంటే రోజుకు సుమారు రూ.1,500 వరకు కార్మికుడు కూలీ పొందవచ్చు. బతుకమ్మ చీరలకు గరిష్ఠంగా ఆరు మగ్గాలపై పని చేయాలి. దీనికి రూ.800 వరకు గిట్టుబాటు అవుతుండేది. కేస్‌మెంట్, పాలిస్టర్ వస్త్రోత్పత్తులకు రోజుకు సగటున రూ.300 నుంచి రూ.400 కూలీ లభించడం గగనమవుతుంది.

ఉపాధికి ఢోకా లేదు - బైరి శ్రీనివాస్, వ్యాపారి

బతుకమ్మ చీరలు నేసిన మగ్గాలకే కొద్దిపాటి మార్పులు చేసుకుంటే చాలు మంచి డిజైన్లతో చీరలు నేయవచ్చు. వీటికి అవసరమైన ముడి సరకు స్థానికంగా లభ్యమవుతుంది. ఇక మార్కెట్ కోసం ఇతర ప్రాంతాలకు వెళ్తుంటే డిమాండ్ ఉన్న వస్త్రాలు తెలుస్తాయి. నైపుణ్యం, నాణ్యతను బట్టి ఆర్డర్లు పెరుగుతాయి. దీంతో ఉపాధి అవకాశాలు వెతుకుంటూ సిరిసిల్లకు వస్తాయి.

# గంగ ఉన్నా.. పంటలకు గగనమే!

తాండూరు : శివసాగర్ జలాశయం నుంచి ఈ ఏడాది కూడా ఆయకట్టుకు సాగు నీరు అందేలా కనిపించడం లేదు. నిధులు సిద్ధంగా ఉన్నా, రెండేళ్ల నుంచి పనులు పూర్తి కావడంలేదు. దీంతో నిర్ణీత ఆయకట్టుకు నీరందించాలనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం గగనంగా మారింది. ఏటా వర్షాలకు ప్రాజెక్టు నిండడం అలుగు పారడమే జరుగుతోంది. రైతులు వర్షాధార పంటలను సాగు చేయక తప్పడం లేదు.

**19ఏళ్ల కిందట పనులు ప్రారంభమై**

కాకరవేణి నదిపై శివసాగర్ ప్రాజెక్టు 19 ఏళ్ల కిందట ప్రారంభమైంది. ఇప్పటి వరకు పూర్తి కాలేదు. నదికి అడ్డంగా కరకట్ట నిర్మించారు. శిఖం భూమిలో నీటిని నిల్వ చేసి భూములకు వదిలేందుకు ప్రధాన తూము నిర్మించారు. అధికమైన నీరు దిగువకు వెళ్లేందుకు అలుగు నిర్మాణం ప్రమాణాల మేరకు జరగలేదు. దీంతో తూము వైపు ఒత్తిడి పెరగడంతో 2013లో వెలుపలి భాగం కొట్టుకుపోయింది. మరమ్మతులు చేయడంతో 2014 నుంచి నీరు నిల్వ ఉంటోంది. ప్రాజెక్టు పనుల్లో నిర్లక్ష్యం చేసిన గుత్తేదారును బ్లాక్ లిస్టులో చేర్చారు. అనంతరం నిధులు



మంజూరు చేసి మరో గుత్తేదారుకు పనులు అప్పగించినా ఫలితం లేదు. కట్టకు ఇరువైపులా వృక్షాలు పెరిగాయి. భూసేకరణ జరిగినా..: జలాశయం నుంచి ఆయకట్టు భూములకు నీటిని వదిలేందుకు కుడి, ఎడమ కాలువలను నిర్మించేందుకు ప్రభుత్వం భూములను సేకరించింది. రైతులకు పరిహారం చెల్లించారు. కాలువల నిర్మాణానికి ఇంజినీర్లు హద్దులు ఏర్పాటు చేశారు. రెండేళ్ల కిందటే పనులు జరగాల్సి ఉన్నా, అడుగు ముందుకు పడలేదు. భూములు ఖాళీగా ఉండడంతో పరిహారం పొందిన రైతులు పంటలను సాగు చేసుకుంటున్నారు.ఈ ఏడాది చివరి వరకు పూర్తి చేస్తాం - సుందర్, ఎస్‌ఈ. జలాశయం పనులను ఈ ఏడాది చివరి వరకు పూర్తి చేస్తాం. వర్షాల కారణంగా పనులు స్తంభించాయి. అలుగు పనులు కొంత మేర జరగాల్సి ఉంది. ఇవి పూర్తి కాగానే కాలువల నిర్మాణం చేపట్టి పూర్తి చేస్తాం.

# ఊరికి ఉపకారులు

తాండూరు : ఎంత ఎదిగినా జన్మభూమిని మరువరు కొందరు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలకో.. తాము పుట్టిపెరి గిన ఊరి బాగోగుకో.. కృషి చేస్తుంటారు. పేద విద్యార్థుల ఉన్నత విద్యాభ్యాసాలకు ఊతం అందిస్తున్న వారు ఉన్నారు. అలా స్వస్థలాల సేవలో తరిస్తూ.. మరెంతో మందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు...

**స్థలం విరాళం.. చదువుకు ఆధారం**

తాండూరు మండలం గుండ్లమడుగుతండాకు చెందిన సేవ్యానాయక్ గుంట స్థలాన్ని ప్రభుత్వ పాఠశాల భవనం నిర్మించేందుకు విరాళంగా అందించారు. 1999లో చేసిన భూదానంతో తొలిసారిగా తండాలో సర్కారు బడి ఏర్పాటైంది. గిరిజన రైతు అందించిన సహకారం విద్యార్థు ల చెంతకే బడి వచ్చేలా చేసింది. అప్పటివరకు తండాలో బడిలేక చిన్నారులు అయిదు కిలోమీటర్ల దూరంలోని జిన్‌గుర్తి వెళ్లేందుకు ఇబ్బందులు పడేవారు. కొందరు చదువులకు దూరమయ్యారు. సొంత స్థలాన్ని పాఠశాల భవన నిర్మాణానికి అప్పగించడంతో పాతిక సంవత్సరాలుగా పాఠాలు నేర్పించేందుకు వెసులుబాటు లభించింది.

**రూ. లక్ష వెచ్చించి.. గుడి నిర్మించి** స్పందించే మనసు ఉంటే గుడికైనా, బడికైనా



సహకారం అందిస్తారు. ఆ కోవలోకే చేరుతారు కరుణా కర్‌రెడ్డి. పూడూరు మండలం కుత్బుల్లాపూర్ గ్రామానికి చెందిన ఆయన కుటుంబంతో 30 ఏళ్ల కిందట తాండూరుకు వచ్చి స్థిరపడ్డారు. తల్లిదండ్రులు వెంకట్‌రెడ్డి, పుణ్యమ్మ, భార్య సుజాత సహకారంతో కోట్‌పల్లి మండలం సుల్తాన్‌పూరులో ఆంజనేయ స్వామి ఆలయాన్ని నిర్మించారు. ఇందు కోసం ముందుగా ఆయన రూ.లక్ష వరకు వెచ్చిం చారు. అనంతరం రెండు గ్రామాల ప్రజల సహకారంతో గతేడాది పనులు మొదలు పెట్టి ఈ ఏడాది పూర్తి చేశారు. హనుమాన్ విగ్రహాన్ని ప్రతిష్ఠించడంతో రెండు గ్రామాల ప్రజలు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటున్నారు.

**పదేళ్లుగా మాతృభూమి సేవలో..**

ఎన్నారై డాక్టర్ ఉజ్వల్‌రెడ్డి స్వస్థలం జహీరాబాద్ మండలం చిరాగ్‌పల్లి. సొంతూరుతోపాటు పక్క గ్రామమైన బూచినెల్లికి సేవలందించారు. ప్రభుత్వ పాఠశాలలకు మూడు ల్యాప్‌టాప్‌లు, 25 కంప్యూటర్లు అందజేశారు. 18 మంది గ్రామస్థులకు కంటి శస్త్రచికిత్సలు చేయించ డంతోపాటు 370 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఎంబీబీఎస్ సీట్లు సాధించిన ముగ్గురు పేద విద్యార్థుల పూర్తి ఫీజు చెల్లించే బాధ్యత తీసుకున్నారు. తొలి ఏడాది ఫీజు రూ.2.20 లక్షలు చెల్లించారు. ఓ బోరుబావి తవ్వించడంతోపాటు.. రెండేళ్ల కిందట గ్రామంలో రూ.18 లక్షలతో 22 సౌర విద్యుద్దీపాలను ఏర్పాటు చేయించారు.

**నీటి వెత తీర్చి..**

దోమ మండలం మోత్కూర్ ఉన్నత పాఠశాలలో 170 మంది విద్యార్థులున్నారు. బడిలో ఏర్పాటు చేసిన ట్యాంకు మరమ్మతుకు గురైంది. దీంతో తాగునీటికి చిన్నారులు, మధ్యాహ్న భోజనం వండేందుకు నిర్వాహకులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. ఈ విషయం కేఎస్‌ఆర్ ట్రస్టు వ్యవస్థాపకురాలు రాజేశ్వరమ్మ తెలిసింది. వెంటనే సంస్థ ఛైర్మన్ శరత్‌కుమార్‌రెడ్డి చెప్పారు. బడికి దగ్గర్లోనే గ్రామానికి నీటిని సరఫరా చేసే ట్యాంకు నుంచి పాఠశాల వరకు పైపులైన్ వేయించి ట్యాంకుకు, వంట గది వద్ద కుళాయి ఏర్పాటు చేశారు. ఇందుకోసం రూ.10వేలు వెచ్చించారు. ప్రస్తుతం నిరంతరం నీటి సరఫరా కావడంతో సమస్య తీరింది. ఇంకే సమస్య ఉన్నా, సహకారం అందించేందుకు ముందుంటామని శరత్‌కుమార్‌రెడ్డి తెలిపారు.




# పుంగనూరులో జగన్ పర్యటన రద్దు.. కారణం ఇదే

తిరుపతి, అక్టోబర్ 7: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పుంగనూరు పర్యటన రద్దు అయ్యింది. పుంగనూరులో చిన్నారిని కిడ్నాప్ చేసి ఆపై దారుణంగా హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో హత్యకు గురైన చిన్నారి అస్పియా కుటుంబసభ్యులను పరామర్శించేందుకు ఈనెల 9న జగన్ పుంగనూరుకు వెళ్లాలని నిర?యించారు. అయితే జగన్ పుంగనూరు పర్యటనను రద్దు చేసుకున్నట్లు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వెల్లడించారు. చిన్నారి హత్య విషయంలో నేరస్తులను ప్రభుత్వం అరెస్ట్ చేసినందున జగన్ పర్యటన రద్దు చేసుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. నిందితులకు కఠిన శిక్ష పడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఉదయం మీడియా సమావేశంలో పెద్దిరెడ్డి రామాచంద్రారెడ్డి వెల్లడించారు.

**ఇదీ జరిగింది....** కాగా.. రాష్ట్రంలో సంచలనం సృష్టించిన బాలిక ఆస్పియా హత్య కేసులో ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు చిత్తూరు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు వెల్లడించారు. పుంగనూరులో సెప్టెంబర్ 29న ట్యూషన్‌కు వెళ్లి ఇంటికి వచ్చిన ఆస్పియా(7) ఆ తర్వాత అదృశ్యమైంది. కుటుంబసభ్యులు ఎంత వెతికినా ప్రయోజనం లేకుండా పోయింది. మూడ్రోజుల తర్వాత పుంగనూరు సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లో డెడ్ బాడీ లభించడంతో హత్య కేసు సంచలనంగా మారింది. ఈ ఘటనను ప్రభుత్వం సీరియస్ గా తీసుకుంది. నిందితులను పట్టుకోవాల్సిందిగా చిత్తూరు ఎస్పీ మణికంఠను ఆదేశించగా.. విచారణ చేపట్టిన పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. నగదు లావాదేవీలే బాలిక హత్యకు కారణంటూ ఎస్పీ మణికంఠ తేల్చిచెప్పారు. బాలిక తండ్రి అజ్మతుల్లా నడుపుతున్న ఫైనాన్స్ వ్యాపారంలో నెలకొన్న లావాదేవీల వివాదమే బాలికను హత్య చేయడానికి దారి తీశాయని ఎస్పీ వెల్లడించారు. ఓ మహిళ సహా మ్తొత్తం ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్టు ఆయన వెల్లడించారు. ప్రచారం జరుగుతున్నట్లుగా చిన్నారిపై అత్యాచారం జరగలేదని ఎస్పీ మణికంఠ తేల్చి చెప్పారు. ఆ విషయం పోస్టుమార్టం రిపోర్టులో వెల్లడైందని ఆయన తెలిపారు. గత నెల 29న సాయంత్రం బుర్కా వేసుకుని వచ్చిన ఓ మహిళ బాలికకు చాక్లెట్ ఇచ్చి ఇంటికి తీసుకెళ్లిపోయిందని, అనంతరం చిన్నారి నోరు, ముక్కు మూసి ఊపిరాడకుండా చేసి చంపేశారని ఎస్పీ తెలిపారు. అనంతరం ఆస్తియా మృతదేహాన్ని నిందితులు ద్విచక్రవాహనంపై తీసుకెళ్లి సమ్మర్ స్టోరేజీ ట్యాంకులో పడేసినట్లు విచారణలో తేలిందని ఎస్పీ మణికంఠ వెల్లడించారు. మ్తొత్తం 12 టీమ్స్‌ను ఏర్పాటు చేసి చిన్నారి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. అయితే అక్టోబర్ 2న గాంధీ జయంతి రోజు ఆస్పియా మృతదేహాన్ని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో గుర్తించినట్లు ఎస్పీ వెల్లడించారు. హత్య జరిగిందని తెలిసిన వెంటనే పోలీసులను అలర్ట్ చేశామని, అన్ని కోణాల్లో విచారణ చేపట్టి నిందితులను గుర్తించి అరెస్టు చేసినట్లు ఎస్పీ మణికంఠ తెలిపారు.

**సీఎం చంద్రబాబు పరామర్శ :** ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విచారం వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు దురదృష్టకమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబసభ్యులను సీఎం ఫోన్‌లో పరామర్శించారు. బాలిక తండ్రితో మాట్లాడిన చంద్రబాబు ధైర్యంగా ఉండాలని చెప్పారు. ఏపీ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ముగ్గురు నిందితులను చిత్తూరు జిల్లా పోలీసులు అదుపులోకి తీసుకున్నారని, చట్టప్రకారం వారికి కఠిన శిక్ష విధిస్తామని హామీ ఇచ్చారు. ఎవరూ అధైర్య పడొద్దని బాధిత కుటుంబానికి సీఎం చంద్రబాబు ధైర్యం చెప్పారు. మరోవైపు పుంగనూరు వెళ్లి బాధిత కుటుంబాన్ని ఏపీ హెూంమంత్రి అనిత, రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి పరామర్శించారు. ఎన్డీయే ప్రభుత్వం అండగా ఉంటుందని వారికి భరోసా ఇచ్చారు.

# ప్లాస్టిక్ నిర్మూలన ఇంటి నుంచే ప్రారంభం కావాలి: పవన్ కల్యాణ్



మంగళగిరి: పర్యావరణాన్ని పరిరక్షించి, జీవవైవిధ్యాన్ని కాపాడినప్పుడే 'వసుధైక కుటుంబం' అనే పేరు సార్థకమవుతుందని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. మంగళగిరిలోని అరణ్య భవన్‌లో నిర్వహించిన 70వ వన్యప్రాణి వారోత్సవాల ముగింపు సభకు ఆయన హాజరయ్యారు. వారోత్సవాల్లో భాగంగా అటవీ శాఖ ఏర్పాటు చేసిన ప్రదర్శనశాలను ప్రారంభించారు. అక్కడ ఏర్పాటు చేసిన జంతువుల బొమ్మలను ఆసక్తిగా తిలకించారు. సముద్ర తాబేళ్ల రక్షణ కోసం రూపొందించిన మెరైన్ ఫానా యాప్‌ను పవన్ ప్రారంభించారు. కింగ్ కోబ్రాల సంరక్షణ బ్రోచర్‌ని ఆయన ఆవిష్కరించారు. వన్యప్రాణి వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో విజయం సాధించిన వారికి పవన్ బహుమతులు ప్రదానం చేశారు. భవిష్యత్తు తరాలకు మంచి వాతావరణాన్ని అందించాలంటే ప్రజలంతా ప్లాస్టిక్‌ని నిర్మూలించాలన్నారు. అది ఇంటి నుంచే ప్రారంభం కావాలని పవన్ సూచించారు. పర్యావరణాన్ని పరిరక్షించేందుకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# కౌలు చట్టం అమలుకు ప్రభుత్వం సిద్ధం: అచ్చెన్నాయుడు



గుంటూరు: గుంటూరు కలెక్టరేట్‌లో వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు సమీక్ష నిర్వహించారు. కౌలురైతుల చట్టంపై 5 జిల్లాల వ్యవసాయ శాఖ అధికారులతో చర్చించారు. 1956లోనే కౌలురైతుల చట్టాన్ని తీసుకొచ్చారని, అయితే, 2011లో చట్టంలో చేసిన మార్పుల కారణంగా సమస్యలు వచ్చాయన్నారు. "గత ఐదేళ్లలో కౌలురైతులు అనేక ఇబ్బందులు పడ్డారు. రైతులు, కౌలుదారులతో చర్చించి నిర?యం తీసుకోవాలని సీఎం చంద్రబాబు చెప్పారు. ప్రాంతీయ సదస్సుల ద్వారా అభిప్రాయాలు తీసుకొని చట్టం రూపకల్పన చేశాం. తొలి ప్రాంతీయ సదస్సు గుంటూరులో నిర్వహించాం. అందరికీ ఆమోదయోగ్యమైన కౌలు చట్టం అమలుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది" అని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

# శరన్నవరాత్రి ఉత్సవాలు.. మహాచండీ దేవి అలంకారంలో దుర్గమ్మ



విజయవాడ: ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఐదోరోజు మహాచండీ దేవి అలంకారంలో దుర్గమ్మ దర్శనమిస్తున్నారు. దేవతల కార్యసిద్ధి, దుష్టశిక్షణ, శిష్ట రక్షణకు మహాలక్ష్మీ, మహాకాళీ, మహా సరస్వతి త్రిశక్తి స్వరూపిణిగా శ్రీ మహాచండీ అమ్మవారు ఉదవించారు. శ్రీ చండీ అమ్మవారిలో అనేక మంది దేవతలు కొలువై ఉన్నారు. శ్రీ మహాచండీ అనుగ్రహంతో విద్య, కీర్తి, సంపదలు లభించి శత్రువులు మిత్రులుగా మారడంతో పాటు ఏ కోరికలతో ప్రార్థిస్తామో అవన్నీ సత్వరమే లభిస్తాయనేది భక్తజనుల నమ్మకం. ఉత్సవాల సందర్భంగా అమ్మవారి దర్శనానికి భారీగా భక్తులు తరలివస్తున్నారు. ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.

# తిరుమల బ్రహ్మోత్సవాలు.. సర్వభూపాల వాహనంపై మలయప్పస్వామి



తిరుమల: కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవేంకటేశ్వర స్వామివారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజైన సోమవారం రాత్రి సర్వభూపాల వాహనంపై మలయప్పస్వామి విహరిస్తున్నారు. కాళీయమర్దనం అవతారంలో విహరిస్తూ భక్తులకు స్వామివారు దర్శనమిస్తున్నారు. శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. తిరుమల మాడవీధులు భక్తులతో కిక్కిరిసిపోయాయి. గోవింద నామస్మరణలతో తిరుమల గిరులు మార్మోగుతున్నాయి.




# ఆ పార్టీ 'పిల్ మాస్టర్ గ్యాంగ్'.. భాజపాపై కల్పనా సోరెన్ విమర్శలు

రాంచీ: ఝూరండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ సతీమణి, జేఎంఎం ఎమ్మెల్యే కల్పనా సోరెన్ భాజపాపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఆ పార్టీని 'పిల్ మాస్టర్ గ్యాంగ్'గా అభివరి?ంచారు. ప్రజలకు అందాల్సిన పథకాలకు కాషాయ పార్టీ అడ్డుగా మారిందని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జేఎంఎం ఏర్పాటు చేసిన ప్రచార ర్యాలీలో పాల్గొన్న ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. 'ఝూర?ండ్ ముఖ్యమంత్రి మైయాన్ సమ్మన్ యోజన' పథకంపై భాజపా పిల్ దాఖలు చేయడాన్ని కల్పనా సోరెన్ ఖండించారు. "మహిళలకు ఆర్థిక సాయం అందించేందుకు ఉద్దేశించిన పథకంపై కోర్టులో భాజపా పిల్ దాఖలు చేసింది. ప్రజలకు ఉపయోగపడే ఏ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టినా దానికి అడ్డు తగులుతోంది. సీఎం హేమంత్ సోరెన్ ప్రవేశపెడుతున్న ప్రతి పథకానికీ ఆటంకం కలిగించే 'పిల్ మాస్టర్ గ్యాంగ్'గా మారింది" అని ఆరోపించారు. గిరిజన వర్గాల డిమాండ్లను భాజపా విస్మరిస్తోందని కల్పన ఆరోపించారు. "గిరిజనులకు వారి సంస్కృతిని గుర్తించేందుకు కోడ్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టాం. కానీ, భాజపా మాత్రం దాన్ని అంగీకరించడం లేదు. వారి సంస్కృతిని కాపాడేందుకు ఇష్టపడడం లేదు. ఝూర?ండ్‌ను సీఎం హేమంత్ సోరెన్ మాత్రమే కాపాడగలరు. రాష్ట్రంలోని కొన్ని గిరిజన జాతులను రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్లో చేర్చాలని కోరుతూ కేంద్రానికి మా ప్రభుత్వం లేఖ రాసింది. దాన్ని వారు తిరస్కరించారు. గిరిజనుల హక్కులను కాపాడేంత వరకు హేమంత్ సోరెన్ నేతృత్వంలోని ప్రభుత్వం పోరాడుతూనే ఉంటుంది" అని కల్పనా సోరెన్ పేర్కొన్నారు.

# కేంద్రానికి మంత్రి సత్యకుమార్ లేఖ.. ఏపీలో ఆ ప్రాజెక్టు చేపట్టాలంటూ వినతి



అమరావతి: సత్యసాయి జిల్లా ధర్మవరంలో "హ్యాండ్లూమ్ క్లస్టర్" ఏర్పాటుకు సత్వరం చర్యలు చేపట్టాలని కేంద్ర జౌళి, చేనేత శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌కు ఏపీ ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ లేఖ రాశారు. శతాబ్దాలుగా చేనేత రంగానికి ముఖ్యంగా పట్టుచీరెల ఉత్పత్తికి ఈ ప్రాంతం ప్రసిద్ధి గాంచిందని మంత్రి లేఖలో పేర్కొన్నారు. హ్యాండ్లూమ్ క్లస్టర్ ఏర్పాటుకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డిపిఆర్)ను లేఖకు జత చేసినట్లు మంత్రి తెలిపారు. దాన్ని పరిశీలించి చర్యలు చేపట్టాలని ఆయన కేంద్ర మంత్రిని కోరారు. అత్యుత్తమ నాణ్యతతో కూడిన చేనేత, పట్టు చీరెల తయారీ నిపుణులకు ధర్మవరం పుట్టినిల్లని సత్యకుమార్ లేఖలో వివరించారు. ఆధునిక యాంత్రిక యుగంలో పవర్లూమ్స్ విపరీతంగా పెరిగిపోతుండటంతో ధర్మవరం సంప్రదాయ పట్టు చీరెల తయారీ రంగం అనేక సవాళ్లు ఎదుర్కొంటోందని మంత్రి తెలిపారు.

దీంతో ఈ రంగంపై ఆధారపడిన వారి ఆదాయం గణనీయంగా తగ్గిపోతూ ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతున్నారని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. సవాళ్ల ఊబిలో చిక్కుకున్న ధర్మవరం చేనేత, పట్టు చీరెల ఉత్పత్తి రంగాన్ని గాడిలో పెట్టేందుకు తాను పంపుతున్న డీపీఆర్‌లో పలు ప్రతిపాదనలు చేసినట్లు కేంద్ర మంత్రికి సత్యకుమార్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని సత్యసాయి జిల్లావ్యాప్తంగా దాదాపు 28,500కుటుంబాలు, ప్రత్యేకంగా ధర్మవరం ప్రాంతంలో 12,800 కుటుంబాలు చేనేత రంగంపై ఆధారపడి మనుగడ సాగిస్తున్నాయని మంత్రి చెప్పారు. అందువల్ల చేనేత కార్మికుల కుటుంబాలను ఆర్థికంగా ఆదుకునేందుకు, ఈ రంగంలో తగిన పోటీ తత్వాన్ని ప్రోత్సహించేందుకు తాను ప్రతిపాదించిన చర్యలు ఉపయోగపడతాయని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. దాదాపు రూ.30కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదిస్తున్న ధర్మవరం హ్యాండ్లూమ్ క్లస్టర్ ఏర్పాటులో 80శాతం మేర నిధులు (సుమారు రూ.24కోట్లు) కేంద్రం భరిస్తే, మిగిలిన 20 శాతం నిధులు (రూ.6కోట్లు)ను ఏపీ ప్రభుత్వం భరించేందుకు సిద్ధంగా ఉన్నట్లు లేఖలో వివరించారు. హ్యాండ్లూమ్ క్లస్టర్‌తో అనేక ప్రయోజనాలు, ఎన్నో కుటుంబాలు ఆధారపడే అవకాశం ఉన్నందున డీపీఆర్‌ను పరిశీలించి తదుపరి చర్యలు చేపట్టాలని కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్‌కు మంత్రి సత్యకుమార్ యాదవ్ విజ్ఞప్తి చేశారు.

# దువ్వాడ.. దివ్వెల సంచలన నిర్ణయం.. అప్పటివరకూ కలిసే ఉంటాం..



శ్రీకాకుళం: తిరుమలలో తాము వివాహం చేసుకున్నట్లు వస్తున్న వార్తలను వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ఆయన ప్రియురాలు దివ్వెల మాధురి ఖండించారు. తాము వివాహం చేసుకోలేదని, కొంత మంది పని గట్టుకుని సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని దువ్వాడ శ్రీనివాస్ మండిపడ్డారు. తిరుమల బ్రహ్మోత్సవాల సందర్భంగా ఇవాళ(సోమవారం) ఉదయం తిరుమలకు వెళ్లామని, ఆ ఫొటోలను పెట్టి తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. తనకు, తన భార్య దువ్వాడ వాణికి సంబంధించిన అంశాలు ఇంకా కోర్టులోనే ఉన్నాయని, కోర్టు తీర్పు అనంతరం పెళ్లిపై నిర?యం ప్రకటిస్తానని శ్రీనివాస్ చెప్పారు. దువ్వెల మాధురి సంబంధించి కూడా ఆమె భర్తతో కేసు నడుస్తోందని, అది ఓ కొలిక్కి వచ్చాక పెళ్లి గురించి ప్రకటిస్తామని చెప్పారు. తాము గతంలోనూ తిరుమలకు వచ్చామని, ఇవాళ కూడా దర్శనం కోసమే వచ్చినట్లు దువ్వెల మాధురి తెలిపారు. ఇద్దరికి విడాకులు వచ్చిన తర్వాత వివాహం చేసుకుంటామని ఆమె తేల్చి చెప్పారు. అప్పటి వరకూ ఇద్దరం కలిసే జీవిస్తామని స్పష్టం చేశారు. అయితే తమ పెళ్లి జరిగిపోయిందంటూ వచ్చే ప్రచారాలను నమ్మొద్దని మాధురి కోరారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలి నియోజకవర్గం వైసీపీ మాజీ ఇన్‌ఛార్జ్, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ కుటుంబ విభేదాల అనంతరం చాలా రోజుల తర్వాత మీడియా ముందుకు వచ్చారు. తన ప్రియురాలు మాధురితో కలిసి ఇవాళ ఉదయం తిరుమలకు వచ్చారు. వారిద్దరూ తిరుమల కొండపై మీడియాకు ఫోజులిచ్చారు. కొన్ని రోజులుగా తన భార్యతో వివాదం కారణంగా దువ్వాడ శ్రీనివాస్ సైలెంట్ అయిపోయారు. దివ్వెల మాధురితో ఆయన సన్నిహితంగా ఉండడం, ఆస్తి వివాదాలతో వారి కుటుంబం వివాదం రోడ్డెక్కిన సంగతి తెలిసిందే. సుమారు నెల రోజుల తర్వాత మళ్లీ తన ప్రియురాలు మాధురితో కలిసి తిరుమల కొండపై దువ్వాడ కనిపించారు. ఉదయం బ్రేక్ దర్శనం సమయంలో మాధురితో కలిసి శ్రీవారిని ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు మీడియాకు ఫోజులిచ్చారు.

అయితే ఆ ఫొటోలను సోషల్ మీడియాలో తిప్పుతూ తాము పెళ్లి చేసుకున్నట్లు తప్పుడు వార్తలు ప్రచారం చేస్తున్నారంటూ వారిద్దరూ మీడియా ముందుకు వచ్చారు. పెళ్లి వార్తలను ఖండించారు. తమ పెళ్లిపై స్పష్టమైన ప్రకటన చేశారు.

# జగన్.. దమ్ముంటే జమ్మలమడుగులో పోటీ చెయ్: ఆదినారాయణరెడ్డి



జమ్మలమడుగు: వైకాపా అధ్యక్షుడు జగన్‌కు దమ్ముంటే జమ్మలమడుగులో తనపై పోటీ చేయాలని జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి సవాల్ విసిరారు. స్థానిక వైకాపా నాయకులు తనకు ఏమాత్రం సరితూగరని అన్నారు. వైకాపా నేతలు రామసుబ్బారెడ్డి, సుధీర్‌రెడ్డి ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. తెదేపా నేత భూపేష్‌రెడ్డితో కలిసి జమ్మలమడుగులో మెగా జాబ్ మేళాను ఆదినారాయణ రెడ్డి ప్రారంభించారు. సంక్రాంతి నాటికి రాజోలి జలాశయ నిర్మాణం, గండికోట ముంపు పరిహారం, టిడ్కో ఇళ్ల పంపిణీ చేసేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వ స్థలాలను స్థానిక వైకాపా నాయకులు కబ్జా చేశారని, దొంగ రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారని ఆరోపించారు. వాటన్నింటినీ బట్టబయలు చేస్తామని చెప్పారు.

# పుంగనూరు బాలిక కుటుంబానికి చంద్రబాబు ఫోన్.. వారిని వదిలిపెట్టబోమని హామీ..

చిత్తూరు: పుంగనూరులో ఆస్పియా(7) అనే చిన్నారిని హత్య చేసి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో పడేయడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. అయితే ఘటనపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విచారం వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు దురదృష్టకమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబసభ్యులను సీఎం ఫోన్‌లో పరామర్శించారు. బాలిక తండ్రితో మాట్లాడిన చంద్రబాబు ధైర్యంగా ఉండాలని చెప్పారు. ఏపీ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ముగ్గురు నిందితులను చిత్తూరు జిల్లా పోలీసులు అదుపులోకి తీసుకున్నారని, చట్టప్రకారం వారికి కఠిన శిక్ష విధిస్తామని హామీ ఇచ్చారు. ఎవరూ అధైర్య పడొద్దని బాధిత కుటుంబానికి సీఎం చంద్రబాబు ధైర్యం చెప్పారు.

**నిందితులను ఉపేక్షించం..** మరోవైపు పుంగనూరు వెళ్లి బాధిత కుటుంబాన్ని ఏపీ హెూంమంత్రి అనిత, రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి పరామర్శించారు. ఎన్డీయే ప్రభుత్వం అండగా ఉంటుందని వారికి భరోసా ఇచ్చారు. ధైర్యం కోల్పోవద్దని చెప్పి ఫోన్ ద్వారా సీఎం చంద్రబాబుతో మాట్లాడించారు. అనంతరం మంత్రులు మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో మహిళలు, చిన్నారులపై దాడులు, హత్యలు, లైంగిక వేధింపులు, అత్యాచారాలు, హత్యాచారాలు వంటి ఘటనల విషయంలో నిందితులను ఉపేక్షించేది లేదని హెూంమంత్రి అనిత హెచ్చరించారు. ఆస్పియా హత్య చాలా దారుణమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. హత్య కేసును జిల్లా పోలీసులు ఛేదించారని, ఈ ఘాతుకానికి పాల్పడిన ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారని అనిత తెలిపారు. చిన్నారి అదృశ్యమైందని ఫిర్యాదు అందిన వెంటనే అప్రమత్తమైన పోలీసులు 12బృందాలుగా ఏర్పడి బాలిక కోసం గాలించారని ఆమె చెప్పారు.

## 20 ఏళ్లు అయినా అదే అందం..!

మిల్కీ బ్యూటీ తమన్నా టాలీవుడ్ లో శ్రీ సినిమాతో ఎంట్రీ ఇచ్చి దాదాపుగా 20 ఏళ్లు అవుతుంది. ఇప్పటి వరకు ఆమె అందం ఏమాత్రం తగ్గలేదు అంటూ తాజా ఫోటోలను చూస్తే అర్థం అవుతుంది. మొదటి సినిమా తో పోల్చితే ఇప్పుడు అంతకు మించి అందంగా ఉంది అంటూ కామెంట్స్ వస్తున్నాయి. సోషల్ మీడియాలో రెగ్యులర్ గా ఈ అమ్మడు అందాల ఆరబోత ఫోటోలు షేర్ చేయడం ద్వారా ఎక్కువగా పాపులారిటీని సొంతం చేసుకుంది. సోషల్ మీడియాలో ఈమె అందాల ఆరబోత ఫోటోలు షేర్ చేయడం ద్వారా ఎక్కువ సినిమాల్లో ఆఫర్లు దక్కించుకుంటూ దూసుకు పోతుంది అంటూ కామెంట్స్ చేస్తున్న వారు చాలా మంది ఉన్నారు. బాహుబలి తర్వాత తమన్నా పనైపోయిందని అనుకుంటున్న సమయంలో ఎప్పటికప్పుడు తన క్రేజ్ ను, తన స్టార్‌డంను నిరూపించుకుంటూ వరుసగా సినిమాల్లో నటిస్తూ వస్తుంది. తాజాగా ఈ అమ్మడు స్త్రీ 2, వేద సినిమాల్లో నటించడం ద్వారా మరింత పాపులారిటీని సొంతం చేసుకుంది. ఆ రెండు సినిమాల్లోనూ స్పెషల్ అప్పియరెన్స్ అయినప్పటికీ ఆ సినిమాల క్రెడిట్ ఈమె స్థాయిని మరింతగా పెంచాయి అనే అభిప్రాయం వ్యక్తం



అవుతోంది. తాజాగా ఈ అమ్మడు సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటోలు చూసి చాలా మంది ఫ్యాన్స్ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇండస్ట్రీలో అడుగు పెట్టి 20 ఏళ్లు కావస్తోంది, నాలుగు పదుల వయసుకు చేరువ అయినా ఇంతటి అందం ఏంట్రా బాబు అంటూ ప్రతి ఒక్కరూ షాక్ అవుతున్నారు. స్టార్ హీరోలకు ఇప్పటికీ సరి జోడీ అన్నట్లుగా అందంగా ఉన్న తమన్నా ను స్టార్ హీరోలు ఎక్కువగా పరిగణలోకి తీసుకోకున్నా ఎప్పుడు బిజీగానే ఉంటుంది. ఈ మధ్య కాలంలో ఈమె తెలుగు లో కంటే ఎక్కువ ఇతర భాషల్లో కనిపిస్తూ ఉంది. హీరోయిన్ గానే కాకుండా ఇతర ముఖ్య పాత్రల్లో, ఐటెం సాంగ్స్ లో నటించడం ద్వారా ఈ అమ్మడు రెగ్యులర్ గా వైరల్ అవుతూనే ఉంది. ఇప్పుడు అందమైన ఫోటోలతో వైరల్ అవుతోంది. మిల్కీ బ్యూటీ తమన్నా మెరుపుల డ్రెస్ లో మెరుపులు మెరిపిస్తోంది అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు.

క్లీ వేజ్ షో తో అదరగొట్టిన ఈ అమ్మడు పాతికేళ్ల పడుచు అమ్మాయి మాదిరిగా ఉంది అంటూ కామెంట్స్ వస్తున్నాయి. నెట్టింట ఈ అమ్మడు షేర్ చేస్తున్న ఫోటోలు, వీడియోలు మరోసారి ఆమె స్థాయిని పెంచాయి అనడంలో సందేహం లేదు. టాలీవుడ్ లో సుదీర్ఘ ఇన్నింగ్స్ తో సినిమాలు చేసిన హీరోయిన్స్ చాలా తక్కువ మంది ఉన్నారు. వారిలో మిల్కీ బ్యూటీ తమన్నా ఒకరు. ప్రస్తుతం టాలీవుడ్ లో పెద్ద సినిమాలు చేయడం లేదు, కానీ భవిష్యత్తులో వరుసగా సినిమాలు చేస్తుందనే నమ్మకం ను వ్యక్తం చేస్తున్నారు ఆమె ఫ్యాన్స్. మరి ఫ్యాన్స్ కోరుకున్నట్లుగా తమన్నా మళ్లీ బిజీ అయ్యేనా చూడాలి.

## శోభిత లంచ్ బాక్స్ ఎప్పుడూ వెంటే!

సెలబ్రిటీ లైఫ్ ఎలా ఉంటుందన్నది చెప్పాల్సిన పనిలేదు. నిత్యం బిజీ షెడ్యూల్ తో ఉంటారు. ఒకే రోజు రెండు..మూడు షూటింగ్ ల్లో పాల్గొంటారు. ఒక్కోసారి మూడు షిఫ్టులు పనిచేస్తుంటారు. ఉదయం ముంబైలో ఉంటే? సాయంత్రం చెన్నై, హైదరాబాద్లో ఉంటారు. ఈ నేపథ్యంలో ఇంటి పుడ్ కి దూరమవ్వక తప్పదు. హెూటల్స్, రెస్టారెంట్లపైనే ఆధారపడుతుంటారు. ఎంత 5 స్టార్..7 స్టార్ హెూటల్స్ లో తిన్నా? ఇంటిపుడ్ కమ్మదనం ఎక్కడ దొరుకుతుంది. అందుకే శోభిత మాత్రం స్ట్రిక్ట్ గా ఇండిపుడ్ నే తీసుకెళుతుందిట. స్థానికంగా ఉంటే ఇంట్లో నుంచే లంచ్ బాక్స్ తీసుకెళ్తుందిట. బయట ప్రదేశాలకు వెళ్లినా? ఎక్కువ రోజులు షూట్ ఉంటే మాత్రం తన పుడ్ తానే ప్రిపేర్ చేసుకుంటుందిట. వీలైనంత వరకూ లంచ్ బాక్స్ ఎప్పుడూ తన కూడానే ఉంటుందిట. అనవసరమైన పుడ్ తినడం..బయట తినడం వంటి వాటి జోలికి వెళ్లదుట. ఇలా ఉ



ండటం చిన్న విషయం కాదు. లంచ్ బాక్స్ క్రమం తప్పకుండా తీసుకెళ్లడం అంటే? ఆషామాషీ కాదు. ఓ ప్రణాళిక ఉంటే తప్ప సాధ్య పడదు. ఎంతో మంది హీరోయిన్లు ఉన్నారు? శోభిత లా లంచ్ బాక్స్ ఆన్ సెట్స్ కి తీసుకెళ్లే హీరోయిన్లు ఎంత మంది ఉంటారు? నార్త్ నుంచి టాలీవుడ్ కి వచ్చిన హీరోయిన్లు అంతా పుడ్ విషయంలో ఇబ్బంది పడుతుంటారు. అందుకే స్టార్ హీరోలు అప్పుడప్పుడు హీరోయిన్లకు లంచ్ బాక్సులు పంపిస్తుంటారు. చిరంజీవి, ప్రభాస్, ఎన్టీఆర్ లాంటి స్టార్ హీరోలతో షూటింగ్ ఉందంటే? హీరోయిన్లకు వాళ్ల ఇళ్ల నుంచే లంచ్ బాక్సులు వెళ్తుంటాయి. తమన్నా, కీర్తి సురేష్, శ్రుతిహాసన్, కాజల్ అగర్వాల్ ఇలా స్టార్ భామలంతా తమ హీరోల ఇంట రుచులు చూసిన వారే కదా.




## విశ్వం ట్రైలర్.. యాక్షన్, కామెడీ ఫుల్లుగా!




టాలీవుడ్ మ్యాచో స్టార్ గోపీచంద్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ విశ్వం. శ్రీను వైట్ల దర్శకత్వం వహిస్తున్న ఆ సినిమాలో కావ్య థాపర్ హీరోయిన్ గా నటిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, చిత్రాలయం స్టూడియోస్ బ్యానర్స్ పై టీజీ విశ్వప్రసాద్, వేణు దోనెపూడి గ్రాండ్ గా నిర్మిస్తున్నారు. దసరా కానుకగా ప్రేక్షకుల ముందుకు రానున్న విశ్వం మూవీపై అటు గోపీచంద్.. ఇటు శ్రీనువైట్ల భారీగా హెూప్స్ పెట్టుకున్నారు. మంచి హిట్ అందుకోవాలని చూస్తున్నారు. సినిమాను అక్టోబర్ 11వ తేదీన రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే వెల్లడించారు. వరుసగా ప్రమోషనల్ కంటెంట్ ను రివీల్ చేస్తూ.. సినిమాపై అంచనాలు క్రియేట్ చేస్తున్నారు. రిలీజ్ డేట్ దగ్గర పడుతుండటంతో ప్రమోషన్స్ లో స్పీడ్ పెంచారు. ఇప్పటికే టీజర్ తో పాటు సాంగ్స్ ను రిలీజ్ చేయగా.. సూపర్ రెస్పాన్స్ వచ్చింది. ఇప్పుడు అదే జోష్ తో థియేట్రికల్ ట్రైలర్ ను ఆదివారం విడుదల చేశారు. 'బోర్డర్ దగ్గర టెర్రరిస్టులను తుడిచి పెడుతుంటే.. నేను ఈ దేశం నుంచి టెర్రరిస్టులను పుటిస్తున్నాను.. ఇండియా మొత్తం దీపావళి జరగబోతోంది' అంటూ ఓ ఉగ్రవాది బెదిరింపు డైలాగ్ తో ట్రైలర్ ప్రారంభమైంది. ఆ తర్వాత సరిహద్దులో విధులు నిర్వర్తించే జవాన్ గా గోపీచంద్ పరిచయమయ్యారు. అదే సమయంలో స్టోరీని చిన్నగా రివీల్ చేస్తూ.. ప్రముఖ నటీనటులను మేకర్స్ చూపించారు. కామెడీ సీన్స్ హిలేరియస్ గా ఉన్నాయి. దీంతో ట్రైలర్ ఫన్నీ మోడ్ లోకి వెళ్లింది. అయితే గోపీచంద్.. రెండు విభిన్నమైన వేరియేషన్స్ ను చూపించడంతో ట్రైలర్ ఓ రేంజ్ లో సాగింది. కావ్య థాపర్ తో హీరో లవ్ స్టోరీని కూడా మేకర్స్ చూపించారు. బ్లాక్ బస్టర్ హిట్ వెంకీ మూవీలోలా వెన్నెల కిషోర్, నరేష్ మధ్య రైలు ఎపిసోడ్ తళుక్కుమంది. చివరలో యాక్షన్ సీక్వెన్స్ తో ట్రైలర్ ను కట్ చేశారు మేకర్స్. అందులో గోపీచంద్ అదరగొట్టారు. స్టైలిష్ మేకోవర్ లో కనిపించారు. కావ్య థాపర్ గ్లామరస్ గా కనిపిస్తూ సందడి చేశారు. రైలు ఎపిసోడ్ లో గణేష్, నరేష్, ప్రగతి, పృథ్వీ, సునీల్, రాహుల్ రామకృష్ణ తమ తమ పాత్రల్లో ఆకట్టుకున్నారు. విశ్వం ట్రైలర్ లో డైరెక్టర్ శ్రీను వైట్ల మార్క్ క్లియర్ గా కనిపించింది. యాక్షన్ తో పాటు కామెడీ సినిమాలో పుష్కలంగా ఉన్నట్లు తెలుస్తోంది.

టెర్రరిజం కాన్సెప్ట్ ను కూడా మేకర్స్ యాడ్ చేసినట్లు అర్థమవుతోంది. వి.గుహన్ సినిమాటోగ్రఫీ, చేతన్ భరద్వాజ్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అద్భుతంగా ఉంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, చిత్రాలయం స్టూడియోస్ బ్యానర్ల ప్రొడక్షన్ వాల్యూస్ రిచ్ గా కనిపిస్తున్నాయి. మరి విశ్వం ట్రైలర్ ను మీరు కూడా చూసేయండి.

## సోషల్ మీడియాలో ఆయుధ పూజ హడావిడి



ఎన్టీఆర్, జాన్వీ కపూర్ జంటగా కొరటాల శివ దర్శకత్వంలో రూపొందిన దేవర సినిమా ఇటీవలే ప్రేక్షకుల ముందుకు వచ్చింది. భారీ ఓపెనింగ్స్ ను దక్కించుకున్న ఈ సినిమా వసూళ్లు రూ.500 కోట్లకు చేరువ అయ్యాయి. వీకెండ్ పూర్తి అయ్యే వరకు మరింత భారీగా వసూళ్లు నమోదు అయ్యే అవకాశాలు ఉన్నాయి. దసరా సెలవులు సినిమాకు కలిసి వస్తున్నాయి. ఏపీ, తెలంగాణలో మళ్లీ మంచి వసూళ్లు వస్తున్నట్లుగా బాక్సాఫీస్ వర్గాల ద్వారా సమాచారం అందుతోంది. ఈ మధ్య కాలంలో ఎన్టీఆర్ సోలో హీరోగా సినిమా రాకపోవడంతో ఫ్యాన్స్ చాలా ఆసక్తిగా ఎదురు చూశారు. వారికి విందు భోజనం అన్నట్లుగా సినిమా ఉండటంతో భారీ వసూళ్లు నమోదు అయ్యాయి. దేవర సినిమా విడుదలకు ముందే ఫియర్ సాంగ్, చుట్టమల్లే, దావుదీ పాటలను విడుదల చేయడం జరిగింది. ఆయుధ పూజ పాటను సైతం విడుదల చేయాలని భావించినా కొన్ని కారణాల వల్ల ఆలస్యం అయింది. సినిమా విడుదలకు ముందు రోజు ఆయుధ పూజ సాంగ్ ప్రేక్షకుల ముందుకు వచ్చింది. సినిమా విడుదల తర్వాత ఆ పాటకు మరింత పాపులారిటీ దక్కింది. ఈ మధ్య కాలంలో ఆయుధ పూజ పాట ఎక్కడ చూసినా హడావిడి చేస్తోంది. సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ట్రెండ్ అవుతున్న ఈ పాటకు ఎక్కువ శాతం మంది ఫ్యాన్స్, ప్రేక్షకులు రీల్స్ చేస్తున్నారు. రీల్స్ కి మంచి స్పందన దక్కుతోంది. ఆయుధ పూజ పాట గురించి మొదటి నుంచి భారీ ప్రచారం జరిగింది. ఆ ప్రచారం కి తగ్గట్లుగానే పాట ఉందని, సినిమాలో ఈ పాట అత్యంత కీలకం అనడంలో సందేహం లేదు. ఎన్టీఆర్ మాస్ స్టెప్పులు, చిత్రీకరణ ఇలా ప్రతి ఒక్కటి వావ్ అనిపించేంతగా ఉన్నాయి. అందుకే దేవర సినిమా చూసిన ప్రేక్షకులు ఆయుధ పూజ పాటకు వావ్ అంటున్నారు. సినిమాలోనే కాకుండా యూట్యూబ్ లోనూ ఈ పాటకు తెగ స్పందన వస్తోంది. పాటలో ఎన్టీఆర్ ను చూపించిన తీరుకు విమర్శకులు సైతం ప్రశంసలు కురిపిస్తున్నారు. ఫ్యాన్స్ మాత్రమే కాకుండా ప్రతి ఒక్కరు పాటను ఎంజాయ్ చేస్తున్నారు. ఎన్టీఆర్ దేవర సినిమాలో డ్యుయెల్ రోల్ లో నటించిన విషయం తెల్సిందే. చాలా కాలం తర్వాత ఎన్టీఆర్ డ్యుయల్ రోల్, అది కాకుండా తండ్రి కొడుకులుగా నటించడం ద్వారా ఫ్యాన్స్ కి కన్నుల విందు అన్నట్లుగా నిలిచింది. జాన్వీ కపూర్ అందాల ఆరబోత ఫోటోలు సోషల్ మీడియాలు ముందే వైరల్ అయ్యాయి. సినిమా విడుదల తర్వాత ఆమె అందం గురించి తెగ ప్రచారం జరుగుతోంది. కొరటాల శివ దర్శకత్వంలో ఈ సినిమాను నందమూరి కళ్యాణ్ రామ్, సుధాకర్ మిక్కిలినేని దా దాపు రూ.350 కోట్ల బడ్జెట్ తో నిర్మించారు. నాగ వంశీ తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమాను భారీ ఎత్తున విడుదల చేశారు, యూఎస్ లో దాదాపు ఆరు మిలియన్ డాలర్ల వసూళ్లు చేసి సరికొత్త రికార్డ్ ను నమోదు చేసింది అంటూ ఫ్యాన్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## కొత్త హెయిర్ స్టైల్.. క్రేజీ శారీ.. అనసూయ అదుర్స్!

ఎన్ని మోడ్రన్ డ్రెస్సులు వేసినా.. చీరలో తెలుగు అమ్మాయిలు భలేగా ఉంటారు! ఎంతో అందంగా కనిపిస్తూ కనువిందు చేస్తారు! అందుకే చీరలకు అంతలా క్రేజ్ ఉంటుంది. ఏ మోడల్ శారీ అయినా పర్లేదు.. అందులో ఉండే అందమే వేరు! అయితే యాంకర్ కమ్ నటి అనసూయ చీర కడితే.. అందమే అసూయ పడేలా ఉంటుంది. చీరలో ఆమె అందాల ఆరబోతకు ప్రత్యేక ఫ్యాన్ బేస్ ఉంది. ఎంతో మంది ఆమె ఫాలోవర్స్.. అనసూయ శారీ మూమెంట్స్ కోసం వెయిట్ చేస్తుంటారు. ఇప్పుడు వారి కోసమే అనసూయ కొత్త పిక్స్ షేర్ చేశారు. పర్పుల్ కలర్ చీరలో దిగిన ఫోటోలను పోస్ట్ చేశారు. అందులో అనసూయ ఎంతో అందంగా కనిపిస్తున్నారు. కొత్త హెయిర్ స్టైల్ తో క్రేజీగా మైమరపిస్తున్నారు. తన లుక్స్ తో మాయ చేస్తున్నారు. రకరకాల పోజులతో



ఆకట్టుకుంటున్నారు. షైనింగ్ స్కిన్ టోన్ తో అట్రాక్టివ్ గా కనిపిస్తున్నారు. అదే సమయంలో చక్కటి ఫిలాసఫీని రాసుకొచ్చారు. ఏపీ నర్సంపేటలోని ఓ షాప్ ఓపెనింగ్ కు ముద్దుగుమ్మ.. ఇలా రెడీ అయ్యి వెళ్లారు. "వయసు పెరిగే కొద్దీ.. జ్ఞానం ఎక్కువ అయ్యి కొద్దీ.. నా ఫోకస్ అంతా నేను ఏ విధమైన మహిళగా ఉండాలి.. ఇతరులకు ఏ విధంగా ఆదర్శంగా ఉండాలనే అంశం మీద ఉంది. నన్ను నేను జడ్జ్ చేసిన ప్రతిసారి కూడా ఎదుట వ్యక్తులను అర్థం చేసుకోవాలని నిర్ణయించుకున్నాను. నన్ను షేమింగ్ చేసిన ప్రతిసారీ నా మనసును నిశ్చలంగా ఉంచుకోవడానికి కృషి చేశాను. ఎవరైనా నన్ను రిజెక్ట్ చేస్తే యాక్సెప్ట్ చేయడం నేర్చుకున్నాను. నా ఎక్స్పీరియన్సెస్ నన్ను మార్చాయి" అంటూ రాసుకొచ్చారు. అదే సమయంలో తాను హర్ట్ అయిన ప్రతిసారి కూడా ప్రజలు తనను హర్ట్ చేస్తున్నారని అనుకోవడం లేదని అనసూయ తెలిపారు. వాళ్ల గురించి ఆలోచించి తానే తనను హర్ట్ చేసుకుంటున్నట్టు గుర్తించానని చెప్పారు. ప్రస్తుతం అనసూయ కొత్త పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఆమె పిక్స్ సూపర్ గా ఉన్నాయని కొందరు నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. ఫిలాసఫీ అదిరిపోయిందని మరికొందరు చెబుతున్నారు. ఇన్స్పిరేషనల్ గా ఉందని ఇంకొందరు అంటున్నారు. అయితే బుల్లితెరపై యాంకర్ గా ఓ వెలుగు వెలిగిన ముద్దుగుమ్మ.. సడెన్ గా సినిమాల్లోకి వచ్చేశారు. స్మాల్ స్క్రీన్ కు పూర్తిగా గుడ్ బై చెప్పారు. ఇప్పుడు పలు షోస్ లో మళ్లీ కనిపిస్తున్నారు. బుల్లితెర ప్రియులను అలరిస్తున్నారు. అదే సమయంలో వరుస సినిమా అవకాశాలు అందుకుంటున్నారు. మేకర్స్ కు ఫేవరేట్ యాక్ట్రెస్ గా మారిపోయారు! త్వరలో రానున్న పుష్ప-2 మూవీలో కీలక పాత్ర పోషిస్తున్నారు. మరి అందులో ఆమె రోల్ ఎలా ఉంటుందో వేచి చూడాలి.

## ముంబైలో కాకలు పుట్టిస్తున్న తెలుగు నటి బర్త్‌డే పార్టీ

అవును.. ముంబైలో తెలుగు నటి కాకలు పుట్టిస్తోంది. సెలబ్రిటీ ప్రపంచం అంతా తన వైపే తిరిగి చూసేలా చేస్తోంది. గత కొన్నేళ్లుగా ముంబైలోనే నివాసం ఉంటూ అక్కడ కెరీర్ కోసం ప్రయత్నిస్తున్న ప్రముఖ తెలుగు నటి స్పెషల్ బర్త్ డే పార్టీ ఇప్పుడు తెలుగు మీడియా సర్కిల్స్ లో హాట్ టాపిక్ గా మారింది. ఇంతకీ ఎవరా తెలుగు నటి? అంటే.. అది మరెవరో కాదు.. టాలీవుడ్ ట్యాలెంటెడ్ నటి, హెూస్ట్ కం నిర్మాత మంచు లక్ష్మి ప్రసన్న గురించే ఇదంతా. ఇటీవల ముంబైలో నివాసం ఉంటున్న లక్ష్మి మంచు అక్కడ తన స్నేహితులతో ఎంతో కంఫర్ట్ గా ఉందని, ముంబై తనకు సొంత ఇల్లు లాగా ఉందని పలుమార్లు వెల్లడించారు. స్నేహితులతో ఉంటే తన ఇంట్లో ఉన్నట్టేనన్న భావనను కనబరిచారు. దీంతో ముంబై స్నేహాలు తనకు బిగ్ రిలీఫ్ అని అందరికీ అర్థమైంది. ఇప్పుడు ముంబైలో లక్ష్మి మంచు పుట్టినరోజు పార్టీ నుంచి చిల్లింగ్ ఫోటోలు కొన్ని అంతర్జాలంలోకి వచ్చాయి. ఇందులో మాజీ విశ్వసుందరి సుస్మితా సేన్, ప్రగ్య జైశ్వాల్, రకుల్ ప్రీత్ సింగ్ ఆమె భర్త జాకీ



భగ్నానీ కనిపించారు. లక్ష్మీ మంచు ఈవెంట్లో స్టార్లు పరిమితంగానే ఉన్నా కానీ హంగామా మాత్రం కొట్టొచ్చినట్టు కనిపించింది. ఇప్పుడు ఈ వేడుక నుంచి ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. పార్టీలో షైనీ ఎరుపు రంగు ఆఫ్ షోల్డర్ దుస్తుల్లో లక్ష్మి మంచు ధగధగా మెరిసిపోగా, రకుల్ సాధారణ డిజైనర్ దుస్తులను ధరించింది. సుస్మితా సేన్ లక్ష్మి మంచు కలిసి ఉన్న ఫోటోలు యూట్యూబర్ నిఖిల్ విజయేంద్ర సింహాతో సెలబ్రేషన్ కి సంబంధించిన ఫోటోలు ఇంటర్నెట్ లో వైరల్ అయ్యాయి. లక్ష్మి మంచు అక్టోబర్ 8న తన పుట్టినరోజును జరుపుకుంటుంది. అయితే ఈ సంవత్సరం ముంబైలోని తన స్నేహితుల కోసం ముందస్తుగా ప్రత్యేక పార్టీని నిర్వహించినట్లు తెలుస్తోంది. ముంబై పార్టీలు లక్ష్మికి కొత్తేమీ కాదు. గతంలోను తన పుట్టినరోజు వేడుకలను ముంబైలో ఘనంగా జరుపుకుంది. అప్పట్లో శ్రీయా శరణ్, తాప్సీ పన్ను, సుస్మితా సేన్, రకుల్ ప్రీత్ సింగ్, రానా దగ్గుబాటి సహా పలువురు ప్రముఖులు హాజరయ్యారు.




## హైదరాబాద్ అంటేనే రాక్స్.. లేక్స్.. పార్క్స్: భట్టి విక్రమార్క

హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలపై అపోహలు సృష్టిస్తున్నారని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అసహనం వ్యక్తం చేశారు. తప్పుడు ఆరోపణలు చేస్తూ.. ప్రతిపక్షాలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రజలకు మేలు చేయాలనే ఆలోచనే తప్ప.. తమకు ఎలాంటి వ్యక్తిగత అజెండా లేదన్నారు. సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో భట్టి మాట్లాడారు. 2014 నుంచి 2023 మధ్య కాలంలో హైదరాబాద్, చుట్టు పక్క ప్రాంతాల్లో ఆక్రమణకు గురైన చెరువుల వివరాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులతో కలిసి భట్టి వివరించారు.

"ఇది ప్రజా ప్రభుత్వం.. పారదర్శకమైన ప్రభుత్వం. ప్రభుత్వంపై ప్రతిపక్షాలు నిరాధార ఆరోపణలు చేస్తున్నాయి. హైదరాబాద్‌లోని చెరువులు ప్రజల ఆస్తి. హైదరాబాద్ అంటేనే రాక్స్, లేక్స్, పార్క్స్. ఇవి హైదరాబాద్‌ను మరింత ఆకర్షణీయంగా మార్చాయి. నగరంలో గత కొన్నేళ్లుగా చెరువులు మాయం అవుతున్నాయి. మూసీని ఆధునికీకరించాలని గతంలో చాలా ప్రయత్నాలు జరిగాయి. శాటిలైట్ మ్యాప్‌ల ద్వారా చెరువుల ఆక్రమణలను గుర్తిస్తున్నాం. రాష్ట్ర విభజన జరిగే నాటికి ఎన్ని చెరువులు ఉన్నాయి.. ఇప్పుడెన్ని ఉన్నాయి అనే వివరాలు సేకరిస్తున్నాం. హైడ్రాను తీసుకొచ్చింది సీఎం కోసమో, మంత్రుల కోసమో కాదు కదా. చెరువులు అన్యాక్రాంతం కాకుండా కొత్త నిబంధనలు తెచ్చుకున్నాం. చెరువులను భవిష్యత్ తరాలకు అందించాలి." అని భట్టి వివరించారు.

**కూలగొట్టిన ఇళ్ల కంటే మెరుగైనవి ఇస్తున్నాం..** "ఇప్పటికైనా చెరువుల ఆక్రమణ ఆపాలి. మూసీలో మంచినీళ్లు లేకుండా డ్రైనేజీగా మార్చేశాం. గతంలో ఇతర దేశాల్లోనూ నదులు డ్రైనేజీల్లా ఉండేవి.. వాళ్లు మార్చుకున్నారు. ఇతర దేశాలు నదులను ఆస్తులుగా మార్చుకున్నాయి. మూసీ సుందరీకరణకు రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు అవుతుందని ప్రతిపక్షాలు అంటున్నాయి. టెండర్లే పిలవకుండా రూ.లక్షన్నర కోట్లు అవుతుందని ఎలా చెబుతారు? మూసీ సుందరీకరణ అంశంపై ప్రతిపక్షాలు తమ ఆలోచనలు మాకు తెలియజేయాలి. మూసీ పరివాహక ప్రాంత ప్రజలకు ఎవరికీ ఇబ్బంది కలిగించం. ఇళ్లను తొలగించిన బాధితులకు వేరేచోట ఇళ్లు ఇస్తున్నాం. కూలగొట్టిన ఇళ్ల కంటే మెరుగైన ఇళ్లను ఇస్తున్నాం. ప్రజలకు మేలు జరగకూడదనేదే ప్రతిపక్షాల అజెండా. హైదరాబాద్‌ను గ్లోబల్ సిటీగా మార్చేందుకు ప్రతిపక్షాలు సలహాలు ఇవ్వాలి. పరిపాలనలో చిన్న చిన్న పొరపాట్లు జరిగితే సరిదిద్దుకోవడానికి మేం సిద్ధంగా ఉన్నాం" అని భట్టి అన్నారు.




హైదరాబాద్: త్వరలో తెదేపాలో చేరతానని మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి తెలిపారు. పార్టీకి మళ్లీ పూర్వ వైభవం తీసుకొస్తామని చెప్పారు.

హైదరాబాద్‌లో తెదేపా అధినేత, ఏపీ సీఎం చంద్రబాబును ఆయన నివాసంలో తీగల కలిశారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. చంద్రబాబు, తెదేపా వల్లే హైదరాబాద్ అభివృద్ధి జరిగిందన్నారు. తెలంగాణలో తెదేపా అభిమానులు చాలా మంది ఉన్నారని చెప్పారు.

**చంద్రబాబును కలిసిన మాజీ మంత్రి మల్లారెడ్డి :** ఏపీ సీఎం చంద్రబాబును మాజీ మంత్రి మల్లారెడ్డి, ఆయన అల్లుడు, ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి కలిశారు. తన మనవరాలి వివాహానికి చంద్రబాబును ఆహ్వానించినట్లు మల్లారెడ్డి తెలిపారు.




హైదరాబాద్: హైదరాబాద్‌లో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లు గుర్తించేందుకు ఇరిగేషన్, రెవెన్యూ, నేషనల్ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ, స్టేట్ రిమోట్ సెన్సింగ్ సెంటర్, సర్వే ఆఫ్ ఇండియా అధికారులతో హైడ్రా కమిషనర్ రంగనాథ్ సమీక్ష నిర్వహించారు. చెరువులు, ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురికాకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.

ఆక్రమణలకు ఆస్కారం లేకుండా హైడ్రా ఓ ప్రత్యేక యాప్‌ను తీసుకొస్తోంది. అందులోనే ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించేందుకు అవకాశం కల్పించారు. దీని గురించి అధికారులకు ఆయన వివరించారు. ఆక్రమణలు ఎక్కడ జరిగినా క్షణాల్లో హైడ్రాకు తెలిసేలా పటిష్ఠ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు రంగనాథ్ తెలిపారు. చెరువుల పరిరక్షణతోపాటు వాటికి పూర్వవైభవం తీసుకొచ్చేలా హైడ్రా కృషి చేస్తోందని చెప్పారు. ఆక్రమణల తొలగింపు తర్వాత వ్యర్థాలను పూర్తి స్థాయిలో తొలిగించాలని నిరయం తీసుకున్నామన్నారు.

తొలి దశలో ఎర్రకుంట, కూకట్‌పల్లి నల్ల చెరువులో పనులు ప్రారంభించాలని నిరయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.


## సీఎస్ఎంపీని అమృత్ 2.0లో చేర్చండి: కేంద్రానికి సీఎం రేవంత్ విజ్ఞప్తి



దిల్లీ: హైదరాబాద్ సమగ్ర సీవరేజీ మాస్టర్ ప్లాన్‌ను (సీఎస్ఎంపీ) అమృత్ 2.0లో చేర్చాలని సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. దిల్లీ పర్యటనలో ఉన్న ఆయన.. కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో భేటీ అయ్యారు. రూ. 17 వేల కోట్లతో 7,444 కి.మీ మేర సీఎస్ఎంపీకి ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. దీనికి సంబంధించిన డీపీఆర్‌ను ఖట్టర్‌కు అందించారు. సీఎస్ఎంపీని ప్రత్యేక ప్రాజెక్టుగా గుర్తించి నిధులు ఇవ్వాలని కోరారు.

హైదరాబాద్‌లో సరైన మురుగునీటి పారుదల వ్యవస్థ లేదని, మూసీలో మురుగు నీటి శుద్ధి చేసేందుకు రూ.4 వేల కోట్లతో డీపీఆర్ రూపొందించామని రేవంత్ చెప్పారు. దీనికి సంబంధించిన పత్రాలను కూడా కేంద్ర మంత్రికి అందజేశారు. మెట్రో రెండోదశ పనులకు మద్దతివ్వాలని కోరారు. మెట్రో విస్తరణకు కేంద్రం, రాష్ట్రం 50:50 నిష్పత్తిలో వ్యయం చేయాలని కోరారు. త్వరలోనే రెండోదశ మెట్రో డీపీఆర్‌ను అందజేస్తామని తెలిపారు.

## అన్ని పార్టీలను ఒకే వేదికపైకి తీసుకొచ్చేదే 'అలయ్-బలయ్': దత్తాత్రేయ



హైదరాబాద్: అలయ్-బలయ్ ఒక సాంస్కృతిక కార్యక్రమమని.. అన్ని పార్టీలను ఒకే వేదికపైకి తీసుకొచ్చేదని హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. దసరా సందర్భంగా బండారు దత్తాత్రేయ ఏటా నిర్వహించే 'అలయ్-బలయ్' కార్యక్రమానికి సంబంధించి సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో దత్తాత్రేయ మాట్లాడారు. ఈ నెల 13న నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహించే అలయ్-బలయ్ ఏర్పాట్లపైన కమిటీతో చర్చించి పలు సూచనలు చేశారు. "అలయ్-బలయ్ రాజకీయ కార్యక్రమం కాదు. ఈ కార్యక్రమం 19వ వసంతంలోకి అడుగుపెడుతున్నందుకు సంతోషంగా ఉంది. తెలంగాణ ఉద్యమ సమయంలో అన్ని పార్టీలను ఒక వేదికపైకి తీసుకురావడమే లక్ష్యంగా అలయ్-బలయ్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం.

అలయ్-బలయ్ అనేది ఆత్మీయ సమ్మేళనం. తెలంగాణ సాంస్కృతిక సంప్రదాయాలు, ఆహారపు అలవాట్లను ప్రతిబింబించేదే అలయ్ -బలయ్" అని దత్తాత్రేయ వివరించారు.

## ప్రభుత్వంపై అసంతృప్తి ఉంటే నిరసన సెగ మాకు తాకేది: మంత్రి తుమ్మల



హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వంపై అసంతృప్తి ఉంటే నిరసన సెగ తమకు తాకేదని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గాంధీభవన్‌లో నిర్వహించిన 'మంత్రులతో ముఖాముఖి' కార్యక్రమంలో భాగంగా ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తల సమస్యలను ఆయన తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ భారాస, భాజపాపై విమర్శలు చేశారు. "మేం నిత్యం రైతులతో తిరుగుతున్నాం. ప్రభుత్వంపై అసంతృప్తి ఉంటే మాకు నిరసన సెగ తాకేది.

అధికారం కోల్పోయిన బాధ ఒకరిది.. అధికారంలోకి రావాలనే బాధ మరొకరిది. రైతు రుణమాఫీ ప్రధాని మోదీకి కనిపించడం లేదా?" అని తుమ్మల వ్యాఖ్యానించారు.

## రాష్ట్రాన్ని ఏం చేయాలనుకుంటున్నారు?: కేటీఆర్



హైదరాబాద్: సామాన్యులపైకి సీఎం రేవంత్‌రెడ్డి బుల్డోజర్లను పంపి భయాన్ని సృష్టిస్తున్నారని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. హైదరాబాద్‌ను కాపాడుకోవడం చేతగాక బుల్డోజర్లను పంపారని దుయ్యబట్టారు. హైడ్రా హైరానాతో హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ పడిపోయిందన్నారు. గత రెండు నెలల్లో రిజిస్ట్రేషన్లు పడిపోయి, ఆదాయం తగ్గిందన్నారు. కొత్త ఆదాయం సృష్టించకపోయినా ఫర్వాలేదుగానీ, ఉన్నది ఊడగొడుతున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రాన్ని అసలేం చేద్దామనుకుంటున్నారని ప్రశ్నించారు.

## ఎలాంటి అప్లికేషన్ విడుదల చేయలేదు.. వదంతులు నమ్మొద్దు: పౌరసరఫరాల శాఖ

హైదరాబాద్: తెలంగాణలో ఫ్యామిలీ డిజిటల్ కార్డు పొందేందుకు పౌరసరఫరాల శాఖ అప్లికేషన్ విడుదల చేసినట్లు సామాజిక మాధ్యమాల్లో సర్క్యులేట్ అవుతున్న వదంతులపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. తెలుగు భాషలో ఫ్యామిలీ డిజిటల్ కార్డు అప్లికేషన్‌ను ఇప్పటివరకు రూపొందించలేదని స్పష్టం చేసింది. ఎలాంటి దరఖాస్తులు స్వీకరించడం లేదని తేల్చి చెప్పింది. ఫ్యామిలీ డిజిటల్ కార్డు కోసం తెలుగులో ఒక అప్లికేషన్ రూపొందించి అందుబాటులోకి తీసుకొచ్చినట్లు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరగడాన్ని ప్రభుత్వం గమనించింది. గ్రామాల్లో రేషన్ కార్డు లేని కుటుంబాలు ఆ దరఖాస్తు పూర్తి చేసి ఆధార్ సంఖ్య, సభ్యుల జనన ధ్రువీకరణ పత్రాలు, కుటుంబ ఫొటో జత చేసి స్థానిక వీఆర్‌ఓలకు ఇవ్వాలని ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో కొంత మంది దళారులు లబ్ధిదారులతో దరఖాస్తులు నింపిస్తున్నారు. మండల కేంద్రాల్లో జిరాక్స్ సెంటర్లు, తహసీల్దార్ కార్యాలయాల వద్ద హడావుడి కనిపిస్తోంది.

ఈ విషయం ప్రభుత్వం, పౌరసరఫరాల శాఖ దృష్టికి వచ్చింది. ఈ నేపథ్యంలో ఇందుకు సంబంధించి, కుటుంబ డిజిటల్ కార్డుల కోసం దరఖాస్తు చేయడానికి పౌరసరఫరాల శాఖ ఎటువంటి దరఖాస్తు రూపొందించలేదని స్పష్టం చేసింది. ఈ మేరకు పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ ప్రకటన విడుదల చేశారు. దళారులను నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించారు.




## ఈడీ కస్టడీకి సాహితీ ఇన్‌ఫ్రా ఎండీ లక్ష్మీనారాయణ



హైదరాబాద్: స్థిరాస్తి ప్రాజెక్టుల పేరుతో వినియోగదారులను నిండా ముంచిన సాహితీ ఇన్‌ఫ్రా కేసులో ఆ సంస్థ ఎండీ భూదాటి లక్ష్మీనారాయణను కస్టడీలోకి తీసుకునేందుకు నాంపల్లి కోర్టు అనుమతించింది. ఐదు రోజుల కస్టడీకి అనుమతిస్తూ ఆదేశాలు జారీ చేసింది. గత నెల 29న లక్ష్మీనారాయణను అరెస్టు చేసిన ఈడీ అధికారులు.. దర్యాప్తులో భాగంగా 10 రోజుల కస్టడీకి అనుమతించాలంటూ పిటిషన్ దాఖలు చేశారు.

దీనిపై తాజాగా విచారణ చేపట్టిన న్యాయస్థానం.. ఈ నెల 14 నుంచి 18 వరకు ఐదు రోజుల పాటు కస్టడీకి అంగీకరించింది. ఈడీ కార్యాలయంలో దర్యాప్తు కొనసాగనుంది. ప్రీలాంచ్ ఆఫర్ పేరుతో పలువురు వినియోగదారుల నుంచి రూ.కోట్లలో డబ్బులు వసూలు చేసినట్లు ఇన్‌ఫ్రా సంస్థపై ఆరోపణలు ఉన్నాయి. సుమారు 700 మంది కస్టమర్ల నుంచి రూ. 360 కోట్లు వసూలు చేసినట్లు ఈడీ ఆరోపిస్తోంది. ఇప్పటి వరకు ఈ కేసులో సంస్థకు చెందిన రూ.161.50 కోట్ల ఆస్తులను ఈడీ అటాచ్ చేసింది.

## మౌంట్ గోరిచెన్‌ను అధిరోహించిన పిన్న వయస్కుడిగా తెలంగాణ యువకుడు




తెలంగాణకు చెందిన యువ పర్వతారోహకుడు భుక్యా యశ్వంత్ అదుతేలు చేస్తున్నారు. అరుణాచల్ ప్రదేశ్‌లోని 6,488 ఎత్తు ఉన్న మౌంట్ గోరీ చెన్‌ను అధిరోహించిన అతి పిన్న వయస్కుడిగా నిలిచారు. 16వ ఏట పర్వాతారోహణను ప్రారంభించిన యశ్వంత్.. ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించడమే తన తదుపరి లక్ష్యం అంటున్నారు.

## గాంధీభవన్‌లో ముఖాముఖి.. పాల్గొన్న మంత్రి తుమ్మల

హైదరాబాద్, అక్టోబర్ 7: గాంధీభవన్‌లో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరయ్యారు. పార్టీ కార్యకర్తలు, సామాన్య ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. నేరేడు చర్ల మండలానికి సంబంధించిన భూమి విషయంలో యాదమ్మ అనే వృద్ధ మహిళ మంత్రికి ఫిర్యాదు చేసింది. దీనిపై వెంటనే స్పందించిన తుమ్మల.. సూర్యాపేట కలెక్టర్‌తో ఫోన్లో మాట్లాడి వెంటనే పరిష్కరించాలని సూచించారు. మరోవైపు ముఖాముఖి కార్యక్రమానికి కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా తమ సమస్యలు పరిష్కరించాలంటూ మంత్రికి అర్జీలు పెట్టారు. మొత్తం 95 అర్జీలను మంత్రి తుమ్మల స్వీకరించారు. భూ సమస్యలు, ఉద్యోగాలు, పెన్షన్స్, ఇందిరమ్మ ఇల్లు, పలు సమస్యలపై మంత్రికి వినతి పత్రాలు అందాయి. కొన్ని సమస్యలపై వెంటనే కలెక్టర్లతో మాట్లాడి పరిష్కరిస్తున్నామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు.

**రుణమాఫీ కనిపించడం లేదా..** ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గాంధీభవన్‌కు వస్తే తమ సమస్యలు తీరతాయని ప్రజలు వస్తున్నారని తెలిపారు. "మేం నిత్యం రైతుల్లోనే తిరుగుతున్నాం.. ప్రభుత్వంపై అసంతృప్తి ఉంటే మాకు నిరసన సెగ తాకేది కదా. తెలంగాణ ప్రభుత్వం లాంటి ప్రభుత్వం ఎక్కడైనా ఉంటే చూపించాలి.. అధికారం కోల్పోయిన బాధ ఒకరిది.. అధికారంలోకి రావాలనే బాధ ఇంకొకరిది.. తెలంగాణ రుణమాఫీ మోదీకి కనిపించడం లేదా? 18 వేల కోట్ల రుణమాఫీ బీజేపీకి కనిపించడం లేదా? బీజేపీ పాలిత రాష్ట్రాలలో రుణమాఫీ చేసారా? రుణమాఫీ పూర్తి కాగానే రైతు భరోసా నిధులు వేస్తాం అని స్పష్టం చేశారు.

## బంగారు తెలంగాణ నుంచి బెదిరింపుల వరకు.. హన్మంతరావు వ్యాఖ్యలపై ఆర్ఎస్ ప్రవీణ్ మండిపాటు

హైదరాబాద్: మాజీ సీఎం కేసీఆర్ పాలనలో బంగారు తెలంగాణను స్వప్నించిన ప్రజలు నేడు బెదిరింపుల తెలంగాణను చూస్తున్నారని బీఆర్ఎస్ సీనియర్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. కాంగ్రెస్ పాలనలో బెదిరింపుల రాజ్యం నడుస్తోందని విమర్శించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే హరీశ్ రావులనుద్దేశించి కాంగ్రెస్ నేత మైనంపల్లి హన్మంతరావు చేసిన వ్యాఖ్యల తాలూకు వీడియోను ఆయన ఎక్స్‌లో షేర్ చేశారు.

**ప్రతి మాటా నేరం..** "మైనంపల్లి హన్మంతరావు బెదిరింపుల భాష వినండి. కేటీఆర్, హరీష్ రావు గార్ల మీద పెట్రోలు పోసి ఈయన మీద కూడా పోయాలంట . పక్కా ప్లాను వేస్తరట..జైలుకు కూడా పోతారట. TelanganaDGP.. హన్మంతరావు బహిరంగంగా మాట్లాడిన ప్రతి మాటా నేరం. ఇవన్నీ వారు బహిరంగంగా చేసిన వ్యాఖ్యలు! నిజానికి దీని మీద పోలీసులు సుమోటో కేసు నమోదుచేసి దర్యాప్తు చేయాలి. ఆయన వ్యాఖ్యలపై అక్టోబర్3 నే గజ్వేల్, సిద్దిపేట పోలీసు స్టేషన్లలో ఫిర్యాదు చేశాం. పోలీసుల నుంచి ఇంతవరకు ఎలాంటి స్పందన రాలేదు. స్థానిక ఉన్నతాధికారులతో మాట్లాడితే న్యాయ సలహా తీసుకుంటామని అంటున్నారు. నాకొక అనుమానం. సామాన్య పౌరుడు ఇలానే మాట్లాడితే వెంటనే కేసులు బుక్ చేయరా? మొన్న హైడ్రా బాధితులు కడుపుకాలి సీఎం రేవంత్ రెడ్డిపై శాపనార్థాలు పెడితే న్యాయ సలహా తీసుకొనే కేసులు పెట్టారా? రాత్రికి రాత్రి టాస్క్ ఫోర్స్ వచ్చి అక్రమంగా వాళ్లను ఖాళీ చేయించారు కదా. కళ్ల ముందే నేరం జరిగినా అన్నింటికీ న్యాయ సలహా తీసుకుంటే మరి మనకు ఎందుకు అకాడమీల్లో ట్రైనింగు, సెక్షన్ 154(1) %జతీ ్రాజ% కింద విస్తృతమైన అధికారాలు, పోలీసు వాహనాలు, యూనిఫాం?"అని ప్రవీణ్ కుమార్ మండిపడ్డారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com